RNI.No. APTEL/2014/57702 ESTD: 1999 www.voodayam.com




# వుదయం




గుంటూరు 11-07-2026 శనివారం | సంపుటి : 13 | సంచిక : 119 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on



# రైతులకు భరోసా..

## ప్రత్యర్థులకు హెచ్చరిక

### ఖమ్మం గడ్డపై సీఎం రేవంత్ శంఖారావం

మధిర, జూలై 10 (వుదయం) :
ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో నిర్వహించిన 'రైతు ఆశీర్వాద సభ' అట్టహాసంగా జరిగింది. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, 1.44 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 1,009.15 కోట్ల రైతు భరోసా నిధులను బటన్ నొక్కి విడుదల చేశారు. ఇదే వేదికపై పలువురు రైతులకు ఈపట్టాదార్ పాస్‌బుక్‌లను అందజేశారు.

**అభివృద్ధికి ఖమ్మం గుండెకాయ**

సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ''రాజకీయంగా పాలమూరు నాకు ప్రాణం అయితే, ఖమ్మం జిల్లా నా ఎదుగుదలకు గుండెకాయ వంటిది. 2023 జూలైలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పార్టీలో చేరినప్పుడు ఖమ్మం ప్రజలు ఉప్పెనలా వచ్చి బీఆర్ఎస్‌ను ఎలా బొందపెట్టారో, నేడు కూడా అదే స్థాయిలో తరలివచ్చారు'' అని హర్షం వ్యక్తం చేశారు. గత ఎన్నికల నుంచి ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించి, 'పాపాల భైరవుడిని' ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశారని ఎద్దేవా చేశారు.

**2029లో 182 స్థానాల్లో గెలుపు**

రాబోయే రోజుల్లో నియోజకవర్గాల పునర్విభజన జరగనుందని, దీనివల్ల తెలంగాణలో అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు, లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కు పెరుగుతాయని రేవంత్ ప్రకటించారు. 2029 మేజూన్ మాసాల్లో జరిగే ఎన్నికల్లో 117 స్థానాలను గెలుచుకుని కాంగ్రెస్ రెండోసారి అధికారంలోకి వస్తుందని భద్రాచలం రాముడిపై ఆనగా శపథం చేశారు. రాజకీయ సర్వేల పేరుతో దుష్ప్రచారం చేస్తున్న వారికి ఇది సమాధానమని, ఇందుకోసం రోజుకు 18 గంటలు శ్రమిస్తామని స్పష్టం చేశారు.

**కల్వకుంట్ల కుటుంబంపై తీవ్ర విమర్శలు**

కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ రాజకీయ ముఖచిత్రం నుంచి పాతాళానికి తొక్కే వరకు కాంగ్రెస్ కార్యకర్తలు విశ్రమించరని సీఎం హెచ్చరించారు. ''మేడిగడ్డ ప్రాజెక్టును మళ్లీ నింపుతామంటూ రాజకీయాలు చేస్తున్నారు. ఒకసారి మేడిగడ్డ కుంగితేనే ఇంత నష్టం జరిగింది.. మళ్లీ నీళ్లు నింపితే భద్రాచలం రాముడు మునిగిపోతాడు. మీ దుష్ట రాజకీయాల కోసం ప్రాణాలతో చెలగాటమాడుతారా?'' అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసేందుకు కెసిఆర్ కుటుంబం సిద్ధమైందని, ఆ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు.



**సంక్షేమమే మా బాట**

బీఆర్ఎస్ హయాంలో అమలైన పథకాలతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు అందిస్తోందని సీఎం వివరించారు. రైతు భరోసాను రూ. 12 వేలకు పెంచి, రైతు రుణమాఫీ ద్వారా అన్నదాతలను రుణవిముక్తులను చేశామని గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విన్నపం మేరకు మధిరకు ఇంజనీరింగ్ కాలేజీని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తులో దేశంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసుకునే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రామసాయం రఘురాం రెడ్డి, బలరాం నాయక్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

## హర్మ్యూజ్ జలసంధిపై ఇరాన్ వాదన అబద్ధం



వాషింగ్టన్ :
అంతర్జాతీయ జలమార్గమైన హర్మ్యూజ్ జలసంధిపై ఆధిపత్యం తమదేనంటూ ఇరాన్ చేసిన ప్రకటనను అమెరికా తీవ్రంగా ఖండించింది. హర్మ్యూజ్ జలసంధి తమ నియంత్రణలోనే ఉందని, తమ అనుమతి లేకుండా నౌకలు ప్రయాణించకూడదని ఇరాన్ చేసిన వాదనలో ఏమాత్రం నిజం లేదని యూఎస్ సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా అమెరికా కీలక వివరాలను వెల్లడించింది.

**వాస్తవం ఇదీ..**

హర్మ్యూజ్ జలసంధి మీదుగా నౌకలు రాకపోకలు సాగించాలంటే, తాము నిర్దేశించిన మార్గాల్లోనే ప్రయాణించాలని, ఈ జలమార్గంలో అమెరికా జోక్యాన్ని తాము ఏమాత్రం సహించబోమని ఇరాన్ అధికారిక మీడియా ద్వారా ప్రకటించింది. ఇటీవల ఒమన్ కారిడార్ గుండా వెళ్తున్న కొన్ని నౌకలను ఇరాన్ బలగాలు నిలిపివేసి, తాము చెప్పిన మార్గంలోనే వెళ్లాలని ఆదేశించిన నేపథ్యంలో ఈ ఉద్రిక్తత చోటు చేసుకుంది.

దీనిపై యూఎస్ సెంట్రల్ కమాండ్ స్పందిస్తూ, ''హర్మ్యూజ్‌పై ఇరాన్‌కు ఎలాంటి నియంత్రణ లేదు. ఈ ఏడాది మే నెల నుంచి ఇప్పటివరకు 800 వాణిజ్య నౌకలు సురక్షితంగా ఈ మార్గం గుండా ప్రయాణించాయి. వీటి ద్వారా 380 మిలియన్ బ్యారెళ్ల ముడిచమురు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరింది. అమెరికా దళాల పర్యవేక్షణ, భద్రతతోనే ఈ రవాణా సాధ్యమైంది'' అని స్పష్టం చేసింది.

**ఉద్రిక్తతల వేళా యథావిధిగా రవాణా**

అమెరికాఇరాన్ మధ్య పరస్పర దాడులు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్నప్పటికీ, హర్మ్యూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల ప్రయాణం ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతోంది. తాజా షిప్ ట్రాకింగ్ డేటా ప్రకారం, ఐదు ఎల్ఎన్‌జీ (LNG) ట్యాంకర్లు ఈ జలమార్గంలోకి ప్రవేశించాయి. వీటిలో ఒకటి గ్రీస్ షిప్పింగ్ కంపెనీకి చెందినది కాగా, మిగిలిన నాలుగు ఖతార్‌కు సంబంధించినవిగా గుర్తించారు. అలాగే, జూలై 7 నుంచి 9వ తేదీ మధ్య కాలంలో జపాన్‌కు చెందిన 22 నౌకలు ఎటువంటి ఇబ్బందులు లేకుండానే హర్మ్యూజ్ జలసంధిని దాటినట్లు ఆ దేశ రవాణా మంత్రిత్వ శాఖ ధృవీకరించింది. అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకమైన ఈ జలమార్గంలో అమెరికా తన పట్టును కొనసాగిస్తూ, నౌకల రాకపోకలకు భరోసా ఇస్తోంది.

## కాళేశ్వరంపై చిల్లర విమర్శలకు స్పందించను

హైదరాబాద్, జూలై 10 (వుదయం) :
కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై తనపై వస్తున్న విమర్శలను బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా ఖండించారు. రాజకీయాల ముసుగులో ప్రజల జీవితాలతో ఆడుకోవద్దని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తనకు వ్యతిరేకంగా వస్తున్న ఆరోపణలు, చిల్లర వ్యాఖ్యలపై స్పందించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

మేం స్వయం ప్రకాశకులం

''నేను ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును చదివే వ్యక్తిని కాను. మేం స్వయం ప్రకాశకులం, ఎవరినో అనుసరించి ఆడే వ్యక్తులం కాదు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలను, నీటి పారుదల రంగానికి సంబంధించి నెలకొన్న వివక్షను బీజేపీ ప్రాధాన్య అంశంగా పరిగణనలోకి తీసుకుంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పటి నుంచీ నీటి ప్రాజెక్టుల కోసం పోరాటం చేస్తున్న వ్యక్తిని నేను'' అని ఈటల గుర్తు చేశారు.



ఎస్సారెస్పీతోనే జిల్లా అభివృద్ధి

ఎస్సారెస్పీ ప్రాజెక్టు రాకతోనే తన జిల్లాలో వ్యవసాయం పుంజుకుందని, కాళేశ్వరం కంటే ముందే అక్కడ జలయజ్ఞం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ఎస్సారెస్పీ చరిత్ర, ప్రాధాన్యత గురించి అవగాహన ఉన్న వారందరికీ ఈ వాస్తవాలు తెలుస్తాయని ఆయన అన్నారు.

ప్రభుత్వంపై విమర్శలు

ప్రస్తుత ప్రభుత్వంపై మండిపడిన ఈటల రాజేందర్.. ''ప్రస్తుతం ఎల్‌నినో హెచ్చరికలు ఉన్నా, ప్రభుత్వం ఏమాత్రం అప్రమత్తంగా లేదు. రైతులకు సాగునీరు అందించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉంది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వినియోగంపై ప్రభుత్వం వెంటనే విశ్రాంత ఇంజినీర్లతో చర్చించి, వాస్తవాలను బయటపెట్టాలి'' అని డిమాండ్ చేశారు.

## మూసీ నది సమీపంలో

# దడపుట్టించిన మంటలు

- చాదర్‌ఘాట్‌లో భారీ అగ్నిప్రమాదం
- నిప్పల కొలిమిగా మారిన డెకరేషన్ గోదాం
- దట్టమైన పొగతో ఉక్కిరిబిక్కిరి
- ప్రాణభయంతో పరుగులు తీసిన స్థానికులు

హైదరాబాద్, జూలై 10 (వుదయం) :
హైదరాబాద్ : నగరంలోని చాదర్‌ఘాట్ పరిధిలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మూసీ నది సమీపంలో ఉన్న ఒక ఈవెంట్ మేనేజ్‌మెంట్ డెకరేషన్ వస్తువుల గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి, క్షణాల్లోనే ఉగ్రరూపం దాల్చాయి.

**భయాందోళనలో స్థానికులు**

గోదాంలో ఫంక్షన్లకు వినియోగించే ప్లాస్టిక్, థర్మాకోల్, బట్టలు మరియు రసాయనాలతో కూడిన సులభంగా మంటలు అంటుకునే పదార్థాలు భారీగా నిల్వ ఉండటంతో మంటలు వేగంగా విస్తరించాయి. భారీ స్థాయిలో ఎగసిపడుతున్న మంటలు, ఆకాశాన్ని తాకుతున్న దట్టమైన నల్లటి పొగతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పొగ ప్రభావంతో చుట్టుపక్కల నివాసాల్లోని ప్రజలకు ఊపిరి ఆడక ఇబ్బంది పడటంతో, ప్రాణభయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

సహాయక చర్యల్లో అగ్నిమాపక సిబ్బంది

స్థానికుల సమాచారంతో అప్రమత్తమైన చాదర్‌ఘాట్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో సమీప ప్రాంతాల్లోని ట్రాఫిక్‌ను పోలీసులు మళ్లించి, గోదాం చుట్టుపక్కల ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పలు ఫైర్ ఇంజన్ల సహాయంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు.

గోదాం లోపల ఎవరైనా కార్మికులు చిక్కుకున్నారా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ అగ్నిప్రమాదానికి గల కారణాలు, జరిగిన ఆస్తి నష్టం వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని పోలీసులు వెల్లడించారు. పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడవుతాయని అధికారులు తెలిపారు.



## అరెస్టుకు, మరణానికి సిద్ధమన్న షేక్ హసీనా

### డిసెంబర్‌లో బంగ్లాకు వెళ్తానన్న మాజీ ప్రధాని హసీనా

న్యూఢిల్లీ :
బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా సంచలన నిర్ణయం తీసుకున్నారు. తాను స్వదేశానికి తిరిగి వెళ్లి, కోర్టు ముందు లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. తనకు ప్రాణహాని ఉన్నప్పటికీ, తన పార్టీ నేతలు, కార్యకర్తల కోసం తాను స్వదేశానికి వెళ్లక తప్పదని ఆమె పేర్కొన్నారు. ఒక అంతర్జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాలను వెల్లడించారు.

అరెస్టుకైనా.. మరణానికైనా సిద్ధం

''స్వదేశానికి వెళ్లిన తర్వాత వారు నన్ను అరెస్టు చేయవచ్చు, లేదా చంపేసే అవకాశమూ ఉంది. ఏది జరిగినా నేను వెళ్లాల్సిందే. నా పార్టీ నేతలు, కార్యకర్తలు తీవ్ర అణచివేతకు గురవుతున్నారు. ఒకవేళ మరణం సంభవిస్తే.. నా తల్లిదండ్రులను ఖననం చేసిన చోట, నా సొంత గడ్డపైనే తుది శ్వాస విడవాలని కోరుకుంటున్నాను'' అని హసీనా భావోద్వేగంతో వ్యాఖ్యానించారు. ఈ డిసెంబర్‌లో తనతో పాటు అవామీ లీగ్ పార్టీకి చెందిన సీనియర్ నేతలు కూడా బంగ్లాకు వెళ్లి కోర్టుల్లో లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె తెలిపారు. అయితే, ఈ విషయంలో బంగ్లాదేశ్‌లో ఉన్న ప్రస్తుత ప్రభుత్వంతో తాను ఎలాంటి సంప్రదింపులు జరపలేదని స్పష్టం చేశారు.

ఎందుకు ఈ నిర్ణయం?

ఆగస్టు 5, 2024న బంగ్లాదేశ్‌లో జరిగిన హింసాత్మక నిరసనల నేపథ్యంలో షేక్ హసీనా దేశం విడిచి భారత్‌కు చేరుకుని ఆశ్రయం పొందుతున్న విషయం తెలిసిందే. అయితే, నిరసనలను అణచివేయడంలో తన పాత్ర ఉందంటూ ఆమెపై అక్కడ అనేక కేసులు నమోదయ్యాయి. ఈ కేసులను విచారించిన బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్, 2025లో ఆమెకు మరణశిక్ష విధించింది. తన అప్పగింత కోసం బంగ్లా ప్రభుత్వం భారత్‌కు నిరంతరం లేఖలు రాస్తున్న నేపథ్యంలోనే, న్యాయపరంగా ఎదుర్కోవడానికే తాను స్వదేశానికి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు ఆమె పరోక్షంగా పేర్కొన్నారు.



కేంద్రం పరిశీలనలో అప్పగింత అంశం

హసీనాను తమకు అప్పగించాల్సిందిగా బంగ్లాదేశ్ ప్రభుత్వం భారత్‌ను పలుమార్లు కోరింది. ఈ నేపథ్యంలో ఆమె తీసుకున్న తాజా నిర్ణయం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. హసీనా అప్పగింతకు సంబంధించి న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తున్నట్లు భారత కేంద్ర ప్రభుత్వం ఇదివరకే వెల్లడించింది. స్వదేశానికి వెళ్లేందుకు సిద్ధమని ఆమె గతంలోనే సంకేతాలు ఇచ్చినప్పటికీ, డిసెంబర్ కచ్చితమైన సమయమని స్పష్టం చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.




వుదయం
General 07 Jul 2026 Page 2
https://epaper.voodayam.com/clip/133915
డ్యూటీకి డుమ్మా.. దందా జోరు..?
అధికారుల అండతో వసూళ్ల దందా..?


# వుదయం కథనానికి స్పందించిన జిల్లా అటవీ శాఖ అధికారి

- **విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 9 (వుదయం ప్రతినిధి):**

వుదయం దినపత్రికలో జూలై 7న ప్రచురితమైన "డ్యూటీకి డుమ్మా.. దందా జోరు..?" అనే కథనంపై జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రం సింగ్ స్పందించారు. కథనంలో ప్రస్తావించిన అంశాలను తీవ్రంగా పరిగణించినట్లు తెలిపారు.ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. విచారణలో వాస్తవాలు నిర్ధారణ అయితే విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించినా, అక్రమాలకు పాల్పడినట్లు తేలినా సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అటవీ శాఖలో పారదర్శకత, బాధ్యతాయుత పాలనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, మీడియా కథనాలను కూడా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖ అధికారి తెలిపారు. ప్రజలు అక్రమాలు లేదా అవకతవకలపై నిర్భయంగా సమాచారం అందించాలని, ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారిస్తామని పేర్కొన్నారు.




# సమగ్ర సవరణ ప్రక్రియ పై వీడియో కాన్ఫరెన్స్

**మహబూబ్ నగర్, జూలై 10(వుదయం ప్రతినిధి):**

భారత ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష సమావేశంలో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు.న్యూఢిల్లీ నుంచి భారత ఎన్నికల కమిషన్ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ, హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సుదర్శన్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో జిల్లాల వారీగా ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించారు. సమీక్ష సందర్భంగా సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ, ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అత్యున్నత ప్రాధాన్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై నిరంతర సమీక్షలు నిర్వహిస్తూ బూత్ లెవల్ అధికారుల (బీఎల్‌వోలు) పనితీరును రోజువారీగా పర్యవేక్షించాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, ఫారాల నింపడం, డిజిటైజేషన్ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఇతర జిల్లాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను అనుసరించి పనుల్లో వేగం పెంచాలని సూచించారు.
ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్‌లో వెనుకబడిన జిల్లాల పురోగతిని ప్రత్యేకంగా సమీక్షించిన ఆయన, నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తిచేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి బీఎల్‌వో రోజుకు కనీసం 10 శాతం లక్ష్యాన్ని సాధించేలా కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. తదుపరి సమీక్ష నాటికి వెనుకబడిన జిల్లాలు గణనీయమైన పురోగతి సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జాఫర్‌తో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# స్నేహపూర్వక వాతావరణంలో సర్వే పనులు చేపట్టాలి

- **జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) కే. వెంకటాచారి.**

**వికారాబాద్, జూలై 10; (వుదయం జిల్లా ప్రతినిధి):**

స్నేహ పూర్వక వాతావరణం లో సర్వే పనులు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి అధికారులకు సూచించారు.శుక్రవారం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో కేపీ లక్ష్మీదేవిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ జాయింట్ సర్వేపై రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... కేపీ లక్ష్మీదేవిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా వేల కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ కుగాను పరిగి మండలం సయ్యద్ పల్లి, కులకచర్ల మండలం అల్లాపూర్ గ్రామాలకు సంబంధించిన 1253 ఎకరాల భూమిని సేకరించవలసిన ఉంటుందని ఆయన తెలిపారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా రైతుల హక్కులను, సంక్షేమాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సర్వే చేపట్టే క్రమంలో అధికారులు సమన్వయం, అంకితభావంతో పని చేయాలని ఆయన సూచించారు. ప్రాజెక్టు యొక్క ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలని ఆయన తెలిపారు.
ఈ సమావేశంలో ఆర్డీఓ వాసు చంద్ర, తహసిల్దార్లు వెంకటలక్ష్మి, పురుషోత్తం, భూ సేకరణ సెక్షన్ సూపరింటెండెంట్ నఫీజ్ ఫాతిమా, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, ఇరిగేషన్ ఇంజనీయర్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

# వృత్తి గౌరవాన్ని నిలబెట్టుకున్న వారే నిజమైన జర్నలిస్టులు

- **మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి**

**హైదరాబాద్:జులై10:**



ప్రజల ఆకాంక్షాలకు అనుగుణంగా, నీతి, నిజాయితీ, నిర్భీతితో పనిచేస్తూ, వృత్తి గౌరవాన్ని నిలబెట్టుకునేవారే నిజమైన జర్నలిస్టులని, అలాంటి వారినే సమాజం అక్కున చేర్చుకుంటుందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో, తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన కృతజ్ఞత సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గతంలో అక్రెడిటేషన్ కార్డులను కొందరు అంగట్లో సరుకుగా మార్చి, దాని విలువ లేకుండా చేసారని, ఈ చర్య వల్ల సమాజంలో దుష్పరిణామాలు చోటు చేసుకున్నాయని శ్రీనివాస్ రెడ్డి విచారం వ్యక్తం చేసారు. అక్రెడిటేషన్ అనేది వృత్తి గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలన్నారు. మీడియా రంగాన్ని కలుషితం చేస్తూ అపహాస్యానికి గురిచేస్తున్న వారిని గుర్తించి, వారికి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మీడియాలో చోటు చేసుకుంటున్న పరిణామాలను ఆసరగా చేసుకుంటూ, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టులు సాధించుకున్న సౌకర్యాలను, చట్టాలను రద్దు చేసేస్తుందని, ఆ చర్యలను అడ్డుకోవాలంటే జర్నలిజం వృత్తి నిబద్ధతను మనం నిరూపించుకోవాల్సి ఉంటుందని ఆయన సూచించారు. సామాన్యుల భావప్రకటన స్వేచ్ఛకు సోషల్ మీడియా మంచి వేదిక అయినప్పటికీ, అందులో మంచితో సమానంగా చెడు, కల్పితాలు, అవాస్తవాలు ట్రోల్ అవుతుండడంతో దానికి విలువ లేకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. ఈ నేపథ్యంతోనే దేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం సవరిస్తూ కఠినమైన నిర్ణయాలను తీసుకోబోతుందని ఆయన అప్రమత్తం చేసారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో వీడియో జర్నలిస్టులు సంఘటితమై బలమైన సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఫోటోగ్రఫీ డే మాదిరిగానే వీడియో గ్రఫీ డేను కూడా నిర్వహించడానికి అకాడమీ యోచిస్తుందన్నారు. ఏఐ ను తట్టుకొని నిలబడే విధంగా వీడియో జర్నలిస్టులకు అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను నిర్వహిస్తామని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేనివిధంగా వీడియో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు, సంక్షేమానికి తమ సంఘం కృషి చేస్తున్నట్లు ఆయన అన్నారు. ఆయా మీడియా సంస్థల్లో పని చేస్తున్న వీడియో జర్నలిస్టులతో పాటు ఫ్రీలాన్స్ వీడియో జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేసేందుకు తాము నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వీడియో జర్నలిస్టులను తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని విరాహత్ అలీ కోరారు. తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు హరీష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సన్నీ, అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు, రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు వనం నాగరాజు, టీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. కిరణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి అశోక్, తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఫ్రీలాన్స్ వీడియో జర్నలిస్టులకు మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అక్రెడిటేషన్ కార్డుల ప్రదానోత్సవం జరిగింది.



# విద్యార్థులకు ప్రభుత్వం ఏకరూప దుస్తులుఇవ్వాలి

- **తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణ**

**సంగారెడ్డి, వుదయం:**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం వెంటనే ఏకరూప దుస్తులు ఇవ్వాలని తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణ డిమాండ్ చేశారు.. శుక్రవారం తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా ఇంచార్జి విద్యాధికారి శంకర్ కు వినతిపత్రం అందజేశారు.. . సర్వే లో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవు వర్షం వస్తే పెద్దారెడ్డి పేటలో కురుస్తుంది అన్నారు.. రెగ్యులర్ సోషల్ టీచర్ నియమించాలి,లైబ్రరీ ఏర్పాటు చేయాలి సైన్స్ ల్యాబ్ లో సౌకర్యాలు కల్పించాలి.. మంతూర్ పాఠశాలలో 3 ఉపాధ్యాయులకు 2 మాత్రమే ఉన్నారు ,మరో ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు.

# ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ భవన నిర్మాణ భూమి పూజ

- **పాల్గొన్నా పలువురు ప్రముఖ్యులు**
- **రాష్ట్ర కార్మిక శాఖ మరియు జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు గడ్డం.వివేక్ వెంకటస్వామి**
- **ఎంపీ.సురేష్ కుమార్ షెట్కార్**
- **ఇండస్ట్రియల్ చైర్మెన్ & డీసీసీ జిల్లా అధ్యక్షులు నిర్మలా జగ్గారెడ్డి**
- **మాజీ మంత్రివర్యులు, జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ డా.ఏ.చంద్రశేఖర్**
- **TMREIS వైస్ చైర్మన్ ఫాహీం ఖురేషీ**
- **సెట్విన్ కార్పొరేషన్ చైర్మెన్ గిరిధర్ రెడ్డి**

**కోహీర్ జులై 10 (వుదయం ప్రతినిధి):**



జహీరాబాద్ మండలంలోని బుర్దిపహాడ్‌లో ఆధునిక ఉపాధి శిక్షణ శాఖ,అడ్వాన్స్ టెక్నాలిజి సెంటర్ (ATC) భూమి పూజ చేయడం జరిగింది.జహీరాబాద్ నియోజకవర్గంలోని యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ అందించడం ద్వారా ఉపాధి అవకాశాలు మరింత విస్తరిస్తాయి మరియు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ద్వారా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరచుకుని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకునే అవకాశం కలుగుతుంది.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి గ, జహీరాబాద్ మునిసిపల్ చైర్మన్ యూనుస్ , సీడీసీ చైర్మెన్ ముబీన్ ,మాజీ ఇండస్ట్రియల్ చైర్మెన్ తన్వీర్ ,మండల అధ్యక్షులు హుగ్గేల్లి రాములు , భాస్కర్ రెడ్డి , సువర్ణమల్లన్న పాటిల్ , ఉదయశంకర్ పాటిల్ పవన్ రాథోడ్ , పట్టణ అధ్యక్షులు నరేష్ గౌడ్ ,ముజాఫ్ఫార్ , బ్లాక్ అధ్యక్షులు ఆర్షద్ , సామెల్. మాజీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి హన్మంత్ రావ్ పాటిల్.మాజీ పట్టణ అధ్యక్షులు కందేం.నర్సింలు .నియోజకవర్గ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్ ,కాంగ్రెస్ నాయకులు ఉజ్వల్ రెడ్డి ,బర్దిపాడ్ గ్రామ సర్పంచ్ మల్లికార్జున్ , ప్రజాప్రతినిధులు సర్పంచులు, కౌన్సలర్లు, అధికారులు, స్థానిక నాయకులు, యువత మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.




# 40 ఏళ్ల గ్రామ ప్రజల ఆధారాన్ని కూల్చివేత

- **పంచాయతీ అనుమతిపై అనుమానాలు"**

**మెదక్ జిల్లా / అల్లాదుర్గం మండలం (వుదయం) ప్రతినిధి జులై 10:**

అల్లాదుర్గం మండల్ గడి పెద్దాపూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఉన్న ప్రభుత్వ స్థలంలో సుమారు 40 సంవత్సరాల క్రితం గ్రామ ప్రజల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోరు పక్కన ఉన్న గదిని అక్రమంగా కూల్చివేయడం పై. గ్రామ ప్రజలు అధికారులను ప్రశ్నించగా, "అనుమతి తీసుకున్నాం" అంటూ దురుసుగా ప్రవర్తించారు.
ఒకవేళ ఆ భవనం శిథిలావస్థకు చేరుకుని ఉంటే, గ్రామ పంచాయతీ ఆధీనంలోకి తీసుకుని భవిష్యత్ గ్రామ అవసరాల కోసం వినియోగించాల్సింది పోయి, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం ఎందుకు జరిగిందో తెలియజేయాలని కోరుతున్నాము.
ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజల తరపున వినతిచేస్తున్నాము. ఈ కార్యక్రమంలో బి ఆర్ యస్ యువనాయకులు మరువెల్లి కృష్ణ గౌడ్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు

- **టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు**

**నారాయణపేట జూలై 10 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కేంద్రంలో మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు .ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలం విక్కి సహాయంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. బస్ స్టాండ్ పరిసర ప్రాంతాలు, పాన్ షాపులు, కొరియర్ షాప్స్ లలో ఎరువుల దుకాణాలు అనుమానాస్పద ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టామని తెలిపారు.మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలు వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారని ఎస్ఐ పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు సమాజాన్ని నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజలు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు .ఈ తనిఖీల్లో నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పీసీ పరమేశ్, హెడ్ కానిస్టేబుల్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# రోజుకు 100 ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ చేయాలి

- **బిఎల్ఓ లకు జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశాలు**

**వికారాబాద్, జూలై 10; (వుదయం జిల్లా ప్రతినిధి):**

రోజుకు వంద మంది ఓటర్ల వివరాలను డిజిటలై జేషన్ చేయాలని జిల్లా కలెక్టర్ దీపకు తివారీ బీఎల్ఓ లను ఆదేశించారు.శుక్రవారం వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆలంపల్లి, కొత్త గడి వార్డులలో ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యటించి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఏ ఒక్కరూ ఓటు హక్కును కోల్పోకుండా ప్రతి ఇంటి నుండి ఎన్యూమరేషన్ ఫారాలను తీసుకొని డిజిటలైజేషన్ చేయాలని బిఎల్ఓ లకు కలెక్టర్ సూచించారు. శని, ఆదివారాలలో ప్రభుత్వ సెలవు ఉన్నందున తప్పనిసరిగా ఎస్ఐఆర్ ను చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. వార్డులలో విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సహకారం తీసుకొని ఎస్ఐఆర్ ను వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు.జిల్లా కలెక్టర్ తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, డిఆర్ఓ స్వర్ణలత, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి లు ఉన్నారు.

# దిగ్విజయంతంగా ముగిసిన మెగా ఉచిత వైద్య శిబిరం

- **నిరంతరం నిమ్నుల ఆరోగ్యం కోసం నేత్రం**
- **బిజెపి రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు**

**ఊర్కొండ, న్యూస్ 10 వుదయం ప్రతినిధి:**



నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఈరోజుఊరుకొండ మండల కేంద్రంలో శుక్రవారం ప్రధాన రహదారి జడ్చర్ల కోదాడ హైవే సమీపంలో స్థానిక సర్పంచ్ మేకల మంజుల శ్రీనివాస్ రాష్ట్ర భాజపా నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో కోరుకొండ మండలం సమీప ప్రాంతాలకు చెందిన రోగులు 350నుంచి 400 మంది వరకు పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు హాస్పిటల్ ఎండి డాక్టర్ వంశీధర్ రెడ్డి,డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి డయాబెటిస్ నిపుణులు ,దవాఖాన జనరల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, స్థానిక ఎస్సై రమాదేవి. డాక్టర్,మౌన్య,డాక్టర్ రంజిత్, శ్రీనివాస్,ప్రకాష్,ముత్యాల్,కుమార్,బాలకృష్ణ, తదితరులు పాల్గొనడం జరిగింది...



# ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన

- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల జూలై 10 (వుదయం బ్యూరో)**

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా శుక్రవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు,సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ మధు మోహన్, గద్వాల్ తహసీల్దార్ హరి కృష్ణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, సంబంధిత ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రెండు రోజుల్లోగా 50 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

- **ఏఈఆర్‌వోలు పోలింగ్ స్టేషన్ వారీగా ప్రతిరోజూ సమీక్ష నిర్వహించాలి**
- **ఎస్ఐఆర్ అమలులో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు**
- **ఓటర్లు పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే బీఎల్ఓలకు అందించాలి**
- **బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి బీఎల్ఓలకు సహకరించాలి**
- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, జూలై 10,వుదయం:**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను పూరించి వీలైనంత త్వరగా సంబంధిత బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఫారాల వివరాలను నిర్దేశిత గడువులోగా డిజిటలైజ్ చేయాల్సి ఉన్నందున ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో ఎస్ఐఆర్ అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా ఇప్పటివరకు సాధించిన పురోగతిని తెలుసుకొని, గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి
ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్ల నుంచి ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, వాటి వివరాల డిజిటలైజేషన్‌లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న ఏఈఆర్‌వోలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.గడువు సమీపిస్తున్న నేపథ్యంలో శని, ఆదివారాలు కూడా ప్రత్యేకంగా పనిచేసి, వచ్చే సోమవారం నాటికి 50 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.
ప్రతి బీఎల్‌ఓకు రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించాలని, ఏఈఆర్‌వోలు, ఈఆర్‌వోలు పోలింగ్ స్టేషన్ వారీగా ప్రతిరోజూ సమీక్ష నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి బిఎల్ఓ లను మానిటరింగ్ చేయాలని సూచించారు. ఓటర్ల నుంచి అందిన ఎన్యూమరేషన్ ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే డిజిటలైజ్ చేసి రోజువారీ ప్రగతి నివేదికను సమర్పించాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంగీత, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు

**గద్వాల, జూలై 10 (వుదయం కరస్పాండెంట్):**



ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సోమవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి పర్యటనతో పాటు, ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) పనులలో అధికారులు నిమగ్నమై ఉన్నందున ఈనెల 13వ తేదీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఇట్టి విషయాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లా కార్యాలయానికి వచ్చి అసౌకర్యానికి గురికాకూడదని సూచించారు.

# రాంపూర్ లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం



**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ పొన్నబోయిన ప్రవీణ్, ఉప సర్పంచ్ శ్రీ ఏల అనిల్, పాలకవర్గం ఆధ్వర్యంలో ఫ్రై డే డ్రై డే నిర్వహించడం జరిగింది, దోమల నివారణ కోసం, డెంగ్యూ వంటి వ్యాధులు రాకుండా కుండీలలో, హౌజులలో, కుండలలో నిల్వ ఉన్న నీటిని తొలగించడం జరిగింది. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్థులకు తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి చంద్రహాస్, ఆశా కార్యకర్త మమత, వి ఓ ఏ స్వప్న హాజరైనారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన మోహన్ నాయక్

**మెదక్ జిల్లా, వుదయం:**

నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు భాస్కర్ గౌడ్ భార్య లత మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషాద సంఘటన సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మీనాక్షి మోహన్ నాయక్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, పిల్లల కోసం రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, గ్రామ ఉపాధ్యక్షుడు శేఖర్, రాజు,సురేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్‌బీఐ పరిశ్రమల శాఖ సమ్మిళితం



**రంగారెడ్డి జిల్లా**

రంగారెడ్డి జిల్లాలో MSME అభివృద్ధికి ఎస్‌బీఐ-పరిశ్రమల శాఖ సమన్వయం రంగారెడ్డి జిల్లాలో సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల (MSME) అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలనే లక్ష్యంతో, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆహ్వానం మేరకు జిల్లా పరిశ్రమల కేంద్రం (DIC) జనరల్ మేనేజర్, పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీమతి శ్రీలక్ష్మి సికింద్రాబాద్‌లోని ఎస్‌బీఐ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీ మాధన్ స్వామినాథన్ శ్రీమతి శ్రీలక్ష్మికి స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని MSME యూనిట్లు, స్టార్టప్‌లు, నూతన పారిశ్రామికవేత్తలకు సకాలంలో రుణ సదుపాయాలు అందించేందుకు ఎస్‌బీఐ, పరిశ్రమల శాఖ పరస్పర సమన్వయంతో పని చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా శ్రీ మాధన్ స్వామినాథన్ మాట్లాడుతూ, అర్హులైన పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడంలో ఎస్‌బీఐ ఎల్లప్పుడూ ముందుంటుందని, కొత్త పరిశ్రమల స్థాపనకు బ్యాంకు పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. శ్రీమతి శ్రీలక్ష్మి మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి, స్వయం ఉపాధి ప్రోత్సాహం, ప్రభుత్వ పారిశ్రామిక పథకాల సమర్థవంతమైన అమలు కోసం ఎస్‌బీఐతో పూర్తి స్థాయిలో సమన్వయంతో పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశం రంగారెడ్డి జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (LDM) శ్రీ సుశీల్‌కుమార్ సమన్వయంతో జరిగింది.

# రూ.47.03 కోట్లతో కోహెడలో ఎగుమతి ఆధారిత ఇంటిగ్రేటెడ్ హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు శంకుస్థాపన

**రంగారెడ్డి జిల్లా**



రంగారెడ్డి జిల్లా కోహెడలో రూ.47.03 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎగుమతి ఆధారిత ఇంటిగ్రేటెడ్ హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మత్స్యకారులు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. జాతీయ మత్స్య రైతుల దినోత్సవం సందర్భంగా మత్స్యకారులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ముదిరాజుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎలాంటి అడ్డంకులు వచ్చినా వెనుకడుగు వేయబోనని, అవసరమైతే మంత్రి, ఎమ్మెల్యే పదవులకే కాకుండా ప్రాణత్యాగానికైనా సిద్ధమని స్పష్టం చేశారు.
దేశంలోనే సముద్రతీర ప్రాంతం కాకుండా అంతర్గత రాష్ట్రంలో ఏర్పాటు కానున్న తొలి ఆధునిక మంచినీటి చేపల ఎగుమతి కేంద్రంగా ఈ ప్రాజెక్టు నిలుస్తుందని మంత్రి తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రస్తుతం మంచినీటి చేపల ఉత్పత్తిలో దేశంలో అగ్రస్థానంలో ఉందని, రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే చేపలకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లను విస్తరించడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ మార్కెట్‌లో ఆధునిక శీతల గిడ్డంగులు, శుద్ధి యూనిట్లు, ప్యాకేజింగ్ కేంద్రాలు, శిక్షణా కేంద్రం, కస్టమ్స్ సదుపాయాలు, భారీ హోల్‌సేల్ మార్కెట్ వంటి అన్ని ఆధునిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సుమారు రెండు వేల మంది వ్యాపారులు వ్యాపారం నిర్వహించే అవకాశం ఉండగా, ఐదు వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, జాతీయ మత్స్య రైతుల దినోత్సవం సందర్భంగా కోహెడలో ఏర్పాటు చేస్తున్న ఎగుమతి ఆధారిత ఇంటిగ్రేటెడ్ హోల్‌సేల్ చేపల మార్కెట్ మత్స్యకారుల అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. బ్లూ రివల్యూషన్ లక్ష్యాలను సాకారం చేస్తూ మత్స్యకారులకు ఆధునిక మార్కెటింగ్ సౌకర్యాలు, గిట్టుబాటు ధరలు, ఎగుమతి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం రైతులు, మత్స్యకారులు, కార్మికులు, విద్యార్థులు సహా అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తోందని తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, కోహెడలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్ తెలంగాణ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. విజయవాడ జాతీయ రహదారి, నాగార్జునసాగర్ రహదారి, ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉన్న ఈ ప్రాంతంలో అంతర్జాతీయ ప్రమాణాలతో మార్కెట్ నిర్మాణం చేపట్టడం ద్వారా మత్స్యకారులు, ముదిరాజ్, బెస్త వర్గాలకు విస్తృత ఉపాధి, మార్కెటింగ్ అవకాశాలు కల్పించబడతాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం సుమారు 13 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించినట్లు తెలిపారు. అదనంగా మరో రూ.50 కోట్లు మంజూరు చేసి మొత్తం రూ.100 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలని మంత్రి వాకిటి శ్రీహరిని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, ఫ్రూట్ మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూధన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దూస వెంకటేష్, ఫిషరీస్ అదనపు డైరెక్టర్ మురళీకృష్ణ, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, మత్స్యకారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి



*** టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్**
***సూరారంలో జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు**
*** సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన**

**కుత్బుల్లాపూర్, జులై 10,(వుదయం ప్రతినిధి ),**

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) హెచ్-143 కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో సూరారంలోని విఐపీ ఫంక్షన్ హాల్‌లో మల్లారెడ్డి ఆసుపత్రి వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ప్రారంభానికి, యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆస్కాని మారుతి సాగర్ శిబిరాన్ని ప్రారంభించి వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి జర్నలిస్టులకు యూనియన్ సభ్యత్వాలను తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి టీయూడబ్ల్యూజే ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఆరోగ్య రక్షణ, సామాజిక భద్రత, సంక్షేమ కార్యక్రమాలకు సంఘం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల సంక్షేమం కోసం ఇలాంటి ఆరోగ్య శిబిరాలు మరింత విస్తృతంగా నిర్వహించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. శిబిరంలో పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు వైద్యుల నుంచి ఆరోగ్య పరిరక్షణపై సూచనలు, సలహాలు పొందారు. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు రంగు వెంకటేష్ గౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కోల వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోలేపాక వెంకట్, సీనియర్ జర్నలిస్టులు సురేందర్, కళ్యాణ్, శివ, టీయూడబ్ల్యూజే కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు సుగ్రీవుడు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, కన్వీనర్ ఎర్రోళ్ల కృష్ణ, ఉపాధ్యక్షులు బాన్సాడ వెంకటేష్, శ్రీనివాస్, టి. అనంతరావు, సాయిలు, కార్యనిర్వాహక కార్యదర్శులు ఎర్రం పెంటయ్య, యాకూబ్, సందీప్, సూర్య చందర్, కార్యవర్గ సభ్యులు సతీష్, పల్నాటి శివ కుమార్, రాజు, బిక్షపతి, బాబు, శివ, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి



**-ఆర్టీసీ, రవాణా అధికారులకు టీడబ్ల్యూజేఎఫ్ వినతి**

**హైదరాబాద్**
**వుదయం ప్రతినిధి జులై 10:**

జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరుతూ శుక్రవారం జర్నలిస్టులు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ, రవాణా అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టులు ఆర్టీసీ ఉన్నతాధికారులకు, డిపో మేనేజర్లకు విజ్ఞాపన పత్రాలు అందజేశారు. హుస్నాబాద్ లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు, హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర రవాణా శాఖ అదనపు కార్యదర్శి సునీతాదేవీ లకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులువినతిపత్రాలు సమర్పించారు. అనంతరం వారు ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని బస్ భవన్ లో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ ఛైర్మెన్ వై.నాగిరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సేవలందిస్తున్నారని, తెలంగాణలో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన ప్రభుత్వం పరిమిత సంఖ్యలో ఉన్న జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ చాలా ఏళ్ళుగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో 1/3 రాయితీ పై ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ పేరుకే 1/3 కానీ జర్నలిస్టుల నుంచి 50 శాతం చార్జీలు వసూలు చేస్తున్నారని అన్నారు. వార్తల సేకరణకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే జర్నలిస్టులకు ప్రయాణ చార్జీలు భారమవుతుందని,దీనిని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టులకు రాష్ట్ర వ్యాప్తంగా(తెలంగాణ ఎర్త్ వైడ్) ఉచిత ప్రయాణం, ఇతర రాష్ట్రాలకు 1/3 రాయితీ సదుపాయం కల్పించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ రామారావు, పద్మనాభ రావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వి. రవికుమార్, నాయకులు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎం. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సమయస్ఫూర్తితో నలుగురి ప్రాణాలు కాపాడిన పోలీసులు!



**- ముగ్గురు పసిపిల్లలతో సహా మహిళ ఆత్మహత్యాయత్నం భగ్నం**
**- డయల్ 100' సమాచారంతో క్షణాల్లో స్పందించిన రాయ్‌పోల్ కానిస్టేబుళ్లు**
**- సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించిన సీపీ రష్మీ పెరుమాళ్**

**సిద్దిపేట/రాయ్‌పోల్, జులై 10 (వుదయం బ్యూరో)**

గృహ కలహాల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై, తన ముగ్గురు పసిపిల్లలతో సహా బావిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఒక మహిళను, ఆమె పిల్లలను రాయ్‌పోల్ పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణాలతో కాపాడారు. క్షణాల వ్యవధిలో స్పందించి నలుగురి ప్రాణాలు నిలబెట్టిన పోలీసుల తీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయ్‌పోల్ మండలం తిమ్మాక్కపల్లి గ్రామానికి చెందిన ఒక మహిళకు (28) తన అత్తగారితో గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి లోనైన సదరు మహిళ తన ముగ్గురు కుమారులు (ఏడేళ్లు, మూడేళ్ల పిల్లలతో పాటు 9 నెలల పసికందు) లతో సహా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. పిల్లలందరినీ తీసుకుని గ్రామ సమీపంలోని ఒక వ్యవసాయ బావి వద్దకు వెళ్ళింది. మహిళ పిల్లలతో సహా బావి వైపు వెళ్లడాన్ని గమనించిన గ్రామానికి చెందిన ఒక స్థానికుడు వెంటనే అప్రమత్తమై 'డయల్ 100' ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే రాయ్‌పోల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు ఎన్. ప్రశాంత్, మల్లేష్ అత్యంత వేగంగా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సరిగ్గా బావి వద్దకు చేరుకుని ఆత్మహత్యకు యత్నిస్తున్న తరుణంలో వారిని అడ్డుకుని, నలుగురినీ సురక్షితంగా కాపాడారు. అనంతరం వారికి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి నలుగురి ప్రాణాలను కాపాడిన కానిస్టేబుళ్లు ఎన్. ప్రశాంత్, మల్లేష్‌లను సిద్దిపేట పోలీస్ కమిషనర్ (సీపీ) రష్మీ పెరుమాళ్ కార్యాలయానికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఆపద సమయంలో 'డయల్ 100' సేవలను ఉపయోగించుకోవాలని ప్రజలకు సూచించారు. క్షణికావేశంలో బలవన్మరణాలకు పాల్పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని, ఎలాంటి సమస్యలకైనా కౌన్సిలింగ్ ద్వారా మరియు చట్టపరమైన మార్గాల ద్వారా పరిష్కారం వెతుక్కోవాలని సీపీ రష్మీ పెరుమాళ్ విజ్ఞప్తి చేశారు.

# హబ్సిపూర్ శివారులో ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి



**వుదయం, దుబ్బాక**

దుబ్బాక నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కోసం హబ్సిపూర్ గ్రామ శివారులో ప్రతిపాదిత స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా స్కూల్ నిర్మాణానికి అనువైన అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన ఉచిత విద్య అందించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌ను దుబ్బాకకు తీసుకురావడానికి మొదటి నుంచే కృషి చేస్తున్నానని తెలిపారు. 2024లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి స్కూల్ మంజూరు కోసం వినతి పత్రం అందజేశానని, ప్రస్తుతం దాని మంజూరును ఇతరులు తమ కృషిగా చెప్పుకోవడం ఆశ్చర్యంగా ఉందని విమర్శించారు. దుబ్బాకలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్ల నిధులు మంజూరు చేసిందని ఆయన తెలిపారు. ఈ విద్యాసంస్థ ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక వసతులు, డిజిటల్ విద్య, క్రీడా సదుపాయాలు, పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు .ఈ ప్రాజెక్టు పూర్తయితే నియోజకవర్గ విద్యారంగంలో గణనీయమైన మార్పు వస్తుందని, విద్యార్థుల భవిష్యత్తుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ విద్యకు కొత్త దిశ లభిస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# మంత్రుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



**- జిల్లాలో ప్రజా రవాణా సౌకర్యాలు మెరుగుపడాలి.**
**- అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తే కఠిన చర్యలు.**
**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల**
**జులై 10 (వుదయం బ్యూరో)**

జిల్లాలో నూతనంగా నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రాలు ప్రారంభించేందుకు ఈనెల 14న ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, హామ్ రోడ్ల శంకుస్థాపనకు రహదారులు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈనెల 13న జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శుక్రవారం తన ఛాంబర్ లో విద్యుత్, ఆర్ అండ్ బి, ఆర్టీసీ అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. మంత్రుల పర్యటనకు వేదికల అలంకరణ, ఇతర ఏర్పాట్లన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈదురు గాలులు, వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఎక్కడా కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రహదారి భద్రతకు ప్రాధాన్యతనిస్తూ బ్లాక్ స్పాట్స్ గుర్తించి అక్కడ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలో మారుమూల ప్రాంతాలకు కూడా రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా వివిధ ప్రాంతాల మధ్యన కనెక్టివిటీ పెంచుతూ బస్సు సౌకర్యాలు కల్పించాలన్నారు. మారుమూల గట్టు నుంచి అలంపూర్ వరకు కూడా ప్రజల సౌకర్యార్థం బస్సులను నడిపేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు చదువుకోవడానికి వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం సరైన సమయంలో బస్సులను నడపాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, డిఈ భాస్కర్, విద్యుత్ శాఖ ఇన్చార్జి ఎస్ఈ నాగరాజు, డిఈ రవి ప్రసాద్, గద్వాల డిపో మేనేజర్ శ్రీధర్, అసిస్టెంట్ మేనేజర్ బాల సరస్వతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మొయినాబాద్‌లో ఎస్ఎఫ్ఐ బంద్.. నాయకుల అరెస్టు



**- శాంతియుత నిరసనను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమన్న ఎస్ఎఫ్ఐ**
**- విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్**

**చేవెళ్ల జులై 10 (వుదయం)**

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఇచ్చిన బంద్ పిలుపులో భాగంగా శుక్రవారం మొయినాబాద్ మండల పరిధిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు.బంద్‌కు మద్దతుగా విద్యార్థులు, కలిసి నిరసన చేపట్టినరు ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు రేశ్వంత్, మండల కార్యదర్శి చరణ్ గౌడ్‌తో పాటు పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు రేశ్వంత్,కార్యదర్శి చరణ్ గౌడ్ మాట్లాడుతూ...ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించడం, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయడం, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందించడం, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిర్వహించిన ప్రజాస్వామ్య నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు విమర్శించారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు నవీన్, వికాస్, కార్తిక్, సంపత్, నాని, సోనూ, శివ, అభిలాష్, అభి తదితర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HON'BLE 1ST JUNIOR CIVIL JUDGE, CCC AT SECUNDERABAD**
**O.S.No.367 of 2026**
***Between:***
Smt. Ahmedi Begum and others
**.... Plaintiffs**
**AND**
The Mandal Revenue Officer, Secunderabad Mandal And another
**.... Defendants**
To,
ALL CONCERNED
**.....Defendant No.2**
Please take notice that the above named plaintiff had filed the above suit against you and others for declaration of legal heirs. The Hon'ble Court was pleased. to order notice through substitute service, by publishing the same in the news paper. Thus, take notice that the above suit is posted to 20/07/2026 for your appearance. Therefore, please take notice and appear in person or through advocate before the Hon'ble 1st Junior Civil Judge, CCC, Secunderabad on 20/07/2026 at 10.30 A.M. failing which the matter will be adjudicated in your absence.
***(BY ORDER OF THE COURT)***
Sd/-
**M.B.MANDAKINI**
**ADVOCATE**
**HOUSE No. 151, DOVETON ROAD, BOLARUM, SECUNDERABAD.**

**IN THE COURT OF THE HON'BLE 1ST JUNIOR CIVIL JUDGE, CCC AT SECUNDERABAD**
**O.S.No.370 of 2026**
***Between:***
Smt. G. Pushapalatha Goud and others
**.... Plaintiffs**
**AND**
The Mandal Revenue Officer, Trimulgherry Mandal And another
**.... Defendants**
To,
ALL CONCERNED
**....Defendant No.2**
Please take notice that the above named plaintiff had filed the above suit against you and others for declaration of legal heirs. The Hon'ble Court was pleased to order notice through substitute service, by publishing the same in the news paper. Thus, take notice that the above suit is posted to 20/07/2026 for your appearance. Therefore, please take notice and appear in person or through advocate before the Hon'ble 1st Junior Civil Judge, CCC, Secunderabad on 20/07/2026 at 10.30 A.M. failing which the matter will be adjudicated in your absence.
***(BY ORDER OF THE COURT)***
Sd/-
**M.B.MANDAKINI**
**ADVOCATE**
**HOUSE No. 151, DOVETON ROAD,BOLARUM, SECUNDERABAD.**

**IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE- CUM- VI ADDL. MAGISTRATE OF FIRST CLASS, MEDCHAL MALKAJGIRI DISTRICT AT : MEDIPALLY**
**O.S.No. 291 of 2026**
***Between:***
Smt. C. Aruna Rekha & others
**.... Plaintiffs**
**AND**
All concerned & another
**.... Defendants**
To
**1. ALL CONCERNED**
WHEREAS the above named Plaintiff filed the Original Suit in O.S. No.291 of 2026 against you and another. You are hereby directed to appear before the above mentioned Hon'ble Court in person or through an Advocate on 20.07.2026 at 10:30 AM, failing which, the matter will be heard and determined on merits in your absence as exparte.
***(BY ORDER OF THE COURT)***
Sd/-
**V. YADU KRISHNA SAINATH**
**Advocates**
**D. No.13-4-76/1, Flat No.S-1, Sree Apts, Durga Nagar, Dilsukhnagar, Hyderabad-60**
**PH: 7893372251**



అప్పుడు చేయలేనిది ఇప్పుడేం చేస్తారు...

"పదేండ్ల మీ పాలనలో ఏం చేయలేని వారు ఇప్పుడు మూడు నెలల సమయమిస్తే ఏం చేస్తారు? గత ప్రభుత్వ అప్పులు, తప్పులను మేం సరి చేస్తున్నాం. హరీశ్ రావు నిజంగా కాంగ్రెస్‌లోకి వస్తానంటే పార్టీలో చర్చిస్తాం. పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో చర్చించి హరీశ్‌ను చేర్చుకోవాలా? వద్దా? అని నిర్ణయం తీసుకుంటాం..మా కాంగ్రెస్ పార్టీలో భిన్నాభిప్రాయాలు సహజం. మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమస్యను కచ్చితంగా పరిష్కరిస్తాం.తుంగతుర్తి సమస్య కూడా పరిష్కారం అవుతుంది. ఇరు వర్గాల వాదనలు వింటాం. మా పార్టీలో అందరూ సమానమే. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బిజీగా ఉండడం వల్ల ఇద్దరు సీనియర్ నాయకులను సమస్య పరిష్కారం కోసం నియమించాం. పార్టీ నుంచి సస్పెండ్ చేయడమే సమస్యకు పరిష్కారం కాదు...'

**- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్**

## వే'మన' పద్యం

పూజకన్న నెంచ బుద్ధి నిదానంబు
మాటకన్న నెంచ మనసు దృఢము
కులముకన్న మిగుల గుణము ప్రధానంబు
విశ్వదాభిరామ! వినుర వేమ!



## సంపాదకీయం

# సర్కారుకు చిత్తశుద్ధి ఏది..?

విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్‌లను నెలల తరబడి పెండింగ్‌లో పెట్టి, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా చదువునే సంక్షోభంలోకి నెట్టేస్తూ, మరోవైపు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీలివ్వడం, జాబ్‌క్యాలెండర్ ద్వారా ఖాళీలను భర్తీచేస్తామనడం ఎంతవరకు విశ్వసనీయం? చదువుతున్న యువతకు కనీస భరోసా కల్పించలేని పాలన, చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం కల్పిస్తామనడం నమ్మశక్యమేనా? ఎందుకంటే, రాష్ట్రంలో గత కొంతకాలంగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తీవ్రమైన సమస్యగా మారాయి. విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన ఫలితం లేదు. ఈ సమస్య గల్లీ నిరసనల నుంచి న్యాయస్థానాల వరకు వెళ్లడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పెండింగ్ బకాయిల విడుదల కోసం విద్యార్థి సంఘాలు ఇటీవల అన్ని జిల్లాల్లో ఆందోళనలు చేపట్టగా పోలీస్ యంత్రాంగం వాటిని అణగదొక్కేందుకు చూసింది. కొంతమంది అరెస్టు, మరికొంత మందిని బైండోవర్ కూడా చేసింది. అయితే విద్యార్థుల ఉద్యమాన్ని అడ్డుకోవడంలో ఉన్న చిత్తశుద్ధి బకాయిలు చెల్లించడంలో లేకపోవడం ఇక్కడ విచారించాల్సిన అంశం.

స్కాలర్‌షిప్ అనగానే పాలకులు దాన్ని పెద్ద ఆర్థిక గుదిబండలా చూడటమే అసలు సమస్య. పేద విద్యార్థికి స్కాలర్‌షిప్ అనేది దానం కాదు, అది రాజ్యాంగ బద్ధమైన సామాజిక బాధ్యత. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా సంక్షేమ పథకం కాదు, ఉన్నత విద్యకు ఆర్థిక అడ్డంకులు తొలగించే సాధనం. వాటిలో జాప్యమంటే వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టడమే అవుతుంది. ఇప్పటికే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ల జాప్యంపై తెలంగాణ హైకోర్టు పలుమార్లు ప్రభుత్వాన్ని వివరణ కోరింది. విద్యార్థుల ధ్రువపత్రాలను నిలిపి వేయరాదని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. అయినప్పటికీ సర్కార్ నిర్లక్ష్యపు ధోరణితోనే వ్యవహరిస్తోంది. స్కాలర్‌షిప్ అందకపోతే దాని ప్రభావం కేవలం ఒక విద్యార్థిపైనే ఉండదు, ఒక కుటుంబం మొత్తం ఆర్థిక ఒత్తిడికి గురవుతుంది. తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సి వస్తుంది. చాలామంది విద్యార్థులు చదువు మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడు తుంది. ఉద్యోగ అవకాశాలు కోల్పోతారు. పేదరికం నుంచి బయటపడే మార్గమే మూసుకు పోతుంది. ప్రభుత్వం సంక్షేమం గురించి ఎంత గొప్పగా చెప్పుకున్నా, విద్యార్థులకు ఇవ్వాల్సిన చట్టబద్ధమైన ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందించలేకపోతే ఆ మాటలకు విలువుండదు. విద్యపై పెట్టే ఖర్చును వ్యయంగా కాకుండా భవిష్యత్తుపై పెట్టు బడిగా చూడాలి.

కానీ నిధుల విడుదలలో జాప్యం, పరిపాలనా నిర్లక్ష్యం, స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం వల్ల ప్రతి ఏడాది ఇదే సమస్య పునరావృ తమవుతోంది. ఈ సమస్యలో మరో బాధా కరమైన అంశం కళాశాలల పరిస్థితి. ప్రభుత్వ బకాయిలు రాకపోవడంతో కొన్ని విద్యాసంస్థలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడం వాస్తవం. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్ మెంట్ దాదాపు రూ. పదిహేను వందల కోట్లు పెండింగ్‌లో ఉన్నట్టు యాజమాన్యాలు చెబుతున్నాయి. చెల్లించాలని ఎన్ని వినతులు చేసినా, కళాశాలలు మూసేస్తామని హెచ్చరించినా సర్కార్ పెడచెవిన పెట్టడంతో అంశం కోర్టుదాకా వెళ్లింది. 'ఆర్థిక సమస్యలు న్నాయి. ఒకేసారి చెల్లించడం కష్టం. కొద్దికొద్దిగా ఇస్తాం' అంటూ సర్కార్ కాలయాపన చేస్తోంది. దాని ప్రభావం నేరుగా విద్యార్థులపై పడుతోంది. 'సర్కార్ ఫీజు చెల్లించడం లేదని, మీరే అది చెల్లించాలని' యాజ మాన్యాలపై నుంచి ఒత్తిడి పెరుగుతోంది. పైగా కోర్టు కూడా విద్యార్థుల నుంచి వసూలు చేసుకోవచ్చని చెప్పడం సమస్యను జటిలం చేసినట్టు విద్యార్థి సంఘాల విమర్శ! ప్రభుత్వ నిర్లక్ష్యపు వైఖరికి విద్యార్థులను బలిచేయడం ఎంత తప్పో, అదేవిధంగా యాజమాన్యాల ఆర్థిక ఇబ్బందులను విస్మరించడం కూడా సరైంది కాదు. కోర్టు కూడా రెండు పక్షాల హక్కులను సమతుల్యం చేయాల్సిన బాధ్యత ఉంటుంది. కానీ, ఈ మొత్తం సంక్షోభానికి మూల కారణం ప్రభుత్వం బకాయిలను విడుదల చేయకపోవడం. ప్రస్తుతం ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ, యువతకు ఉపాధి, అభివృద్ధి వంటి హామీలను ఇస్తోంది. అవన్నీ స్వాగ తించదగినవే. కానీ ఇప్పటికే చదువుతున్న విద్యార్థులకు బకాయిలు సకాలంలో చెల్లించలేని ప్రభుత్వం, రేపు లక్షలాది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పినప్పుడు యువతలో సహజంగానే సందేహాలు తలెత్తుతాయి. అందువల్ల వెంటనే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలన్నింటినీ విడుదల చేయాలి. యాజమాన్యాలు కోర్టుల చుట్టూ, విద్యార్థులు నిరసనల బాటలో తిరగాల్సిన పరిస్థితి రాకూడదు. పేద విద్యార్థి చదువు ఆగకుండా చూడటం ఏ ప్రభుత్వానికైనా మొదటి బాధ్యత. దాన్ని నిర్వర్తించినప్పుడే ఉద్యోగాల హామీలు, అభివృద్ధి వాగ్దానాలు ప్రజల్లో విశ్వాసాన్ని పొందగలవు.

# స్కైలాబ్ శకలాలు

## తెలంగాణ ప్రజల్లో వీడని భయాందోళనలు!



స్కై లాబ్... ఈ పేరు నేటి తరానికి అంతగా తెలియక పోవచ్చు. దాదాపు అర్థ శతాబ్ది క్రితం జనజీవనాన్ని అతలాకుతలం చేసిన సంఘటన. ప్రధానంగా తెలంగాణ అదీ ఉత్తర తెలంగాణ ప్రజలను తీవ్ర భయ భ్రాంతులకు గురిచేసిన నేపథ్యం. యాభై ఏళ్ల పైబడిన వారిని కదిలిస్తే ఈ నాటికీ వెంటనే గుర్తుకు వచ్చి, ఆనాటి తీవ్ర భయాందోళనల పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు వివరించే అరుదైన సంఘటనల అపురూప అపూర్వ దృశ్యం. అంతరిక్షం లో మానవులచే నిర్మించిన పరిశోధనా ఉపగ్రహం లాంటి పరికరాల నిర్మిత అతిపెద్ద కేంద్రాన్ని స్కైలాబ్ అంటారు. భూమి గురుత్వాకర్షణ శక్తిని ఛేదించి మొదటి కృత్రిమ ఉపగ్రహం స్పుత్నిక్1ని 1957అక్టోబర్‌లో అప్పటి సోవియట్ యూనియన్ పంపించడంతో అంతరిక్ష పరిశోధనలు వేగం పుంజు కున్నాయి. ఆ తర్వాత అంతరిక్షం లోనే మానవుడు పరిశోధనా కేంద్రాన్ని (స్కైలాబ్) స్థాపించి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం, దానిలోనే ఉంటూ పరిశోధనలు చేస్తూ సౌర కుటుంబాన్ని గురించి ఎన్నో కొత్త విషయాలను తెలుసు కోవడానికి ఈ విజ్ఞానం ఉపయోగించు కున్నాడు. ఈ కేంద్రాన్ని అమెరికా, రష్యా, ఇతర అభివృద్ధి చెందిన దేశాలు అంతరిక్షంలో పరిశోధనలు చేయడానికి నిర్మించాయి. ఈ అంతరిక్ష కేంద్రం భూమి పరిభ్రమించే లోపలి కక్ష్యతో నిర్మించబడింది. ఈ అంతరిక్ష కేంద్రం భూమికి 278 నుండి 460 కి. మీ. ఎత్తులో ఉండి, సరాసరి గంటకు 27, 743 కి. మీ. వేగంతో పరిభ్రమిస్తూ ఉండేది. ఇది రోజుకు 16 సార్లు భూమి చుట్టూ ప్రదక్షిణలు చేసేది. ఈ కేంద్రంలో వ్యోమగాములు ఉంటూ, భూగోళ వాతావరణ అధ్యయనానికి, సమాచార ప్రసార సాధనంగా స్కై లాబ్ ను వినియోగించు కున్నారు. స్కైలాబ్ మొదటి యునైటెడ్ స్టేట్స్ అంతరిక్ష కేంద్రం, నాసా ప్రారంభించింది. మే 14 1973, ఫిబ్రవరి 1974 మధ్య 24 వారాల పాటు క్రియాశీలంగా ఉంది. ఇది అంతరిక్ష పరిశోధక నౌక. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా దీన్ని రూపొందించింది. కక్ష్యలోకి ప్రవేశపెట్టిన దీని జీవిత కాలం ఏడేళ్లు. అయితే అంతరిక్షం లోకి పంపిన తర్వాత దీన్ని భూమి మీదకు తిరిగి సురక్షితంగా ఎలా తీసుకు రావాలన్న విషయంలో నాసా సరిగా వ్యవహరించలేదు. అయితే ల్యాబ్ గతి తప్పడం మొదలైంది. ఉపగ్రహ జీవిత కాలం ప్రణాళిక ప్రకారం 1974 లో స్కైల్యాబ్ జీవిత కాలం ముగిసిన తరువాత 8 10 ఏళ్ళ వరకు కక్ష్యలోనే ఉండాల్సి ఉండగా, సౌర కార్యకలాపాలు ఎక్కువ కావడంతో ఉచ్ఛస్థాయిల్లో వాతావరణం పలుచబడి జీవిత కాలం సమయానికంటే ముందే స్కైల్యాబ్ భూ వాతావరణం లోకి ప్రవేశించింది.1978 చివరలో స్కైలాబ్ నియంత్రణ కోల్పోయి గతి తప్పడం గుర్తించారు. చివరకు అది వేగంగా వచ్చి భూమిని ఢీకొనడం తప్ప వేరే మార్గం లేదని అంతా భావించారు. అదే విషయాన్ని నాటి ప్రధాన ప్రసార మాధ్యమం అయిన రేడియోల ద్వారా పదే పదే ప్రకటింప చేశారు. ఫలితంగా ప్రజలు విపరీత భయాందోళనలకు గురయ్యారు. ఇంకా భారత భూభాగంలోనే ఢీ కొంటుందన్న ప్రచారం ఊపందుకుంది. అదే సమయంలో తెలంగాణ ప్రాంతంలో... నిజామాబాద్ ఎక్కడైనా పడే అవకాశం ఉందంటూ పత్రికల్లో వెలువడ్డ వార్తలు మరింత ఆందోళనకు దారితీసింది. నాడు ఊరూరికీ పత్రికలు రాకున్నా, ఈ వార్తలు దావనంలా వ్యాపించాయి. నాటి ప్రధాన ప్రసార సాధనమైన రేడియో ఉన్న ఇళ్ళ వద్ద జనం గుమి కూడడం, భయాందోళనలకు లోనవడం సర్వ సాధారణంగా మారింది.తెలంగాణ మొత్తం స్కైలాబ్ బారిన పడుతుందన్న శరవేగ ప్రచారం చదువుకున్న, చదువులేని వారు అన్న తేడా లేకుండా తీవ్ర ఆందోళనలో ముంచెత్తి వేసింది. 1979లో జరిగిన ఈ సంఘటన మూడు వారాల పాటు ప్రతి ఆవాస ప్రాంతంలో ఆబాల గోపాలాన్ని కంటికి కునుకు లేకుండా చేసింది. స్కైలాబ్ వలన భూమికి భారీ నష్టం కలుగుతుందని శాస్త్రవేత్తలు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. భూమి పై పడితే మహా ప్రళయం సంభవించి నట్టేనని భావించిన అనేక మంది ప్రజలు చాలామంది తమ జీవితాలకు అవే చివరి రోజులని భావించి ప్రాణాలను అరి చేతుల్లో పెట్టుకుని కాలం వెళ్ళ దీశారు. ఆకాశం నుంచి నక్షత్రం లాంటిది భూమిని ఢీకొన బోతోందని, దీంతో ప్రళయం వస్తుందని, మనుషులంతా చనిపోతారన్న ప్రచారం నానాటికీ అధికం అయింది. అయితే అంతరిక్షంలో 24 వారాల పాటు పనిచేసిన తరువాత, కక్ష్య క్షీణించి భూవాతావరణం లోకి ప్రవేశించి స్కై లాబ్ విచ్ఛిన్నమై పోయింది. అంతరిక్ష ముగ్గురు వ్యోమగాముల బృందం స్కైల్యాబ్ భూమిపై పడి నాశనమయ్యే లోపు తమకున్న పరిజ్ఞానంతో 1974 ఫిబ్రవరి 8 న భూమికి తిగి వచ్చేశారు.1979 జూలై 11 న స్కైల్యాబ్ భూవాతావరణం లోకి ప్రవేశించి విచ్ఛిన్నమై పోయింది. స్కైలాబ్ కక్ష్య క్షీణించి, జూలై 11, 1979 న హిందూ మహాసముద్రం మీదుగా వాతావరణంలో కాలిపోయింది. దాని శకలాలు హిందూ మహా సముద్రం లోను, పశ్చిమా ఆస్ట్రేలియా లోనూ పడ్డాయి. ఇదిలా ఉంటే స్కై లాబ్ భూమిని ఢీకొని భారీ ప్రాణ, ఆస్తి తదితర నష్టం కలిగించ గలదనే ఉధృత ప్రచార నేపధ్యంలో...నాటి అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి... 1979 జూలై 11న ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన ధర్మపురిలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం లో స్థానికుల సమక్షంలో, వేద పండితులతో కూడి భగవదారాధన లో గడపడం, ఆ తర్వాత హైదరాబాద్ కు తిరిగి వెళ్ళడం విశేషం..



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# ముసురుతున్న ప్రయివేటీకరణ




ప్రభుత్వరంగ విద్యుత్ సంస్థలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రయివేటీకరణ విధానాల నీడ మరింత ముసురుతోంది. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని కీలక విభాగాలను ప్రయివేటు సంస్థలకు అప్పగించే చర్యలు, 'రైతు డిస్కం' ఏర్పాటు ప్రయత్నాలు, మరోవైపు కేంద్రం తీసుకొచ్చిన 2025 విద్యుత్ సవరణ బిల్లు కలిసి తెలంగాణ విద్యుత్ రంగ భవిష్యత్తుపై ఆందోళనలు పెంచుతున్నాయి. ప్రధాని మోడీ పార్లమెంటులో ప్రవేశపెట్టిన విద్యుత్ సవరణ బిల్లు ఆమోదం పొందితే విద్యుత్ రంగం పూర్తిగా ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదముంది. ఇప్పటికే తెలంగాణ విద్యుత్ సంస్థలను ప్రయివేటీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చాలా వేగంగా ప్రయత్నాలు ప్రారంభించింది. ఇది గమనించిన తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్లు జేఏసీగా ఏర్పడి రాష్ట్రవ్యాప్తంగా గత పది రోజులుగా నిరసన తెలుపుతున్నారు. విద్యుత్ రంగ సంస్థలు ప్రయివేటీకరణ కాకుండా అడ్డు కుంటేనే స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. రాష్ట్రంలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని స్టేజ్ 1, 2 యూనిట్లకు సంబంధించి కూల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్, ఆపరేషన్ మెయింటెనెన్స్, మెకానికల్ ఎలక్ట్రికల్ పనులను ప్రయివేటు సంస్థకు అప్పగించేందుకు జెన్కో టెండర్లు పిలిచింది. ఈ జనవరి నుంచి ఇప్పటివరకు పరిణామాలను చూస్తే.. 'రైతు పవర్ విస్కం' పేరుతో ఒక కొత్త డిస్కం ఏర్పాటు చేయడానికి కావాల్సినవి సిద్ధం చేసుకుని, వీటి లైసెన్స్ కోసం ఈఆర్‌సీలో బహిరంగంగా విచారణ కూడా పూర్తిచేసింది. ఇక లైసెన్స్ ఇవ్వడం ఆలస్యంగా మారిందంటూ రైతు డిస్కం, ఇటు వైటీపీఎస్‌లో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా 2003 విద్యుత్ చట్టంలో భాగంగా మన విద్యుత్ సంస్థలు ప్రయివేటీకరణ అనివార్యం అయిపోయింది. ఈ ప్లాంట్ నిర్మించి ఏడాది కాకముందే ప్రయివేటీకరణ ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. 2025 ఆగస్టులో ఉత్పత్తి ప్రారంభించిన ఈ సంస్థ మన డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క

అంతరిక్షం లో మానవులచే నిర్మించిన పరిశోధనా ఉపగ్రహం లాంటి పరికరాల నిర్మిత అతి పెద్ద కేంద్రాన్ని స్కైలాబ్ అంటారు. భూమి గురుత్వాకర్షణ శక్తిని ఛేదించి మొదటి కృత్రిమ ఉపగ్రహం స్పుత్నిక్1ని 1957అక్టోబర్‌లో అప్పటి సోవియట్ యూనియన్ పంపించడంతో అంతరిక్ష పరిశోధనలు వేగం పుంజు కున్నాయి. ఆ తర్వాత అంతరిక్షం లోనే మానవుడు పరిశోధనా కేంద్రాన్ని (స్కైలాబ్) స్థాపించి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం, దానిలోనే ఉంటూ పరిశోధనలు చేస్తూ సౌర కుటుంబాన్ని గురించి ఎన్నో కొత్త విషయాలను తెలుసు కోవడానికి ఈ విజ్ఞానం ఉపయోగించు కున్నాడు. ఈ కేంద్రాన్ని అమెరికా, రష్యా, ఇతర అభివృద్ధి చెందిన దేశాలు అంతరిక్షంలో పరిశోధనలు చేయడానికి నిర్మించాయి. ఈ అంతరిక్ష కేంద్రం భూమి పరిభ్రమించే లోపలి కక్ష్యతో నిర్మించబడింది. ఈ అంతరిక్ష కేంద్రం భూమికి 278 నుండి 460 కి. మీ. ఎత్తులో ఉండి, సరాసరి గంటకు 27, 743 కి. మీ. వేగంతో పరిభ్రమిస్తూ ఉండేది. రోజుకు 16 సార్లు భూమి చుట్టూ ప్రదక్షిణలు చేసేది. ఈ కేంద్రంలో వ్యోమగాములు ఉంటూ, భూగోళ వాతావరణ అధ్యయనానికి, సమాచార ప్రసార సాధనంగా స్కై లాబ్ ను వినియోగించు కున్నారు.
స్కైలాబ్ మొదటి యునైటెడ్ స్టేట్స్ అంతరిక్ష కేంద్రం, నాసా ప్రారంభించింది. మే 14 1973, ఫిబ్రవరి 1974 మధ్య 24 వారాల పాటు క్రియాశీలంగా ఉంది. ఇది అంతరిక్ష పరిశోధక నౌక. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా దీన్ని రూపొందించింది. కక్ష్యలోకి ప్రవేశపెట్టిన దీని జీవిత కాలం ఏడేళ్లు. అయితే అంతరిక్షం లోకి పంపిన తర్వాత దీన్ని భూమి మీదకు తిరిగి సురక్షితంగా ఎలా తీసుకు రావాలన్న విషయంలో నాసా సరిగా వ్యవహరించలేదు. అయితే ల్యాబ్ గతి తప్పడం మొదలైంది. ఉపగ్రహ జీవిత కాలం ప్రణాళిక ప్రకారం 1974 లో స్కైల్యాబ్ జీవిత కాలం ముగిసిన తరువాత 8 10 ఏళ్ళ వరకు కక్ష్యలోనే ఉండాల్సి ఉండగా, సౌర కార్యకలాపాలు ఎక్కువ కావడంతో ఉచ్ఛస్థాయిల్లో వాతావరణం పలుచబడి జీవిత కాలం సమయానికంటే ముందే స్కైల్యాబ్ భూ వాతావరణం లోకి ప్రవేశించింది.

గత ఆగస్టు నెలలో జాతికి అంకితం చేశారు. 2,800 ఎకరాల్లో నిర్మించిన పవర్ ప్లాంట్ దేశంలోనే అతి పెద్ద పవర్ ప్లాంట్‌లో రెండవది. అత్యధికంగా గిరిజనులు నివసిస్తున్న ప్రాంతాలను ప్రభుత్వం ఆక్రమించి అటవీ భూములతో పాటు రైతులు తమ భూములు, ఇండ్లను కూడా కోల్పోయి భూములిచ్చారు. దాంతో సుమారు రూ.30 నుంచి 35 వేల కోట్లతో నిర్మించిన ఈ ప్లాంట్ ఏడాది తిరగకముందే స్టేజీ 1, 2 లను ప్రయివేటు కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడుతుంది. ఈ ప్లాంట్ నిర్మాణం కోసం భూములిచ్చిన రైతు కుటుంబ సభ్యులకు, ఇండ్లు కోల్పోయిన పేదలకు పూర్తి స్థాయిలో ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. జెన్కో నిర్మాణం కోసం భూములిస్తే సర్కారు నౌకరి వస్తుందని ఆశతో ఖరీదైన భూములను త్యాగం చేశారు. ప్రస్తుతానికి ప్రయివేట్‌కి ఇవ్వడానికి రంగం సిద్ధం చేసింది. దీనిని ఐక్యంగా ఎదుర్కోలేకపోతే మిగిలిన 3, 4, 5 స్టేజీలు కూడా టెండర్లు పిలిచే అవకాశం ఉంది. అలాగే 2014 సంవత్సరంలో ఎన్డీఏ నాయకత్వంలో మోడీ.. ప్రధాన మంత్రి అయినప్పటి నుంచి స్వదేశీ పెట్టుబడిదారుల కన్ను విద్యుత్ సంస్థలపై పడింది. వాజ్‌పేయి ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు తయారైన 2003 విద్యుత్ చట్టంలోని ప్రయివేట్ పెట్టుబడుదాలకు కావాల్సినన్ని ప్రయోజనాలు కల్పించారు. అయినప్పటికీ పెట్టుబడిదారులకు సంతృప్తి కలుగలేదు. అనేక సవరణలతో విద్యుత్ సంస్థలను వాడుకొని అధిక లాభాలు సంపాదించాలనే కోరిక పెట్టుబడిదారులకు ఉన్నట్టు తెలుస్తుంది. ఉదాహరణకు బీఎస్ఎన్ఎల్ టవర్లపై రిలయన్స్ నెట్‌వర్క్ మాదిరిగా మన నెట్‌వర్క్‌ను వాడుకొని కేవలం బిల్లింగ్ చార్జీలు మాత్రమే విద్యుత్ సంస్థ లకు చెల్లిస్తారు. ఉదయ్ ఆదిత్య, ఆర్డీఎస్ఎస్ అనే పేర్లతో కొత్త కొత్త ప్రతిపాదనలు ముందుకు తెస్తూ రాష్ట్ర డిస్కమ్‌లకు ఆర్థిక సాయం చేస్తామని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను ప్రలోభాలకు గురిచేస్తుంది. కేంద్ర ప్రభుత్వం చేసే ప్రయత్నాలను వ్యతిరేకించకుండా మన రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రం ఆదేశాలను ఆచరణలో పెడుతోంది. దీనిలో భాగమే మన తెలంగాణ రైతు డిస్కం, వైటీపీఎస్ స్టేజీ 1, 2లో జరిగే ప్రయివేటీకరణ ప్రయత్నాలు. కేంద్ర ప్రభుత్వం చేసే ప్రయోగాలతో రాబోయే ఐదేండ్లల్లో సబ్సిడీలు, క్రాస్ సబ్సిడీలు పూర్తిగా రద్దు చేయాలని కూడా 2025 విద్యుత్ సవరణ బిల్లులో స్పష్టంగా ఉన్నాయి. 2003 విద్యుత్ చట్టంలో ప్రయివేటు కంపెనీలు డిస్ట్రిబ్యూషన్ చేయాలనుకుంటే నెట్‌వర్క్ వారు ఏర్పాటు చేసుకోవాలని ఉంది. కానీ, 2025 విద్యుత్ సవరణ బిల్లులో విద్యుత్ సంస్థలకు ఉన్న నెట్‌వర్క్‌నే షేర్ చేసుకో వచ్చని సవరణలో పెట్టారు. అంటే కంటెంట్ చర్యలు సిస్టం అమల్లోకి రాబోతుందని స్పష్టమవుతుంది. 2003 విద్యుత్ చట్టంలో జనరేటింగ్ స్టేషన్ పెట్టుకోవడానికి లైసెన్స్ తీసుకోవాల్సిన పనిలేదు. కాబట్టి ప్రయివేటు ఉత్పత్తి చేసిన కరెంట్‌ను మన నెట్‌వర్క్‌లోకి వస్తే గ్రిడ్డు ప్రమాదంలో పడుతుంది. కాబట్టి ప్రయివేటు ఉత్పత్తి చేసే విద్యుత్‌ను మన లైసెన్స్ మీదకు రావడం వల్ల మన జనరేటింగ్ స్టేషన్‌లో ఉత్పత్తి చేసే విద్యుత్ తగ్గిస్తున్నారు లేదా ఆపేస్తున్నారు. ఇదే చట్టంలో సంప్రదాయత ఇంధనం సోలార్, గాలి, చెత్తతో తయారయ్యే విద్యుత్ 25శాతం వరకు ఉండాలనేది 2003 చట్టంలో చాలా స్పష్టంగా ఉంది. కాబట్టి డిస్కమ్‌లను ప్రయివేటీకరించే పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనిపిస్తున్నాయి.WWW ఈ ప్రయివేటీకరణ విధానాలను అడ్డుకోవాలి. లేదంటే భవిష్యత్తులో ఈ విద్యుత్ భారాన్ని ప్రజలే భరించాల్సి వస్తుంది.



# ప్రశ్న ఉండాల్సిందే...

ఇటీవల తెలంగాణలో ఇద్దరు యూట్యూబర్లు రావణ్, కేవీఆర్‌ల అరెస్టు, ఏపీలో ఉపా కేసుల నమోదు అనేక రాజ్యాంగ ప్రశ్నలు లేవనెత్తాయి. చట్టానికి ఎవరూ అతీతులు కారు, అంతవరకు నిజమే! కానీ,ఆ చట్టాన్ని చాపలా చుట్టి అధికారం సంకలో పెట్టుకున్నప్పుడే అనేక ప్రశ్నలు తలెత్తు తాయి. రాజకీయ పార్టీలకు ఏక పక్ష అను సంధానమైన మీడియా వలన ప్రజల తరపున ప్రశ్నించే మీడియా కూడా సమస్యలెదుర్కొంటోంది. ఫలితంగా జర్నలిజం పరిధి, భాషాపై కూడా ఇప్పుడు అనుమానపు నీలినీడలు కమ్ముకొంటున్నాయి. జోసఫ్ అలియాస్ రావణ్. ఆయన ప్రశ్న అనబడే యూట్యూబ్‌లో లేవనెత్తిన ప్రశ్నల గురించి అదే రోజు అదుపులోకి తీసుకున్నారు. ఆయన ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాజీ ఫ్యాన్‌గా చెప్పుకుంటారు. ఆయన చేసిన తప్పు ఏమిటంటే? ఒకప్పుడు పవన్ కళ్యాణ్ వాడిన పరుష భాషనే ఇమిటేట్ చేసి దానిపై ప్రశ్నల వర్షం కురిపించాడు. ఆయన మీడియా పేరు కూడా ప్రశ్నే కనుక ప్రశ్నించాడు. ప్రశ్న తప్పుకాదు. ప్రశ్నించడం నేరం కాదు? ప్రజాస్వామ్యం బతకాలంటే ప్రశ్న ఉండాల్సిందే. కానీ ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. పవన్ కళ్యాణ్‌ను విమర్శించాడని ఆయన కార్యకర్తలు చేసిన ఫిర్యాదుపై ఆయన్ను ఏపీ పోలీసులు అరెస్టు చేసి పిఠాపురం కోర్టులో హాజరు పరిచారు. బెయిల్ రాగానే మళ్లీ సబ్బవరంలో అరెస్టు, మళ్లీ బెయిల్,ఈసారి పాయకరావు పేటలో, మళ్లీ బెయిల్, కాకినాడ రూరల్‌లో అరెస్టు, ఇలా బెయిల్ వచ్చిన వెంటనే అదే కేసులో పదేపదే ఎన్నిసార్లు అయినా అరెస్టు చేయవచ్చుననే రాజ్యాంగ సత్యాన్ని ఏపీ పోలీసులు కనిపెట్టేశారు! ఇది కొత్తదేమీ కాదు, గతంలో పోలీ సులు అనవాయితీగా అనుసరించిన అటవీక న్యాయమే! ఇలా కాస్తా ఎక్కువసార్లు చేయడం వలన ఎబ్బెట్టుగానే ఉంది. అరెస్టు ఉద్దేశ పూర్వకమని నిర్ధారణ అవుతూనే ఉంది. ఒకే అంశంపైనే ఒకే తరహా కేసులో వందల మంది పార్టీ కార్యకర్తలు ఫిర్యాదు చేస్తే వందలసార్లు అరెస్టు చేస్తారా? ఒకవేళ అదే నిజమయితే ఇది రాజ్యాంగం సవరించుకో వలసిన అంశమే. ఒక వైపు పౌరహక్కును కాపాడు తూ కోర్టు బెయిల్ ఇస్తుంటే పోలీసులు మళ్లీ మళ్లీ అరెస్టు చేయడం ఏ రాజ్యాంగ విలువలు కాపాడేందుకు? ఇప్పుడు బెయిల్ రాకుండా ఉపా చట్టం ప్రయో గించారు. ఆయన చేసిన దేశద్రోహం ఏమిటి? నిజంగా ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులన్నింటినీ పోలీసు వ్యవస్థ ఇలాగే ఎఫ్ఐఆర్ చేస్తుందా? ఒకవేళ చేసినా విచారణ లేకుండానే కేసు నమోదు చేసుకుంటారా? అన్నింటికీ మించి కాపులు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లోనే కేసు నమోదు చేసి రావణ్‌ను ఉంచడం, ఓ గుంపు అతన్ని కొట్టే పేరుతో స్టేషన్ మీదకు దూసుకు రావడం, పోలీసులను సైతం లెక్క చేయకుండా నెట్టివేసి గోడలు దూకడం, నిర్బంధంలో ఉన్న వ్యక్తిపై దాడిచేయ బూనడం ఏరకమైన న్యాయం? చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం నాన్ బెయిలబుల్ నేరం కాదా? ఒకే ఒక్క మాటపై పదే పదే రావణ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు, తమపై దొమ్మిలకు వచ్చిన పవన్ సేనపై ఆంధ్రా పోలీసులు ఎంతమందిపై ఎన్నికేసులు నమోదు చేశారు ప్రకటించగలరా? వీడియో అవిడెన్సులు స్పష్టంగా ఉన్నాయి కదా! సాయికృష్ణ లాకప్ డెత్ తర్వాత కాపుల్లో పవన్ కళ్యాణ్ కోల్పోయిన ప్రతిష్టను, తిరిగి రావణ్ అరెస్టు, పోలీసు స్టేషన్ పైదాడుల ద్వారా భర్తీ చేసుకొనే రాజకీయ ఎత్తుగడ కోసం చట్టాన్ని ఇంత చవక బారుగా వాడుకుంటారా? ఇది పవన్ కళ్యాణ్ ప్రతిష్టను పెంచుతుందా? చంద్రబాబు రాజకీయ లౌక్యానికి పరాకాష్టనా? ఇలాంటి ప్రశ్నలు సంధించిన ప్రతిపక్షాల ఆరోపణల్లో ఎంతోకొంత నిజం లేకపోలేదు. ప్రశ్న రావణ్ విషయంలో అనుసరిస్తున్న వైఖరి, ప్రజలవాక్ స్వాతంత్ర్యతకు గొడ్డలి పెట్టు, ప్రజల ప్రశ్నించేతత్వాన్ని చంపుతుంది. పరోక్షంగా పత్రిక స్వేచ్ఛను కాలరాస్తోంది. పాత్రికేయులను భయపెట్టి చర్య, అన్నింటికీ మించి కేసులు, కోర్టులు, చట్టాలు విశ్వసనీయత కాపాడవ లసిన ప్రభుత్వాలే అవి సన్న గిల్లేలా చేస్తున్నాయి. ప్రశ్న రావణ్ నిర్బంధంలో ఉండి వేస్తున్న ప్రశ్నలు చాలా బలమైనవి. తనను అరెస్టు చేయడం, మూక దాడులు నుండి కాపాడటం కోసం ఐదువందల మంది పోలీసులు రోజువారి వినియోగం దుర్వినియోగం కాదా? అది ప్రజల సొమ్మే కదా? అంటే ప్రజలు సొమ్ము తమ ప్రతిష్ట కోసం దుర్వినియో గం చేసే హక్కు రాజకీయ పక్షాలకు ఎవరిచ్చారు,అనేది ఆయన వేసిన అతిపెద్ద ప్రశ్న? అంతేకాదు, నన్ను తేలిక గా చంపేయగలరు, కానీ నా ప్రశ్నను మీరు చంపల రేు? అదీ ఆయన ప్రధాన ప్రశ్న. వాస్తవమే కదా? శాసన సభ్యులైన, పార్లమెంటు సభ్యులైన చట్టాలు చేయడం వరకే వారి పని,ఇక అలాంటి రాజ్యాంగ బద్ధ చట్టాలు అమలు చేసే ప్రధాన బాధ్యత ప్రభుత్వానిది, కార్యనిర్వాహణ శాఖది. కానీ, ఆధునిక ప్రభుత్వాలు ఎప్పుడో తమ పరిదులు దాటాయి. తమ పనిని ప్రజలకోసం కాకుండా , వ్యక్తిగత రాజకీయ స్వార్థం విస్తరణకు పెట్టుబడిగా వాడుకొంటున్నాయి. సిబిఐ, ఈడి,ఐటి, ఎలక్షన్ కమిషన్,కోర్టులు తదితర స్వతంత్ర రాజ్యంగా సంస్థలు అన్నింటినీ అధికార సుస్థిరత కోసం వాడుకొంటున్నారనే విమర్శలు లేకపోలేదు. అంతేకాదు పశ్చిమబెంగాల్ బీజేపీ కొత్త ముఖ్యమంత్రి సువేందు అధికారి మరింత ముందుకు పోయి అరెస్టు చేస్తే ఏడాదిపాటు ఎవరడిగే అవకాశం లేని కొత్త చట్టం తయారు చేస్తున్నారట! ఇలా ఉంది దేశంలో ప్రజలు హక్కుల పరిస్థితి? ఏ ప్రభుత్వం అయినా రాజ్యాంగ సంస్థలు చేతిలోకి తీసుకోవడం అంటే నిరంకుశత్వం,అటు తర్వాత నియంతృత్వం వైపు ప్రయాణం చేయడమే. ఇప్పుడు ఈ చౌకబారు రాజకీయ క్రీడ రాష్ట్రాలకు ఎగబాకింది.ఇది ప్రజాస్వామ్యం అనబడే పదానికి విరుద్ధమైన ఆలోచనా విధానం మాత్రమే. కనుక ప్రశ్నను చంపాలనుకోవడం జవాబు చెప్పలేని అసమర్థ విధానంలో అంతర్భాగమే! కనుక ప్రశ్నను పశ్నలా కాపాడుకుందాం. అది ప్రజలకున్న ప్రాథమిక హక్కు. దాన్ని పాలకులు కాల రాయాలని చూసినా పరాభవమేతప్ప మరో భావం చరిత్రలో లేనేలేదు. ప్రశ్న ఆలోచనల మొలక! ప్రశ్న స్వేచ్ఛ సంకేతం. ప్రశ్న ప్రజల నిరంతర హక్కుల పరిరక్షణ ఆకాంక్ష.



# జాతీయం- అంతర్జాతీయం





## ఆక్రమణలపై కర్నాటక ప్రభుత్వం ఉక్కుపాదం

- **పుట్‌పాత్‌లపై ప్రత్యేక డ్రైవ్**
- **స్వయంగా పర్యవేక్షించిన డీకే**

**బెంగళూరు, జులై 10 (ఎ.ఎం.ఎస్):** మెట్రో పాలిటన్ సిటీలో భారీ యోత్తున పుట్ పాత్ లు ఆక్రమణకు గురువుతున్న విషయం తెలిసిందే. పాదచారులు తీవ్ర ఇబ్బందులు కలిగించేలా కొందరు పుట్ పాత్ లపై అనేక షాప్ లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో అనుమతులు లేకుండా పుట్ పాత్ లపై ఏర్పాటు చేసిన అనేక షాప్ లను తొలగించేందుకు కర్నాటక ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. బెంగళూరు వ్యాప్తంగా శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి భారీ యోత్తున సదురు దుకాణాలను తొలిగిస్తోంది. ఈ కార్యక్రమాన్ని స్వయంగా ఆ రాష్ట్ర సీఎం డీకే శివ కుమార్ పరివేక్షించారు. పరిశుభ్రంగా, సురక్షితంగా, బెంగళూరు అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, పాదచారుల భద్రతను మెరుగుపరచడంతో పాటు పేద వీధి వ్యాపారులకు పునరావాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. బెంగళూరుకు పెరుగుతున్న ప్రపంచ స్థాయి ప్రాముఖ్యతకు మెరుగైన పౌర మౌలిక సదుపాయాలు, సురక్షితమైన ప్రజా ప్రదేశాలు అవసరమన్నారు. భారతదేశం, ప్రపంచం.. బెంగళూరు వైపు చూస్తున్నాయి, ఇది అత్యంత సురక్షితమైన నగరాలలో ఒకటిగా ఉండాలని తాము కోరుకుంటున్నాము. గత మూడేళ్లలో, ఈ సమస్యల కారణంగా 900 మందికి పైగా పాదచారులు ప్రాణాలు కోల్పోయారు. ఇది చాలా ఆందోళన కలిగించే విషయమన్నారు. పాదచారుల కోసం ప్రభుత్వం భారీ ఎత్తున పనులు చేపట్టిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటివరకు 135 కిలోమీటర్లకు పైగా పుట్‌పాత్‌లపై పనులు పూర్తయ్యాయి. వేలాది దుకాణాలను తొలగించారు. దాదాపు 50,000 ఆక్రమణలను తీసివేశారు. వీటిలో దుకాణాలు, ర్యాంపులు, ఇతర అనధికార నిర్మాణాలు ఉన్నాయని సీఎం డీకే శివకుమార్ వివరించారు.

## చైనాలో అతిపెద్ద జల విద్యుత్ ప్రాజెక్టు



- **వడివడిగా అడుగులేస్తున్న డ్రాగన్ దేశం**
- **భారత్ నుంచి తీవ్ర అభ్యంతరాలు**

**టిబెట్, జులై 10:** టిబెట్ లో యార్లుంగ్ సాంగ్పో (భారత్‌లో బ్రహ్మ పుత్ర) నదిపై ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి చైనా వడివడిగా అడుగులు వేస్తోంది. అయితే, దీనికి భారీ ప్రకృతి వైపరీత్యాల ముప్పు ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇది క్రియాశీల భూకంపాల జోన్‌లోనే నిర్మితమవుతోందని బీజింగ్ ప్రభుత్వ మద్దతుతో పనిచేస్తున్న భూగర్భ శాస్త్రవేత్తలు తాజాగా హెచ్చరించారు. ఏడాదికి దాదాపు 300 బిలియన్ కిలో వాట్ల హవర్స్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో డ్రాగన్ ఈ ప్రాజెక్ట్ నిర్మించతలపెట్టింది. ఈ ప్రాజెక్ట్‌పై భారత్‌వైపు నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి కౌంటర్‌గా భారత్ కూడా బ్రహ్మపుత్రపై ఓ ప్రాజెక్ట్ నిర్మించే యోచనలో ఉంది.

చైనాకు చెందిన సెడిమెంటరీ అండ్ తేథియాన్ జియాలజీ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. ఈ మెగా డ్యామ్ పైజెన్ ఫాల్ట్ (యాక్టివ్ ఫాల్‌ట్‌లైన్) పైనే నిర్మితమవుతోంది. దీనివల్ల కొండచరియలు, భూకంపాలు సంభవించడం, నిర్మాణంలో అస్థిరత ఏర్పడే ప్రమాదం ఉందని స్పష్టం చేసింది. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ వెల్లడించిన ఈ వివరాలు.. ప్రాజెక్ట్ భద్రతపైనే కాదు భారత్‌పై చూపే ప్రభావం గురించి తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. యార్లుంగ్ సాంగ్పో భారత్‌లోకి ప్రవేశించిన తర్వాత బ్రహ్మపుత్ర నదిగా మారి.. బంగ్లాదేశ్‌లోకి ప్రవేశించే ముందు లక్షల మంది ప్రజల జీవనాధారంగా నిలుస్తుంది.

చైనా చేపట్టిన ఈ మెగా డ్యామ్ ఇప్పటికే అంతర్జాతీయ వివాదంగా మారింది. ఎగువ చైనా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ వల్ల బ్రహ్మపుత్రలో నీటి భద్రత, పర్యావరణం, దిగువన ఉన్న పౌరుల జీవనానికి ముప్పు వాటిల్లుతుందని భారత్ పలుసార్లు ఆందోళన వ్యక్తం చేసింది. తాజాగా, చైనా శాస్త్రవేత్తలే మెగా డ్యామ్‌లో భౌగోళిక ముప్పు ఉందని అంగీకరించడంతో ఈ ప్రాజెక్ట్‌పై మరిన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చెంగ్డూ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, చైనా జియోలాజికల్ సర్వే సివిల్‌మిలిటరీ ఇంటిగ్రేషన్ సెంటర్, మిడిల్ యార్లంగ్ జాంగ్బో రివర్ నేచురల్ రిసోర్సెస్ అబ్జర్వేషన్ అండ్ రీసెర్చ్ స్టేషన్‌కు చెందిన పరిశోధకులు సంయుక్తంగా ఈ అధ్యయనం చేపట్టారు. ''ఐస్ ఏజ్ (హిమయుగం) కాలం నుంచి అత్యంత చురుకుగా ఉన్న పైజెన్ ఫాల్ట్, ఆనకట్టలు, రోడ్లు, వంతెనలు, సొరంగాలతో పాటు జలాశయ ప్రాంతంతో సహా సమీపంలోని నిర్మాణాల స్థిరత్వంపై తీవ్ర ప్రభావం చూపుతుంది'' అని పరిశోధకులు రాశారు. ఈ ఫాల్ట్ లైన్ కారణంగా చుట్టుపక్కల ఉన్న శిలలు దెబ్బతిన్నాయని, తద్వారా ఇంజనీరింగ్ నిర్మాణాలు బలహీనపడే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. జలాశయం చుట్టూ ఉన్న భూభాగం చాలా బలహీనంగా ఉందని, ఇది ప్రధాన వాలు వైఫల్యాల సంభావ్యతను పెంచుతుందని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల డ్యామ్ నిండిన తర్వాత నీటి ఒత్తిడికి, భూకంపాల ప్రభావానికి రెండువైపులా ఉన్న కొండచరియలు చాలా సులభంగా విరిగిపడే ప్రమాదం ఉందని చెప్పారు.

## నన్ను చంపినా ఫరవాలేదు..

- **డిసెంబరులో నా దేశానికి వెళతా**
- **బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా వ్యాఖ్యలు**



**ఢాకా, జులై 10:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి, అవామీ లీగ్ పార్టీ నాయకురాలు షేక్ హసీనా సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను స్వదేశానికి వెళ్లి న్యాయస్థానం ఎదుట లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. తన ప్రాణాలకు ముప్పు ఉన్నప్పటికీ.. మాతృదేశానికి వెళ్లే ఆలోచనలో ఉన్నానని ఆమె చెప్పారు. రాయిటర్స్ వార్త సంస్థకు ఇచ్చిన టెలిఫోన్ ఇంటర్వ్యూలో హసీనా ఈ వ్యాఖ్యలు చేశారు. అరెస్టుకు లేదా చావడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని పేర్కొన్నారు. అయితే, ఈ విషయంపై ప్రస్తుత బంగ్లాదేవ్ ప్రభుత్వంతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని ఆమె ఉద్ఘాటించారు. ''స్వదేశానికి వెళ్లిన తర్వాత నన్ను వాళ్లు అరెస్టు చేయొచ్చు.. ప్రాణాలు తీసే అవకాశమూ ఉంది.. తీవ్ర అణచివేతకు గురువుతోన్న నా పార్టీ నేతలు, కార్యకర్తల కోసం నేను వెళ్లి తీరాలి.. ఒకవేళ మరణమే తథ్యమైతే నా తల్లిదండ్రులను సమాధి చేసిన చోట, నా సొంత గడ్డపైనే చనిపోవాలని కోరుకుంటున్నా'' అని షేక్ హసీనా స్పష్టం చేశారు. ఏదేమైనప్పటికీ వచ్చే డిసెంబరులో తనతో పాటు అవామీ లీగ్ పార్టీ సీనియర్ నేతలు బంగ్లాదేశ్‌కు వెళ్లి కోర్టులో లొంగిపోవాలని నిర్ణయానికి వచ్చామని చెప్పారు. అయితే, తన అప్పగింతపై భారత్‌కు బంగ్లా నుంచి అనేక లేఖలు రాస్తున్నారని.. ఈ నేపథ్యంలోనే వెళ్లాలని నిర్ణయం తీసుకున్నానని ఆమె పేర్కొన్నారు.

రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్ యువత జులై 2024లో చేపట్టిన ఉద్యమం హింసాత్మకంగా మారి.. చివరకు షేక్ హసీనా పదవికి ఎసరు తెచ్చాయి. అదే ఏడాది ఆగస్టు 5న రాజీనామా చేసిన దేశం విడిచి భారత్‌కు పారిపోయిన వచ్చిన షేక్ హసీనా ఇక్కడే ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. అయితే, యువత నిరసనలను అణచివేయడంలో హసీనా పాత్ర ఉందని ఆరోపిస్తూ అనేక కేసులు నమోదయ్యాయి. అయితే, ఈ ఆరోపణలను హసీనా తోసిపుచ్చారు. కానీ, బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ మాత్రం విచారణ చేపట్టి ఆమెకు గతేడాది మరణశిక్ష విధించింది.



## బాధితులకు సర్కారు కొలువులు

- **కరూర్ తొక్కిసలాటపై విజయ్ ప్రభుత్వ నిర్ణయం**

**చెన్నై, జులై 10 (ఎ.ఎం.ఎస్)**: కరూర్ తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలన్న తమిళనాడు ప్రభుత్వ నిర్ణయానికి మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ మధ్యంతర ఊరటనిచ్చింది. ఈ నియామకాలపై స్టే విధించాలన్న పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. అయితే, ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలికమని, కేసులో తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. అలాగే, నియామకాలు పొందిన వారు తొలి నెల జీతం అందుకునేలోపు కేసు విచారణను పూర్తి చేయాలని కోర్టు నిర్ణయించింది. తదుపరి విచారణను జూలై 21కు వాయిదా వేసింది.

## భారత పోలీస్ అధికారిపై అభియోగాలు

- **నమోదు చేసిన ఎఫ్.బీ.ఐ.**
- **విచారణకు ఆదేశించిన ఉన్నతాధికారులు**



**న్యూఢిల్లీ, జులై 10(ఎ.ఎం.ఎస్):** అంతర్జాతీయ దోపిడీ ఆరోపణల కేసులో భారత పోలీస్ అధికారిపై అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అభియోగాలు నమోదుచేసింది. పంజాబ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ గురిందర్‌జిత్ సింగ్ నాగ్రాకు 4 లక్షల డాలర్ల దోపిడీ కేసులో సంబంధం ఉన్నట్టు ఎఫ్‌బీఐ అధికారులు ఆరోపించారు. అమెరికాలోని కుటుంబాలను లక్ష్యంగా చేసుకునే క్రిమినల్ ముఠాలు లారెన్స్ బిష్ణోయ్, జగ్గు భగవాన్‌పూరియా గ్యాంగులతో ఆయనకు సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు చేశారు. ఎఫ్‌బీఐ ఆరోపణలతో పంజాబ్ పోలీసు ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. పంజాబ్‌లోని హోషియార్‌పూర్ జిల్లాలో ఉన్న టాండా పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసర్ (SHO)గా గురిందర్‌జిత్ సింగ్ నాగ్రా విధులు నిర్వహిస్తున్నారు. ఎఫ్.బీ.ఐ.దర్యాప్తు చేస్తున్న ఒక దోపిడీ కేసులో ఆయనకు ప్రమేయం ఉందని సోషల్ మీడియాలో వార్తల నేపథ్యంలో ఆయనను వెంటనే హోషియార్‌పూర్‌లోని పోలీస్ లైన్స్‌కు బదిలీ చేయాలని సీనియర్ ఎస్పీ ఆదేశించారు. ముందస్తు చర్యగా ఆయనను బదిలీ చేశామని, ఆరోపణలపై దర్యాప్తు ప్రారంభించామని ఆయన తెలిపారు. ఎఫ్‌బీఐ అభియోగ పత్రంలో నాగ్రా పేరు ఉన్నట్లు వార్తలు రావడంతో దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగేలా విచారణను జలంధర్ రూరల్ ఎస్పీకి జలంధర్ రేంజ్ డీఐజీ అప్పగించారు. భారత్‌కు చెందిన ఒక వ్యవస్థీకృత నేర ముఠాలపై అమెరికా అభియోగపత్రంలో నాగ్రాకు సంబంధం ఉందని మీడియా నివేదికలు, సోషల్ మీడియా ద్వారా వస్తున్న వార్తలను పరిగణనలోకి తీసుకున్న పంజాబ్ పోలీసులు.. విచారణకు ఆదేశించారు. సంబంధిత వాస్తవాలు, ఆరోపణలన్నింటినీ పరిశీలించాలని విచారణ అధికారిని ఆదేశించారు. ఈ విచారణలో తేలే అంశాల ఆధారంగానే తదుపరి చట్టపరమైన చర్యలు ఉంటాయని పంజాబ్ పోలీసులు తెలిపారు.

'ఆపరేషన్ హార్డ్ బాల్' కింద ఓ అంతర్జాతీయ దోపిడీ వ్యవహారంపై ఎఫ్‌బీఐ దర్యాప్తు చేపట్టింది. నివేదికల ప్రకారం గ్యాంగ్‌స్టర్ జగ్గు భగవాన్‌పూరియా ఒక భారతీయ జైలు నుంచి నేర ముఠాను నడిపాడని, పంజాబ్ పోలీసు అధికారి గురిందర్‌జిత్ సింగ్ కల్పిత హత్య కేసులో అమెరికాకు చెందిన ఒక కుటుంబాన్ని ఇరికించడానికి ప్రయత్నించాడని అభియోగపత్రం ఆరోపించింది. ఒక దోపిడీకి సంబంధించిన ఎఫ్‌బీఐ దర్యాప్తులో ఇతని పేరు కూడా ఉంది.

## యూరప్‌నకు ట్రంప్ వింత షరతులు

- **గ్రీన్‌లాండ్ కోసం సహకరించాలంటూ విజ్ఞప్తి**
- **నాటోతో సంబంధాలు దెబ్బతింటున్నాయంటూ ఆక్రోశం**



**వాషింగ్టన్, జులై 10:** యూరప్‌లో అమెరికా సైన్యం ఉండాలంటే మిత్రదేశాలు రెండు షరతులను పాటించాల్సి ఉంటుందని దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. గ్రీన్‌లాండ్‌పై తన ఆశయాలకు సహకరించాలని, ఇరాన్‌పై సైనిక చర్యకు మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిల్డెన్‌హాల్‌లోని రాయల్ ఎయిర్‌ఫోర్స్ (ఆర్ఏఎఫ్) వైమానిక కేంద్రంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. అమెరికా సైనిక చర్యకు మద్దతు ఇస్తూ ఇరాన్‌ను ఏకాకిని చేసేందుకు యూరోపియన్ దేశాలు సుముఖత ప్రదర్శించకపోవడాన్ని ట్రంప్ తప్పుపట్టారు. అమెరికాకు సాయం అందించే విషయంలో ఆ దేశాలు ఆలస్యంగా ప్రతిపాదనలు పంపాయని చెప్పారు. 'అంతా గ్రీన్‌లాండ్, ఇరాన్‌పై ఆధారపడి ఉంది. వారు ఇప్పుడు సాయం చేయాలని అనుకుంటున్నారు. కానీ ఇప్పటికే కొంత ఆలస్యం జరిగింది. ఎందుకంటే ఇప్పుడు చేయడానికి పోరాటం లేదు. వారికి అవకాశం ఉన్నప్పుడు సాయం చేయకూడదని అనుకున్నారు.

అయితే మనం ఆ విషయాన్ని మర్చిపోతున్నాం. ఇప్పుడేమో ఇరాన్ విషయంలో సాయం చేయాలని ఆరాటపడుతున్నారు. కానీ మనకు నిజంగా సాయం అవసరం లేదు' అని అన్నారు. గ్రీన్‌లాండ్ అమెరికా నియంత్రణలోనే ఉండాలని ట్రంప్ నాటో సదస్సులో పునరుద్ఘాటించిన విషయం తెలిసిందే. ఆ ఆర్కిటిక్ ద్వీపం అమెరికా భద్రతకు వ్యూహాత్మకమైనదని ఆయన వాదించారు. అంతకుముందు జరిగిన ఓ సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ గ్రీన్‌లాండ్‌పై అమెరికా నియంత్రణ సాధించడం వాషింగ్టన్‌దాని మిత్రదేశాల సంబంధాలను ప్రభావితం చేయవచ్చునని అంగీకరిం చారు. అయితే అది నాటోతో తన సంబంధాలను దెబ్బతీస్తుందని చెప్పారు.

## పిటిషనర్‌పై జడ్జి తీవ్ర ఆగ్రహం

- **పత్రాలు విసిరేయటంతో కలకలం**
- **సుప్రీంకోర్టులో ఘటన**



**న్యూఢిల్లీ, జులై 10 (ఎ.ఎం.ఎస్) :** సుప్రీంకోర్టులో శుక్రవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఓ కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ న్యాయమూర్తులపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డాడు. చేతిలో ఉన్న కేసు పత్రాల కట్టను న్యాయమూర్తుల దయాస్ వైపు విసిరేయడంతో భద్రతా అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు.

అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఓ తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. నేడు విచారణ సందర్భంగా స్వయంగా హాజరై తన వాదనలు వినిపించే క్రమంలో అసాధారణంగా దూకుడుగా ప్రవర్తించాడు. వాదనలు ప్రారంభించిన వెంటనే 'లక్నో ఏసీపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను ఆదేశిస్తున్నా' అంటూ న్యాయమూర్తులను ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. దీంతో ఆశ్చర్యానికి గురైన జస్టిస్ కేవీ విశ్వనాథన్.. 'మీరు మమ్మల్ని ఆదేశిస్తున్నారా?' అని ప్రశ్నించారు. దీనికి స్పందించిన పిటిషనర్ 'నా తరఫున చెప్పాల్సిందంతా చెప్పాను. అన్నీ రికార్డులో ఉన్నాయి' అని పేర్కొన్నాడు. అనంతరం ఒక్కసారిగా ఆగ్రహానికి లోనై కేసు పత్రాలను గాల్లోకి విసిరేయడంతో పాటు, కోర్టు హాలులోనే న్యాయమూర్తులను ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి పిటిషనర్‌ను అదుపులోకి తీసుకుని కోర్టు హాలు నుంచి బయటకు తరలించారు.

## చైనాలో ఘోర అగ్ని ప్రమాదం

- **28 మంది కార్మికులు దుర్మరణం**
- **కొనసాగుతున్న సహాయక చర్యలు**

**బీజింగ్, జులై 10:** చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఆగ్నేయ చైనాలోని ఫుజియాన్ ప్రావిన్స్‌లో గల ఒక షూ ఫ్యాక్టరీలో గురువారం భారీ మంటలు చెలరేగడంతో 28 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.

భవనంలో మరికొందరు చిక్కుకుని ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. షూ రాజధానిగా పిలిచే జిన్‌జియాంగ్ నగరంలోని హుయిటెంగ్ షూస్ ఫ్యాక్టరీలో ఈ విషాదం చోటుచేసుకుంది. బహుళ అంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగలు అలుముకున్నాయి.

భవనం పైకప్పుపై చిక్కుకున్న కొందరు కార్మికులు ప్రాణరక్షణ కోసం ఆర్తనాదాలు చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే సుమారు 200 మంది అగ్నిమాపక సిబ్బంది 35 అగ్నిమాపక యంత్రాలతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షూ తయారీలో వినియోగించే మండే స్వభావం కలిగిన ముడి పదార్థాల వల్లే మంటలు వేగంగా వ్యాపించినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ దుర్ఘటనపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇదొక భారీ ప్రాణ నష్టమని ఆవేదన వ్యక్తం చేస్తూ, సహాయక చర్యలను వేగవంతం చేయాలని

, బాధితుల కుటుంబాలకు అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు.

## పీవోకేలో ఉద్రిక్తతలు తీవ్రం



- **పాకిస్థాన్‌కు 48 గంటల డెడ్‌లైన్**
- **భారీ ప్రదర్శనకు జేఏసీ నిర్ణయం**

**ఇస్లామాబాద్, జులై 10:** పాక్ ఆక్రమిత కశ్మీర్ లో ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరుకున్నాయి. అక్కడ ప్రజా ఉద్యమానికి నేతృత్వం వహిస్తోన్న జమ్మూ కశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ పాకిస్థాన్ ప్రభుత్వానికి 48 గంటల డెడ్‌లైన్ విధించింది. ఆలోగా తమ 38 డిమాండ్లను అంగీకరించకుంటే భారీ ఎత్తున నిరసనకు దిగి, తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించింది. జులై 27 జరగనున్న స్థానిక శాసనసభ ఎన్నికల్లో 12 సీట్లను శరణార్థులకు కేటాయించడం ఈ ఉద్రిక్తతలకు కారణం.

జూన్ 9న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో ముజఫరాబాద్‌కు భారీ నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు జేఏసీ ప్రకటించింది. ఇది ఇటీవలి కాలంలో ఈ ప్రాంతం చూసిన అతిపెద్ద రాజకీయ ఘర్షణలలో ఒకటిగా మారుతుందనే సంకేతాలు ఇచ్చింది.

శరణార్థులకు సీట్లు కేటాయింపు పీఓకే రాజకీయాలపై ఇస్లామాబాద్ అసమానమైన ప్రభావాన్ని కొనసాగించడానికి వీలు కల్పిస్తాయని జాక్ వాదిస్తోంది. జర్నలిస్ట్ లవ్ పూరి ప్రకారం.. 12 శరణార్థుల సీట్లు పాకిస్థాన్‌లోని సుమారు 4.36 లక్షల నమోదిత ఓటర్లకు ప్రాతినిధ్యం వహిస్తుండగా.. మిగిలిన 33 ప్రత్యక్షంగా ఎన్నికయ్యే సీట్లు పీఓకేలో నివసిస్తున్న దాదాపు 33 లక్షల ఓటర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఈ ప్రాంత నివాసితులకు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల కంటే శరణార్థుల నియోజకవర్గాలకు ఇది ఎన్నికల్లో ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తుందని వాదిస్తున్నారు. దీనికి తోడు 12 రిజర్వ్ సీట్లను రద్దుచేయాలంటే రాజ్యాంగ సవరణ అవసరమని పీఓకే సుప్రీం కోర్టు జూన్ 7న తీర్పు ఇచ్చింది. పాకిస్థాన్ సైన్యం, పీఓకే ఉద్యమకారులకు జరిగిన ఘర్షణల్లో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. శరణార్థుల సీట్ల అంశం తక్షణ సమస్యగా మారినప్పటికీ, జేఏసీ చార్టర్ అంతకంటే లోతైన ఆర్థిక అసంతృప్తిని ప్రతిబింబిస్తుంది. రిజర్వ్ సీట్లను రద్దు చేయాలని కోరడంతో పాటు, జలవిద్యుత్ ప్రాజెక్టులపై పూర్తి పునఃసమీక్ష, విపరీతంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికి నిత్యావసర వస్తువులపై అధిక సబ్సిడీలు, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేసింది. తమ ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు స్థానికులు అధిక ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని కూడా వాదిస్తోంది. రాజకీయ వివక్ష, ఆర్థిక నిర్లక్ష్యం వంటి వాటిపై స్థానికులలో పెరుగుతున్న అసంతృప్తిని ఈ డిమాండ్లు ప్రతిబింబిస్తున్నాయి.



## 13న అయోధ్య పిటిషన్లపై విచారణ

- **సుప్రీంకోర్టు వెల్లడి**
- **పోలీసు కస్టడీలో ప్రధాన నిందితుడు**

**అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగంపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలంటూ దాఖలైన పిటిషన్‌లను జులై 13(సోమవారం) విచారించనున్నట్లు సుప్రీంకోర్టు శుక్రవారం పేర్కొంది. ఈ పిటిషన్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు జాబితా అయినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయిఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ముగ్గురిలో ఒకరైన అనుకల్ప్ మిశ్రాను అయోధ్య పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. .**

**న్యూఢిల్లీ, జులై 10 (ఎ.ఎం.ఎస్):** అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగంపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలంటూ దాఖలైన పిటిషన్‌లను జులై 13(సోమవారం) విచారించనున్నట్లు సుప్రీంకోర్టు శుక్రవారం పేర్కొంది. ఈ పిటిషన్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు జాబితా అయినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. చంపత్ రాయ్, అనిల్ మిశ్రా, గోపాల్ రావుల విఐపి దర్శన పాస్ ఐడీలను ట్రస్ట్ నిలిపివేసిందన్న వార్తలను రామజన్మభూమి ఆలయ ట్రస్ట్ సభ్యులైన మహంత్ దినేంద్ర దాస్ మహారాజ్ స్పష్టం చేశారు. చంపత్‌రాయ్ ఐడిని వినియోగించి పాస్‌లు జారీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ముగ్గురిలో ఒకరైన అనుకల్ప్ మిశ్రాను అయోధ్య పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయోధ్య నిధుల దుర్వినియోగంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణను చేపడుతున్న సంగతి తెలిసిందే. అయోధ్యలోని రామమందిర విరాళాల లెక్కింపు గదిలో తీవ్రమైన భద్రతా లోపాలు ఉన్నట్లు సిట్ ప్రాథమిక విచారణలో గుర్తించింది.

అక్కడి సిబ్బంది తమ దుస్తులు, జేబులు, షూ, ఇతర వ్యక్తిగత వస్తువులలో నగదు కట్టలను దాచిపెట్టారని పేర్కొంది. అలాగే ఈ చోరీ అనేది ఏదో ఒక సందర్భంలో జరిగిన ప్రత్యేక సంఘటన కాదని, ఒక పద్ధతి ప్రకారం , పదేపదే జరిగిన వ్యవహారమని తెలిపింది.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## పిల్లలను ప్రతిరోజూ బడికి పంపాలి: కలెక్టర్

**ఆదిలాబాద్ (ఉదయం ప్రతినిధి):**



పిల్లలను ప్రతిరోజూ బడికి పంపించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. తలమడుగు మండలం డోర్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధితో పాటు మౌలిక వసతులు ఎంతో ముఖ్యమన్నారు. నూతన విబిజి రామ్ జీ పథకం ద్వారా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని తెలిపారు. గతంతో పోలిస్తే పాఠశాలల్లో వసతులు మెరుగుపడ్డాయని, తల్లిదండ్రులు బాధ్యతగా పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపించాలని సూచించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా త్వరలోనే అదనపు సిబ్బందిని ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రతిరోజూ హోంవర్క్ ఇచ్చి వారి ప్రగతిని పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. గతంలో వరద ముంపు ప్రాంతాల పరిశీలనకు వచ్చిన సమయంలో గ్రామస్థులు పాఠశాల సమస్యలను తన దృష్టికి తీసుకురాగా, స్పందించి పనులను వేగంగా పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులు, సర్పంచ్, కాంట్రాక్టర్లను కలెక్టర్ అభినందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కను నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, పంచాయతీరాజ్ ఈఈ శివరాం, తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపీడీవో శంకర్, సర్పంచ్ పూజ, మాజీ జడ్పీటీసీ గణేష్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రవీందర్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం తనిఖీ చేసిన కలెక్టర్



**నిర్మల్ జిల్లా 10 జూలై 2026 (వుదయం ప్రతినిధి)**

కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను పరిశీలించారు. చేశారు. సీసీ కెమెరాల పనితీరు చూశారు. అగ్నిమాపక వ్యవస్థ పనితీరు తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణతో మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. సిబ్బంది పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అగ్నిమాపక అధికారి శివాజీ, తహసిల్దార్ రాజు, అధికారులు స్వాతి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ: కలెక్టర్

**కామారెడ్డి, జూలై 10 (వుదయం ప్రతినిధి):**




తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా జిల్లాలోని మూడు డివిజన్ కేంద్రాలలో సంబంధిత గ్రామ సర్పంచులు, కార్యదర్శులకు శుక్రవారం శిక్షణ శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. కామారెడ్డి మున్సిపల్ కళాభారతి ఆధ్వర్యంలో కామారెడ్డి డివిజన్ సంబంధించినటువంటి సర్పంచులు, పంచాయతీ శిక్షణ శిబిరానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హాజరై సర్పంచ్‌లను, కార్యదర్శిని ఉద్దేశించి మాట్లాడారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు.కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ సమగ్ర అభివృద్ధి ప్రణాళికను 2026–27, 2027–28, 2028–29 సంవత్సరాల కొరకు ప్రజలను, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి అధికారుల భాగస్వామ్యముతో తయారు చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించడం, నిధుల పారదర్శక వినియోగం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై ఈ శిక్షణలో వివరణాత్మకంగా అవగాహన కల్పించనున్నామని కలెక్టర్ తెలిపారు. "గ్రామ పంచాయతీయే గ్రామీణాభివృద్ధికి మూలం. సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో పని చేసి, ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనపై ఉంది. శిక్షణలో చెప్పే అంశాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా అమలు చేయాలి" అని కలెక్టర్ సూచించారు.16 వ ఆర్థిక సంఘం నిధులు వినియోగం, ప్రణాళిక పారదర్శకంగా ఉండాలి అని తెలిపారు. గ్రామ పంచాయితీలు తమ స్వంత ఆదాయమును పెంచుకుని 16 వ ఆర్థిక సంఘము నుండి 10% పెర్ఫిర్మన్స్ గ్రాంటు పొందాలని, మొదటి విడత ఇందిరమ్మ ఇండ్లలో రాష్ట్రం మొదటి 10 స్థానంలో నిలిచిందని, రెండవ విడత హెట్ ఫ్రీ జిల్లాగా మార్చుటకు సర్పంచులు సహకరించాలని సూచించారు. బడి బాటలో రాష్ట్రం 4 స్థానంలో ఉందని మొదటి స్థానంలో తీసుకురావడానికి జిల్లాలోని గ్రామాల సర్పంచులు కృషి చేసి ప్రభుత్వ పాఠశాలల్లో నవోదయ సంఖ్యను పెంచాలని కోరడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం, కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఎన్ వై గిరి, డిప్యూటీ కలెక్టర్ రవితేజ, డిపిఓ మురళి, డి ఆర్ డి ఓ దామోదర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, డి ఎల్ పి ఓ శ్రీనివాస్, ఎంపీడీవో, జిల్లా అధికారులు, సర్పంచులు, పంచాయతీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

## టాస్క్ ఆధ్వర్యంలో యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు..కలెక్టర్

**పెద్దపల్లి, జూలై- 10 (వుదయం ప్రతినిధి)**



పెద్దపల్లి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో, జిల్లాలోని తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో 3 నెలల పాటు ఉచిత శిక్షణ, ప్లేస్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.డిగ్రీ, బీ.టెక్, డిప్లొమా, పీజీ పూర్తి చేసిన, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు ఈ కార్యక్రమానికి అర్హులు అని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఎంఎస్ ఎక్సెల్, అడ్వాన్స్డ్ ఎక్సెల్, పవర్ బీఐ, పైథాన్, సాఫ్ట్ స్కిల్స్ వంటి నైపుణ్యాలపై అనుభవజ్ఞులైన శిక్షకుల ద్వారా శిక్షణ అందించబడుతుందని, శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికేట్‌తో పాటు ప్లేస్‌మెంట్ సహాయం అందించబడుతుందని, శిక్షణ ఉచితంగా అందించబడుతుందని, అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కోసం ఒక్కసారి మాత్రమే రూ.600 చెల్లించాల్సి ఉంటుందని, ఇతరత్రా ఎటువంటి ఫీజులు ఉండవని కలెక్టర్ పేర్కొన్నారు. కేవలం 100 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, అభ్యర్థులకు హాజరు తప్పనిసరి అని, ఆసక్తి గల అభ్యర్థులు జూలై 15లోపు పెద్దపల్లిలోని TASK ప్రాంతీయ కేంద్రంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9059506807 ఫోన్ నంబర్ లో సంప్రదించాలని, జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి: జిల్లా ఎస్పీ నికిత పంత్

**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**



కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల పరిధిలో బాంబారా, వాంకిడి, కమాన ఎక్స్ రోడ్ బ్లాక్ స్పాట్స్‌ను జిల్లా ఎస్పీ నితికా పంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారుల అధికారులు ఎన్ హెచ్ ఏ ఐ పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజలు మరింత అప్రమత్తంగా వాహనాలు నడిపేలా అవసరమైన ప్రాంతాల్లో స్పష్టమైన సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, సోలార్ లైటింగ్స్ ఏర్పాటు చేయాలని, అలాగే ప్రమాదాలకు అవకాశం ఉన్న చోట్ల రోడ్ బంప్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువ అయినా చోట రోడ్డు మళ్లింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు భద్రత సూచికలకు సంబంధించిన హెచ్చరిక బోర్డులు, స్పీడ్ లిమిట్ సూచనలు, రిఫ్లెక్టివ్ మార్కింగ్స్ వంటి అంశాలు సమర్థవంతంగా అమలు చేయడం వల్ల వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రమాద ప్రాంతాల్లో గ్రిల్స్ ఏర్పాటు, రోడ్ల విస్తరణకు సూచనలు అందించారు. వాహనాల వేగ నియంత్రణకు మరిన్ని స్పీడ్ బ్రేకర్స్ అవశ్యకమని, రాత్రి ప్రయాణాలు సులువు కోసం సోలార్ స్టడ్స్, బ్లింకింగ్ లైట్స్ ఏర్పాటు చేయాలనీ, ఈ భద్రత చర్యలతో రోడ్డు భద్రత మెరుగుదల, ప్రమాదాల తగ్గింపే లక్ష్యమని అన్నారు. రోడ్డు మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు, ప్రజల్లో అవగాహన పెంపొందించడమూ అంతే ముఖ్యమని, పోలీస్ శాఖ, సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పని చేసి ప్రమాదాలను గణనీయంగా తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఏ ఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ అజయ్ , ఆసిఫాబాద్ డిఎస్పీ అశోక్, వాంకిడి సిఐ వేణుగోపాల్, ఇన్స్పెక్టర్ రవీందర్, వాంకిడి ఎస్ఐ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



**పెద్దపల్లి జులై 10 (వుదయం ప్రతినిధి)**

పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలో వివాహిత నిమ్మ లావణ్య (34) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు చొప్పదండి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన తిరుపతిని వివాహం చేసుకుంది.కుటుంబ కలహాల కారణంగా గత రెండు నెలలుగా లావణ్య పుట్టింట్లో ఉంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి భర్తతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.సమాచారం అందుకున్న పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మధుకర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.త

## గడువులోగా 100శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి...

**జగిత్యాల జులై 10 (వుదయం ప్రతినిధి)**

**ఎస్ఐఆర్ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్**

**నిర్వహించిన భారత ఎన్నికల కమిషన్ సీనియర్ సెక్రటరీ**




ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) –2026 కార్యక్రమంలో భాగంగా జూలై 24 నాటికి ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను వంద శాతం పూర్తి చేయాలని భారత ఎన్నికల కమిషన్ సీనియర్ అధికారి డాక్టర్ పవన్ కుమార్ శర్మ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు శుక్రవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని ఆయన సమీక్షించారు హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి పాల్గొనగా జగిత్యాల సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ)నుంచి జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు ఈ సందర్భంగా డాక్టర్ పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం కేవలం 22 శాతం ఎన్యూమరేషన్ ఫారాలు మాత్రమే డిజిటలైజ్ అయ్యాయని తెలిపారు ఇప్పటికే గడువులో సగం సమయం పూర్తయిన నేపథ్యంలో మిగిలిన 14 రోజుల్లోనే డిజిటలైజేషన్‌ను వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు ఇకపై ప్రతి రోజూ కనీసం 8 శాతం చొప్పున డిజిటలైజేషన్ జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు పంపిణీ చేసిన ప్రతి ఎన్యూమరేషన్ ఫారాన్ని తిరిగి ఓటర్ల నుంచి సేకరించి డిజిటలైజ్ చేయడం అధికారుల బాధ్యతేనని తెలిపారు అనేక మంది బీఎల్ఓలు ఇప్పటి వరకు ఒక్క ఫారాన్ని కూడా డిజిటలైజ్ చేయలేదని అలాంటి బీఎల్ఓలపై ప్రత్యేక దృష్టి సారించి వారి పని తీరును మెరుగుపర్చాలని ఆదేశించారు ఎస్ఐఆర్ కార్యక్రమానికి ఇతర కార్యక్రమాల కంటే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు ప్రతి రోజు యాదృచ్ఛికంగా ఐదుగురు బీఎల్ఓ లకు ఫోన్ చేసి వారి పురోగతిని తెలుసుకోవాలని దీంతో పనిలో వేగం పెరుగుతుందన్నారు పని తీరు బలహీనంగా ఉన్న బీఎల్ఓ లకు ఇతర అధికారులు సూపర్‌వైజర్లు వాలంటీర్ల ద్వారా అవసరమైన సహకారం అందించాలని సూచించారు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) ను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా చేపట్టాలని 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న ప్రాంతాల్లో కొత్త పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు కొన్ని జిల్లాలు ఎస్ఐఆర్ కార్యక్రమంలో మంచి పురోగతి సాధిస్తున్నాయని పేర్కొంటూ నల్గొండ జిల్లా కలెక్టర్ పని తీరును అభినందించారు .

## ఓటర్ల జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**ధర్మపురి, జూలై 10 (వుదయం ప్రతినిధి):**

**ధర్మపురిలో ప్రక్రియను పరిశీలించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్**



భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కోసం చేపట్టిన ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ధర్మపురి పురపాలక సంఘ పరిధి లోని ఐదవ వార్డులో శుక్రవారం క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను మంత్రి స్వయంగా పరిశీలించారు. అధికారుల పనితీరును,పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా స్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని,భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మనకు కల్పించిన ఈ అమూల్యమైన హక్కు ద్వారానే సమర్థవంతమైన ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఓటు హక్కును పొందడం ద్వారా ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగ స్వాములు కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ఓటరు నమోదు, సవరణ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయడానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని మంత్రి వెల్లడించారు. క్షేత్రస్థాయిలో ఈ ప్రక్రియ ఎలా సాగుతుందో పరిశీలించేందుకే తాను స్వయంగా వార్డుల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు.కొత్తగా ఓటు హక్కు దరఖాస్తు చేసుకునే వారు,మార్పులు చేర్పులు చేయించుకునే వారు అధికారులకు పూర్తిస్థాయిలో సరైన సమాచారాన్ని అందించి సహకరించాలని కోరారు.కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్న అధికారులను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. ప్రజలు కూడా తమ బాధ్యతగా వివరాలను అందించి ఈ ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయం చైర్మన్ సంఘన బట్ల.దినేష్,మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి ,తహశీల్దార్ శ్రీనివాస్,ఎఎంసి చైర్మన్ చిలుముల లావణ్య,మండల కాంగ్రెస్అధ్యక్షుడు చిలుముల. లక్ష్మణ్,ఉపాధ్యక్షుడు వేముల.రాజేష్, మాజీ జెడ్పిటిసి బాధినేని.రాజేందర్, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పిన అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలు

**కరీంనగర్ జులై 10 (వుదయం ప్రతినిధి):**



కరీంనగర్లోని శుభం గార్డెన్స్ లో అల్ఫోర్స్ జూనియర్ కళాశాలల విభావరి పేరుతో నిర్వహించినటువంటి సాంస్కృతిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరేందర్ రెడ్డి హాజరైమాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యాసంస్థలు ఆరంభం నాటి నుండి అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నదని మరియు విద్యార్థులను ఉత్తమమైన స్థానాలలో స్థిరపరుస్తున్నదని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ప్రణాళిక బద్ధంగా కష్టపడాలని మరియు విజయాలను సాధించాలని తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో అత్యధిక సీట్లు సాధించినదని హర్షం వ్యక్తం చేశారు.2025 26 విద్యాసంవత్సరంలో అత్యుత్తమ ఫలితాలు సాధించినటువంటి విద్యార్థులకు ఘన సత్కారం చేశారు మరియు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా తరగతి గదిలో నేర్చుకున్నటువంటి విషయాలను సమీక్షించుకోవాలని తద్వారా పట్టు సాధించగలుగుతారని వారు చెప్పారు.ఏ సమయంలో ఏ పరీక్షనైనా చాలా సులభం ఎదుర్కోవచ్చని మరియు విజయాలను నమోదు చేసి ఉత్తమమైన స్థానాలను కైవసం చేసుకోగలుగుతారని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా తల్లిదండ్రుల ఆశయాలకనుగుణంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు ప్రణాళికలను రూపొందిస్తూ కార్పొరేట్ విద్యా సంస్థలకు అధిక అత్యుత్తమ ఫలితాలను నమోదు చేస్తూ చారిధ్యాత్మక అడుగులు అడుగులు వేస్తున్నదని మరియు అద్భుతమైన చరిత్రను నమోదు చేస్తున్నదని హర్షం వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులను వారి యొక్క అమూల్యమైనటువంటి సహాయ సహకారాలను అందిస్తూ ఆల్ఫోర్స్ విద్యాసంస్థలను అగ్రగామిగా నిలపాలని కోరారు. వేడుకల సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు చాలా అలరింపచేసాయి.ఈ కార్యక్రమంలో వివిధ కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహణ

**పెద్దపల్లి జులై 10 (వుదయం ప్రతినిధి)**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సర్వేలో భాగంగా పెద్దపల్లిలో గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేను గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ సర్వే నిర్వహించారు. పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ గారిని తన కార్యాలయంలో కలిసి సర్వే కరపత్రాలను అందించి సర్వే ప్రాముఖ్యతను వివరించారు. జాతీయ గణాంక శాఖ 2026వ సంవత్సరానికి గాను ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే రామగుండంలో సర్వే చేశారు.

ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టణాలను,గ్రామాలను ఎంపిక చేసుకుని ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వేలో మొదట సాధారణ వివరాలతో సర్వే చేసిన,అనంతరం మొబైల్ ట్యాబ్ ద్వారా గ్రామం లోని కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి ప్రత్యేక ట్యాబ్లో వివరాలు నమోదు చేస్తామని తెలిపారు.తొలి విడతలో కుటుంబ యజమాని పేరు, సభ్యులు వారి విద్యా అర్హతల గురించి, చదువు మానేసిన, ఉన్నత చదువులు,వృత్తివిద్య కోర్సులు, ఉద్యోగం, స్వయం ఉపాధి, వివరాలు రోజువారి కూలీ అయితే వారంలో ఏ పని చేశారో,ఎన్ని గంటలు పని చేశారో,ఎంత వేతనం పొందారో వివరాలతో పాటు మహిళలు స్వయం ఉపాధి పొందే వాళ్ళు అయితే వారి ఆదాయ వివరాలు, మరియు ఆన్లైన్ ఆర్డర్స్, ప్లాట్ఫారం వర్కర్స్, గిగ్గు వర్కర్స్ జొమాటో, స్విగ్గి , రాపిడో ,ఓలా , ఉబర్ వంటి ఆన్లైన్ ఆర్డర్స్ లో పనిచేసేటువంటి వ్యక్తుల యొక్క విషయాలను నమోదు చేసుకుంటామని తెలిపారు.

## శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి

**కామారెడ్డి, జూలై 10 (వుదయం ప్రతినిధి):**



కామారెడ్డి పట్టణ కేంద్రంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందజేశారు.ఈ సందర్భంగా గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి అమ్మవారి ఆశీస్సులతో కామారెడ్డి నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రంఅన్ని రంగాల్లో మరింతఅభివృద్ధిసాధించాలని ప్రార్థించారు. ప్రజాసేవే తన లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంపరి లక్ష్మణ్, జూలూరి సుధాకర్, సబ్బని హరికృష్ణ, రంగ రమేష్ గౌడ్, మామిళ్ళ రమేష్, మెహర్ బాబాగౌడ్, రాహుల్ తదితరులు.

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్‌పామ్ 102 ఎకరాల్లో మెగా ప్లాంటేషన్ ప్రోగ్రామ్

**పెద్దపల్లి జులై 10 (వుదయం ప్రతినిధి)**




పెద్దపల్లి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ కార్యక్రమంలో భాగంగా ఈరోజు జిల్లాలో 102 ఎకరాల్లో మెగా ఆయిల్‌పామ్ నాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన & పట్టు పరిశ్రమల అధికారి శ్రీ గడ్డం శ్యామ్ ప్రసాద్ గారు పెద్దపల్లి మండలం రాంపల్లి గ్రామానికి చెందిన శ్రీ గౌరవెల్లి రవీందర్ రావు గారి 4.5 ఎకరాల పొలంలో నిర్వహించిన ఆయిల్‌పామ్ నాట్ల కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడు సంవత్సరాల క్రితం ఆయిల్‌పామ్ సాగు చేపట్టిన రైతులు ప్రస్తుతం మంచి దిగుబడులు, అధిక ఆదాయం పొందుతూ సంతోషంగా ఉన్నారని తెలిపారు. రైతులకు ఎదురయ్యే ఎలాంటి సమస్యలైనా ఉద్యాన శాఖ ఎప్పటికప్పుడు గుర్తించి, అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ పరిష్కరిస్తోందని చెప్పారు. ప్రస్తుతం వాతావరణ మార్పులు, ముఖ్యంగా ఎల్‌నినో (El Ni, o) ప్రభావంతో వర్షపాతం అనిశ్చితంగా మారుతున్న నేపథ్యంలో, తక్కువ నీటితో అధిక ఆదాయం అందించే సూక్ష్మ సేద్య పద్ధతుల్లో ఆయిల్‌పామ్ సాగు రైతులకు ఒక మంచి ప్రత్యామ్నాయమని వివరించారు. ఒక ఎకరం వరి సాగుకు అవసరమయ్యే నీటితో సుమారు నాలుగు ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయవచ్చని రైతులకు అవగాహన కల్పించారు.రైతులకు పోషక యాజమాన్యం (Nutrient Management), నీటి యాజమాన్యం (Irrigation Management), తోటల నిర్వహణపై సాంకేతిక సూచనలు అందించారు. తెలంగాణ ప్రభుత్వం నాలుగు సంవత్సరాల పాటు అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకొని అధిక విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో తిరుమల ఆయిల్ కెమ్ ఇండియా లిమిటెడ్ (TOCIL) ముఖ్య కార్యనిర్వాహణ అధికారి (CEO) శ్రీ కేషు కల్యాంకర్, ఉద్యాన అధికారి శ్రీ మహేష్, ఉద్యాన విస్తరణ అధికారి శ్రీ రాము, ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీ అరవింద్ తదితరులు పాల్గొని రైతులకు సాంకేతిక సూచనలు అందించారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు




## టియుడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా ఉపాధ్యక్షులుగా అడెం మల్లేశం

**సంగారెడ్డి, జూలై 10,వుదయం :**

టియుడబ్ల్యూజే(ఐజేయు) సంగారెడ్డి జిల్లా శాఖ ఉపాధ్యక్షులుగా అడెం మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు సంగారెడ్డిలోని టీఎన్జీవో భవన్ లో నిర్వహించిన జిల్లా మహాసభకు రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ , ప్రధాన కార్యదర్శి రామనారాయణ , రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైసల్ అహ్మద్ ముఖ్య అతిథులుగా మహాసభలో పాల్గొన్నారు. మహాసభ అనంతరం ఎన్నికల అధికారి సిద్ధన్న అధ్యక్షతన జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా ఉపాధ్యక్షులుగా అడెం మల్లేశం ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైసల్ అహ్మద్, జిల్లా అధ్యక్షులు బండారి యాదగిరికి కృతజ్ఞతలు తెలియజేశారు. సంగం బలోపేతానికి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం సంఘం నాయకులతో కలిసి ముందుకెళ్తామని మల్లేశం తెలిపారు.

## ఆకాశం కరుణించలేదు...పాలన ఆదుకోలేదు!

- **ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ఎండిన పొలాలు... పెరిగిన అప్పులు... ఆవేదనలో రైతాంగం**

**గద్వాల జూలై 10 (వుదయం బ్యూరో)**

ఏరువాక వచ్చింది... కానీ నాగలి కదల్లేదు. విత్తనం సిద్ధంగా ఉంది... కానీ నేలలో పడలేదు. ఆకాశం మేఘాలను చూపించింది... వానను కాదు. వ్యవసాయానికి వెన్నెముకగా నిలిచిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మరోసారి తీవ్రమైన వర్షాభావంతో విలవిల్లాడుతోంది. ఆశించిన రుతుపవనాలు లేకపోవడంతో వేలాది ఎకరాల్లో సాగు నిలిచిపోయింది. భూమి దాహంతో బీటలు వారుతుంటే, రైతు బతుకు అప్పుల ఊబిలో కూరుకుపోతోంది.

**ఎండిన నేల... కరిగిపోతున్న ఆశలు**

వాతావరణ హెచ్చరికలు వచ్చాయి. వర్షాల వార్తలు వినిపించాయి. కానీ జిల్లాలోని అనేక మండలాల్లో ఆ వాన పొలాల వరకు చేరలేదు. చిరుజల్లులు నేలను తడపలేకపోయాయి. విత్తనాలు గోదాముల్లోనే మిగిలిపోయాయి. ఏరువాక కాలం ముగిసినా సాగు మొదలు కాకపోవడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఒకవైపు అప్పులు... మరోవైపు వడ్డీలు... ఇంకోవైపు పంటపై అనిశ్చితి. ఇదే ఇప్పుడు రైతు కుటుంబాల దైనందిన వాస్తవం.

**చెరువులు ఖాళీ... బోర్లలో గాలి మాత్రమే**

ఉమ్మడిపాలమూరు జిల్లా ల్లాలోని అనేక చెరువులు అడుగంటాయి. భూగర్భ జలాలు క్షీణించాయి. బోర్లు విఫలమవుతున్నాయి. తాగునీటి కోసం గ్రామాలు ఎదురుచూస్తున్నాయి. పశుగ్రాసం లేక పశుసంపద కూడా ప్రమాదంలో పడుతోంది. కొన్ని ప్రాంతాల్లో పశుపోషకులు నీటి కోసం వలస బాట పడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి

**ప్రశ్నలు పెరుగుతున్నాయి... పరిష్కారాలు ఎక్కడ?**

ప్రతి ఏడాది వర్షాభావం పునరావృతమవు తున్నా, నీటి నిల్వలు పెంచే శాశ్వత చర్యలు ఎంతవరకు అమలవుతున్నాయన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. రిజర్వాయర్ల నిర్వహణ, డ్యాముల పునరుద్ధరణ, పంట కాలువల మరమ్మతులు, సాగునీటి ప్రణాళికలపై వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం



ఉందని రైతు సంఘాలు పేర్కొంటున్నాయి.

**రైతాంగం తక్షణ డిమాండ్లు**

సంక్షోభంలో ఉన్న అన్నదాతను ఆదుకోవడానికి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కింది చర్యలు చేపట్టాలని రైతు లోకం డిమాండ్ చేస్తోంది: రంగం తక్షణ కార్యాచరణ జల వనరులు కృష్ణా జలాల పరిధిలోని రిజర్వాయర్లను అత్యవసరంగా నింపాలి. మౌలిక వసతులు దెబ్బతిన్న డ్యాములు, పంట కాలువలను వెంటనే పునరుద్ధరించాలి.

ప్రజా సంక్షేమం

ప్రతి గ్రామానికి తాగునీటి ట్యాంకర్లు, సాగునీటి అత్యవసర ప్రణాళిక అమలు చేయాలి. ఆర్థిక సాయం వర్షాభావ ప్రభావిత రైతులకు రుణ ఉపశమనం, తక్షణ ఆర్థిక సాయం ప్రకటించాలి. పాలనా సంకల్పానికి పరీక్షా సమయం వర్షాలు కురవడం ప్రకృతి నిర్ణయం. కానీ కురిసిన ప్రతి చుక్కను నిల్వ చేసి రైతుకు అందించడం పాలన బాధ్యత కాదా? రైతు కళ్లలో కనిపిస్తున్నది కేవలం వాన కోసం ఎదురుచూపు కాదు... తన కుటుంబాన్ని నిలబెట్టుకోవాలనే ఆవేదన. ఎండిన నేల పగుళ్లు ఒక ప్రాంతం దాహాన్ని మాత్రమే కాదు, వ్యవసాయ సంక్షోభం తీవ్రతను కూడా చెబుతున్నాయి. రైతు నిలిస్తేనే గ్రామం నిలుస్తుంది. గ్రామం నిలిస్తేనే రాష్ట్రం బలపడుతుంది. రైతు ఆవేదనను వినడం, తక్షణ చర్యలు తీసుకోవడం కాలానుగుణ బాధ్యత. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కార్యాచరణకు దిగాలి.



## రామ్‌చందర్ రావుకు అభినందనలు తెలిపిన పంజా విజయ్ కుమార్

**మెదక్ జిల్లా వుదయం :**

నిజాంపేట మండలం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న ఎన్. రామ్‌చందర్ రావుకు నిజాంపేట మండల మాజీ జడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ్‌చందర్ రావు సమర్థవంతమైన నాయకత్వంలో తెలంగాణలో పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతమై కార్యకర్తల్లో నూతన ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశయాలకు అనుగుణంగా పార్టీని మరింత ముందుకు తీసుకెళ్తున్న ఆయన నాయకత్వంలో బీజేపీ తెలంగాణ చారిత్రాత్మక విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రామ్‌చందర్ రావు సంపూర్ణ ఆరోగ్యం, ఆయురారోగ్యాలతో పార్టీకి, ప్రజలకు మరెన్నో సంవత్సరాలు సేవలందించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## ఆయిల్ పామ్ సాగుపై రైతులకు విజ్ఞాన యాత్ర

**సంగారెడ్డి, వుదయం:**



సంగారెడ్డి జిల్లాఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులకు విజ్ఞాన యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 22 మంది రైతులను ఖమ్మం జిల్లా, కొనిజర్ల మండలంలోని ఆయిల్ పామ్ తోటల సందర్శనకు గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ సహకారంతో తీసుకువెళ్లారు.ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ ఆయిల్ పామ్ మిషన్ (NMEOOP) కార్యక్రమంలో భాగంగా రైతులకు ఆయిల్ పామ్ సాగుపై క్షేత్రస్థాయి అవగాహన కల్పించడం, శాస్త్రీయ సాగు పద్ధతులను పరిచయం చేయడం మరియు ఇతర ప్రాంతాల్లో విజయవంతంగా సాగు చేస్తున్న రైతుల అనుభవాలను తెలుసుకునే అవకాశాన్ని కల్పించడం ఈ విజ్ఞాన యాత్ర ముఖ్య ఉద్దేశ్యం.ఈ సందర్భంగా రైతులు ఆయిల్ పామ్ తోటలను ప్రత్యక్షంగా సందర్శించి మొక్కల పెంపకం, తోటల నిర్వహణ, ఎరువుల యాజమాన్యం, నీటి నిర్వహణ, పంట సంరక్షణ, దిగుబడులు, తాజా పండ్ల గుత్తుల (FFB) కోత, రవాణా, ప్రాసెసింగ్ మరియు మార్కెటింగ్ అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన పొందారు.అదేవిధంగా, ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులతో ముఖాముఖిగా సమావేశమై, వారు అనుసరిస్తున్న సాగు పద్ధతులు, నిర్వహణ విధానాలు, పంట ద్వారా పొందుతున్న ఆదాయం, ఎదురైన సమస్యలు మరియు వాటి పరిష్కారాల గురించి తెలుసుకున్నారు. ఈ పరస్పర చర్చలు రైతుల్లో ఆయిల్ పామ్ సాగుపై మరింత నమ్మకాన్ని పెంపొందించాయి. విజ్ఞాన యాత్రను ఉద్యాన అధికారి శ్రీమతి కె. మౌనికా రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆయిల్ పామ్ దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే వాణిజ్య పంట అని, ప్రభుత్వం NMEOOP పథకం ద్వారా అందిస్తున్న ప్రోత్సాహకాలు మరియు సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని సూచించారు. అలాగే శాస్త్రీయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించి మంచి ఆదాయాన్ని పొందవచ్చని రైతులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి శ్రీమతి కె. మౌనికా రెడ్డి, గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ ఏజీఎం శ్రీ ఈశ్వర్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు మరియు సంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి గల రైతులు పాల్గొన్నారు.



## పట్నం వద్దు పల్లెటూరు కావాలి...!

- **సొంతూరుకే ఓటు**
- **హైదరాబాద్ నగరంలో తమకు ఓటు వద్దంటున్న 35% మంది ఓటర్లు**
- **ఎన్యూమరేషన్ ఫారం నింపడానికి ససేమిరా**
- **శివార్లలో బిఎల్ఓ లకు చుక్కలు**
- **పల్లెల్లోనే ప్రభుత్వ పథకాలు అందుతాయని విశ్వాసం**
- **ఆధార్ ఇక్కడ.. ఓటు అక్కడ అంతా అయోమయం**

**వికారాబాద్, జూలై 10 (వుదయం బ్యూరో):**

మా ఓటు.. మా ఊళ్ళోనే ఉండాలి. మాకు ఇక్కడ ఓటు అవసరం లేదు.' 'మా ఊరు మా ఓటు' ఇదీ ఎస్ఐఆర్ ప్రక్రియలో బిఎల్ఓలకు హైదరాబాద్ మహా నగరంలోని ఓటర్లు చెబుతున్న విషయం. 30....35% మంది మాకు నగరం లో ఓటు అక్కర్లేదంటూ ఎన్యూమరేషన్ ఫా రంను నింపడంలేదని ససేమిరా అంటున్నారని చాలా మంది మా ఓటును ఇక్క డి జాబితాలో నుండి తొలగించాల్సిందిగా కోరుతున్నారనేది బిఎల్ఓల నుండి వస్తున్న సమాధానం. ఇక్కడ ఎందుకు ఓటు వద్దంటున్నారు..? ముందు జాబితాలో ఉంది కదా..? ఇప్పుడు ఊళ్ళోనే ఉండాలని కోరుకుంటున్నారు..? అని బిఎల్ఓలు ప్రశ్నిస్తే.. సొంత ఊళ్ళలోనే ఓటును వినియోగిస్తామని ఖరాకండిగా సమాధానాలు ఇస్తుండటం గమనార్హం. ఓటు ఉంటేనే మాకు విలువ.! ఇక్కడ ఎవరికి వారే.. మాకు విలువ ఉండదు. ఇంకా ప్రభుత్వం నుండి వచ్చే పథకాలన్నీ ఊళ్ళోనే అందుతాయి. నగరంలో అందడం లేదు. అందుకే మా ఓటు ఊళ్ళోనే ఉండాలని కోరుకుంటున్నామని తేల్చిచెబుతున్నారు. ఈ నేపథ్యంలో నగర ఓట్లు దాదాపు 40 శాతం ఓట్లు ఊళ్ళకు తరలిపోయే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి.

**అంతా అయోమయం..**

ఇక్కడ ఓటు ఎప్పుడు ఉంటుందో..? ఎప్పుడు ఉండదో తెలియని అయోమయ పరిస్థితి ఉందని, ఓటర్ల జాబితాలో ఓ సారి తమ ఓటును తొలగించడం, మరోసారి ఓటు ఉండటం జరుగుతూ ఉందనీ పలువురు నగర ఓటర్లు వెల్లడిస్తున్నారు. తమ ఓటును తమ సొంతూళ్ళోనే ఉంటే ఎక్కడికీ పోదనీ, తీసేసే పరిస్థితి వచ్చినా.. ప్రక్కింటివారు, స్థానిక ప్రజాప్రతినిధులు అందుకు ఒప్పుకోరని, తొలగించే ప్రయత్నం జరిగితే ఎలా తీసేస్తారని నిలదీస్తారనీ, కానీ, ఇక్కడ మనకెందుకులే అని పట్టించుకోరని పలువురు ఓటర్లు అభిప్రాయపడుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వం నుండి ఏదేని బెనిఫిట్స్ వచ్చే అవకాశాలుంటే గ్రామపంచాయితీ వార్డు సభ్యులు లేదా మున్సిపాలిటీ కౌన్సిలర్లు తమతమ వార్డులోని వారికి ఇప్పించడం జరుగుతుందనీ, ఇక్కడ ఏ ప్రజాప్రతినిధి కూడా మీకు ఇది వస్తుంది.. ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోండనీ, మీరు ఈ ప్రభుత్వ సహాయానికి అర్హులు తదితర ప్రయోజనాలను తెలియజేయరనీ, అందుకే సొంతూళ్ళలోనే ఓటు ఉండాలని కోరుతున్నట్టు వివరిస్తున్నారు

## గణితం ద్వారా సులువైన పరి-

- **గీతం ఆతిథ్య ఉపన్యాసంలో వివరించిన ఐఐటీ బాంబే ఆచార్యుడు ప్రొఫెసర్ శివాజీ గణేష్**

**పటాన్చెరు (వుదయం):**

'ఒక ఆలోచన, మూడు సమస్యలు, ఒక పద్ధతి' అనే సూత్రం ద్వారా మనకు ఎదురయ్యే సవాళ్లకు గణిత శాస్త్రం ద్వారా పరిష్కారాలను చూపొచ్చని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) బొంబాయికి చెందిన ప్రొఫెసర్ శివాజీ గణేష్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం, హైదరాబాదులో 'పాక్షిక అవకలన సమీకరణాలు (పీడీఈఫ్ లు), వైవిధ్య విశ్లేషణ' అనే అంశంపై శుక్రవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత, గణాంక శాస్త్ర విభాగం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన వైవిధ్య విశ్లేషణ పునాదులను సదస్యులకు పరిచయం చేశారు. ఒక అంతరంలోని ప్రమేయాల నుంచి డైరిక్లెట్ సూత్రం వరకు గల ప్రయాణాన్ని వివరించారు. వైవిధ్యాల కలన శాస్త్రంలో ప్రత్యక్ష పద్ధతిని ఉపయోగించి కనిష్ఠీకరణల ఉనికిని వెల్లడించారు. ఒక సంవృత అంతరంలో అవిచ్ఛిన్న ప్రమేయం (R^n)లో రేఖీయ వ్యవస్థ, ప్రమేయ అంతరాళంలో ఒక సరిహద్దు విలువ సమస్య - అనే వేర్వేరుగా కనిపించే మూడు గణిత సమస్యలను, ఒక శక్తి ప్రమేయాన్ని కనిష్ఠీకరించే భావన ద్వారా ఎలా ఏకీకృతం చేయవచ్చో ప్రొఫెసర్ శివాజీ ప్రదర్శించారు. సమీకరణాలను నేరుగా పరిష్కరించడం ద్వారా కాకుండా, ప్రత్యక్ష పద్ధతిని (డైరెక్ట్ మెథడ్) ఉపయోగించడం ద్వారా పరిష్కారాల ఉనికిని స్థాపించవచ్చని ఆయన వివరించారు. ఈ ప్రత్యక్ష పద్ధతిలో, ఒక కనిష్ఠీకరణ క్రమాన్ని నిర్మించడం, ఒక అభిసరణ ఉపక్రమాన్ని సంగ్రహించడం, విరామం తీసుకోవడం వంటివి ఉంటాయన్నారు. గణిత, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జాదవ్ గణేష్, ప్రొఫెసర్ బి.ఎం. నాయుడు, డాక్టర్ శివారెడ్డి శేరిల సమక్షంలో స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ మోతెహర్ రెజా అతిథిని సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ కుమ్మరి సమన్వయం చేశారు.



## వనపర్తి జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ

**వనపర్తి, జూలై 10 (వుదయం ప్రతినిధి):**




ఎప్పటి నుంచో ఓటరు జాబితాలో పేరు ఉంది కదా అని ధీమాలో ఉండొద్దు ........ పూరించిన ఎన్యూమరేషన్ ఫారం జూలై 24 లోపు తిరిగి ఇవ్వకుంటే ఓటరు జాబితాలో పేరు తొలగించబడతాయి

బి.ఎల్.ఓ లు ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకొని యుద్ధప్రాతిపదికన డిజిటలైజేషన్ చేయాలి ఎస్.ఐ.ఆర్ పట్ల నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి శుక్రవారం తెలంగాణ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కొనసాగుతున్న ప్రక్రియ పై న్యూ ఢిల్లీ నుండి కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పాల్గొన్న కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ సెక్రెటరీ పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎస్.ఐ.ఆర్ గడువు జూలై 24 వరకు ఉందని, కానీ రాష్ట్రంలో ఇప్పటి వరకు 21.94 శాతం మాత్రమే డిజిటలైజేషన్ పూర్తి అయ్యిందని చెప్పారు. మిగిలిన 14 రోజులు యుద్ధప్రాతిపదికన కనీసం రోజుకు 6 శాతం పూర్తి చేయాల్సి ఉంటుందని కలెక్టర్లకు ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ వనపర్తి జిల్లాలో 22.01 శాతం మాత్రమే డిజిటలైజేషన్ పూర్తి అయ్యిందని, ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో చాలా నెమ్మదిగా డిజిటలైజేషన్ జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్ల నుంచి తీసుకున్న ఫారాలన్ డిజిటలైజేషన్ చేయడానికి ఈరోజు నుండి ఒక్కో బి.ఎల్.ఓ వెంట ముగ్గురు వాలంటీర్లను నియమిస్తున్నట్లు తెలియజేశారు. పంచాయతీ సెక్రటరీలు, వార్డు ఆఫీసర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు కంప్యూటర్ ఆపరేటర్లు అందరు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో పాల్గొని ఒక్కో బి.ఎల్.ఓ నుంచి రోజుకు కనీసం 100 ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేయాల్సి ఉంటుందని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.వీడియో కాన్ఫరెన్స్ లో కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారి నవీన్ కుమార్, రాష్ట్ర ఎలెక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి,జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, ఆర్డీఓ సుబ్రమణ్యం, సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నిర్మూలన దినోత్సవ అవగాహన ర్యాలీ

**నారాయణపేట, జూలై 10 (వుదయం ప్రతినిధి):**



జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం నారాయణపేట పట్టణంలో జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. కె. జయచంద్ర మోహన్ ప్రారంభించారు. ఈర్యాలీ ఆర్డీఓ కార్యాలయం నుండి పాత బస్టాండ్ సావర్కర్ చౌరస్తా వరకు కొనసాగింది.ఈ సందర్భంగా డా. కె. జయచంద్ర మోహన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ద్వారా 1 నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలు, యుక్తవయస్కులకు ఆల్బెండాజోల్ మాత్రలు అందించడం ద్వారా నులిపురుగుల సమస్యను నివారించవచ్చని తెలిపారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం, చదువులో ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశముందని చెప్పారు.జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు జూనియర్ కళాశాలలలో అర్హులైన ప్రతి చిన్నారికి ఆల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఏ కారణం చేతనైనా ఈరోజు మాత్రలు తీసుకోలేని పిల్లలకు ప్రభుత్వం నిర్ణయించిన మాప్అప్ దినం ఈ నెల 20 రోజు న మాత్రలు అందజేయనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయు లు,ప్రజలు ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించి అర్హులైన ప్రతి చిన్నారికి ఆల్బెండాజోల్ మాత్రలు వేయించేలా కృషి చేయాలని ఆయన కోరారు.ఈ అవగాహన ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, డాక్టర్ సిద్ధప్ప డిప్యూటీ డిఎంహెచ్వో, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సాయిరాం, డాక్టర్ లక్ష్మీ కాంత్, వైద్యాధికారి డాక్టర్ తిరుపతి, ఆఫీసు సిబ్బంది, సూపర్వైజర్స్, ఏ ఎం ఎం,ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## జూలై 24 నాటికి 'ఎన్యూమరేషన్ కావాలి!

- **భారత ఎన్నికల కమిషన్ సీనియర్ అధికారి డాక్టర్ పవన్ కుమార్ శర్మ ఆదేశం**
- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లతో ఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్**
- **నిర్లక్ష్యం వహిస్తే షోకాజ్ నోటీసులు తప్పవు: సిద్దిపేట కలెక్టర్ కె. హైమావతి హెచ్చరిక**




**సిద్దిపేట, జులై 10 (వుదయం బ్యూరో):**

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)2026 కార్యక్రమంలో భాగంగా ఈ నెల (జూలై) 24వ తేదీ నాటికి ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని భారత ఎన్నికల కమిషన్ సీనియర్ అధికారి డాక్టర్ పవన్ కుమార్ శర్మ** జిల్లా ఎన్నికల అధికారులను (కలెక్టర్లను) ఆదేశించారు.శుక్రవారం ఉదయం ఢిల్లీ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వివిధ జిల్లాల ఎన్నికల అధికారులతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్ఐఆర్ పురోగతిపై కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో డాక్టర్ పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుతం కేవలం 22 శాతం ఎన్యూమరేషన్ ఫారాలు మాత్రమే డిజిటలైజ్ అయ్యాయని, ఈ వేగాన్ని పెంచి జూలై 24 నాటికి ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇంకా పంపిణీ చేయాల్సిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే పంపిణీ చేయాలని, ఇందుకోసం అవసరమైన చోట వాలంటీర్ల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. పంపిణీ చేసిన ప్రతి ఫారాన్ని తిరిగి ఓటర్ల నుండి సేకరించి డిజిటలైజ్ చేయడం అధికారుల బాధ్యతని గుర్తుచేశారు. పనితీరు మందగించిన బీఎల్‌వోల పై ప్రత్యేక దృష్టి సారించి, వారి పనితీరును మెరుగుపర్చాలన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమానికి అన్నిటికంటే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, జిల్లా కలెక్టర్లు ప్రతిరోజు బీఎల్‌వోల ద్వారా పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. వెనుకబడిన సిబ్బందికి సూపర్‌వైజర్లు, వాలంటీర్ల ద్వారా అవసరమైన సహకారం అందించాలన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ శాతం తక్కువగా నమోదవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తదుపరి సమీక్ష నాటికి ప్రతి జిల్లా కనీసం 50 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని గడువు విధించారు. బీఎల్‌వోల వారీగా సమీక్షలు జరపాలని, ఎన్నికల నమోదు అధికారులు, సూపర్‌వైజర్లు నిరంతరం క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించే, కనీస ప్రగతి చూపని సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని, అలాంటి వారికి తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సిద్దిపేట ఆర్డీఓ సదానందం, ఎలక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, మరియు ఎన్నికల విభాగపు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమ విజయానికి రాజకీయ పార్టీల సహకారం తప్పనిసరి

- **ప్రతి వారం పార్టీల ప్రతినిధులతో సమీక్ష - జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్ జులై 10 (వుదయం బ్యూరో):**

జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకత, నిష్పాక్షికతతో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చేపడుతున్న ఈ కార్యక్రమ పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు ప్రతి వారం పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.పార్టీల సూచనలు, ఫిర్యాదులు స్వీకరణ సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు బీఎల్‌వోల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఎస్ఐఆర్ పనులపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఓటరు నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పులు, ఇంటింటి సర్వే, బీఎల్‌వోల పనితీరు తదితర అంశాలపై సూచనలు, అభ్యంతరాలు తెలిపారు. వాటిని కలెక్టర్ శ్రద్ధగా విని సంబంధిత అధికారులకు



తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ప్రతి ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, అర్హత కోల్పోయిన వారి పేర్ల తొలగింపు, అవసరమైన సవరణల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని వివరించారు. ఓటరు జాబితా తయారీలో రాజకీయ పార్టీల భాగస్వామ్యం కీలకమన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలు, ప్రజల సూచనలు, ఫిర్యాదులను పార్టీ ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలు ధృవీకరిస్తున్నారని, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల సవరణ, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్ల తొలగింపు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జరుగుతుందన్నారు. ఈ పనిలో నిర్లక్ష్యానికి తావులేదని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని, ఏవైనా మార్పులు, సవరణలు అవసరమైతే నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవికుమార్, బాలకృష్ణ, ఎండి హుస్సేన్, నరసింహ, రామకృష్ణ తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూ సేకరణ ప్రక్రియ నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా**

**మహబూబ్ నగర్, జూలై 10(వుదయం ప్రతినిధి):**

జిల్లాలో జాతీయ రహదారులు, నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా భూసేకరణ పురోగతిని పరిశీలించారు.కొన్ని ప్రాంతాల్లో భూసేకరణ పూర్తయి రహదారి నిర్మాణం ముగిసిందని, మరికొన్ని సెక్షన్లలో భూసేకరణ, పరిహారం చెల్లింపులు, మ్యూటేషన్ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు. భూత్పూర్ మండలంలోని కోడూరు-హస్నాపూర్ గ్రామాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనుల పై కూడా చర్చించారు.జడ్చర్లలో జాతీయ రహదారి పక్కనున్న ఇన్‌స్పెక్షన్ బంగ్లా భూములకు సంబంధించిన అంశాన్ని కూడా సమావేశంలో చర్చించారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి సంబంధించి పెండింగ్లో ఉన్న భూసేకరణ పనులపై కూడా సమీక్షించారు. భూసేకరణకు సంబంధించిన చట్టపరమైన ప్రక్రియలు పూర్తయిన వెంటనే అవార్డులు జారీ చేయాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి రెండు మూడు రోజులకు ఒకసారి పురోగతిని సమీక్షిస్తూ నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.రాజీవ్ భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణలో ఉన్న సమస్యలను వెంటనే పరిశరించి మిగిలిన భూసేకరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉదండపూర్ రిజర్వాయర్ కు సంబంధించి రైతులకు పరిహారం చెల్లింపులు, పెండింగ్ కేసుల పరిష్కారం, హైకోర్టులో ఉన్న కేసులపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.భూసర్వే



లను వేగవంతం చేసేందుకు అవసరమైతే అదనపు లైసెన్స్ సర్వేయర్లను వినియోగించాలని, రోజువారీ పురోగతిపై నివేదికలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఉదండాపూర్ పునరావాస పనులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణను కూడా సత్వరం పూర్తి చేసి, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. ఎల్.బి హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, అర. డి.ఓ నవీన్, భూ సర్వే రికార్డుల శాఖ ఎ. డి అశోక్,ఎన్ హెచ్ ఎ ఐ అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోడు భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● జూలై 13న భద్రాచలం ఐటీడీఏ ముట్టడి విజయవంతం చేయాలి: సీపీఎం



భద్రాచలం ,వుదయం :భద్రాచలం పట్టణంలోని స్థానిక సీపీఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో పోడు భూముల సమస్యలు, గిరిజనుల హక్కులు, ప్రభుత్వ వైఖరిపై సీపీఎం నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వరావు, మాజీ ఎంపీపీ మీడియం బాబురావు పాల్గొని మాట్లాడుతూ, పోడు రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఈ సందర్భంగా మచ్చ వెంకటేశ్వరావు మాట్లాడుతూ, గిరిజనులు తరతరాలుగా సాగు చేస్తున్న పోడు భూములకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో హక్కులు కల్పించకపోవడం దురదృష్టకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అటవీ హక్కుల చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమర్ధవంతంగా అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. అర్హులైన వేలాది మంది గిరిజన రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, అనేక ప్రాంతాల్లో సాగు చేస్తున్న భూములను అటవీ భూముల పేరుతో స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గిరిజనుల జీవనాధారం వ్యవసాయమేనని, పోడు భూములపై హక్కులు లేకపోవడంతో రైతులు ప్రతి సీజన్‌లో అభద్రతతో వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులు సాగు చేసిన పంటలను ధ్వంసం చేయడం, అటవీ శాఖ అధికారులు వేధింపులకు గురిచేయడం, కేసులు నమోదు చేయడం వంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి వ్యక్తిగత అటవీ హక్కు పత్రాలు, సామూహిక హక్కులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ బలవంతంగా ఖాళీ చేయించకూడదని స్పష్టం చేశారు. మాజీ ఎంపీపీ మీడియం బాబురావు మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అనేక మండలాల్లో పోడు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందించినా సమస్యల పరిష్కారంలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. గిరిజనుల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వమే వారిని ఇబ్బందులకు గురిచేయడం బాధాకరమని అన్నారు. పోడు భూముల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిశీలించి అర్హులందరికీ హక్కు పత్రాలు అందించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, సాగునీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ నేపథ్యంలో పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13వ తేదీన భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయాన్ని భారీ ఎత్తున ముట్టడించనున్నట్లు సీపీఎం నాయకులు ప్రకటించారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి గిరిజనులు, పోడు రైతులు, వ్యవసాయ కార్మికులు, రైతు సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా గిరిజనుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని, లేకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేసి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోరాటాలు నిర్వహిస్తామని సీపీఎం నాయకులు హెచ్చరించారు. ఈ పాత్రికేయుల సమావేశంలో సీపీఎం నాయకులు,

గిరిజన సంఘాల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రూల్స్ 'గాలి'కి.. బోర్డులకే పరిమితం!

- హెచ్‌పీ బంకు నిర్లక్ష్యం.. చందూరు ప్రజల ఆగ్రహం!
- పట్టించుకోని యాజమాన్యం.. పట్టణ ప్రజల ఆగ్రహం
- ఎల్లమ్మ గుడి సమీపంలోని బంకులో అధ్వాన్నపు స్థితి
- తాగునీరు లేదు.. మరుగుదొడ్లు అగమ్యగోచరం
- ఉచిత గాలి మిషన్ కేవలం 'బోర్డు'కే పరిమితం



చండూరు, జూలై 10 (వుదయం): ఆ బంకు యజమానికి కాసుల వేటలో ఉన్న శ్రద్ధ.. కస్టమర్ల కనీస అవసరాలపై లేకుండా పోయింది. లీటర్ల కొద్దీ ఇంధనం అమ్ముకుంటూ లాభాలు ఆర్జిస్తున్నారే తప్ప.. నిబంధనల ప్రకారం వాహనదారులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలను మాత్రం పూర్తిగా 'గాలి'కొదిలేశారు. చండూరు పట్టణంలోని స్థానిక ఎల్లమ్మ టెంపుల్ రోడ్డులో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకు యాజమాన్యం తీరుపై పట్టణ ప్రజలు, వాహనదారులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

**లీటరు పెట్రోల్ కొడతారు.. గుక్కెడు నీళ్లివ్వరు!**

నిబంధనల ప్రకారం ప్రతి పెట్రోల్ బంకులోనూ వచ్చే కస్టమర్ల కోసం స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం (వాటర్ కూలర్ లేదా ప్యూరిఫైర్) అందుబాటులో ఉంచాలి. కానీ, ఈ హెచ్‌పీ బంకులో కనీసం త్రాగునీటి జాడే లేదు. ఈ తీవ్రమైన ఎండల్లో సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణాలు చేస్తూ, ఇంధనం కోసం ఇక్కడికి వచ్చే వాహనదారులు గుక్కెడు మంచి నీళ్ల కోసం అల్లాడిపోతున్నారు. పక్కనే ఉన్న కిరాణా షాపులకో, హోటళ్లకో వెళ్లి నీళ్లు కొనుక్కోవాల్సిన పరిస్థితి దాపురించిందని వాహనదారులు వాపోతున్నారు.

**నరకప్రాయంగా మరుగుదొడ్లు.. మహిళల అవస్థలు**

ఇక బంకు ఆవరణలో ఉన్న మరుగుదొడ్ల పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. నిర్వహణను పూర్తిగా గాలికొదిలేయడంతో అవి పాడుపడి, దుర్వాసనతో కంపు కొడుతున్నాయి. లోపలికి వెళ్లే పరిస్థితి కూడా లేకపోవడంతో ముఖ్యంగా మహిళా ప్రయాణికులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మరుగుదొడ్లను వాడుకుందామన్నా తాళాలు వేసి ఉంచడం లేదా నీటి సౌకర్యం లేకుండా ఉంచడం ఇక్కడి యాజమాన్యానికి అలవాటుగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**'ఎయిర్ గెలిమిషన్' కేవలం ప్రదర్శనకే!**

ఉచితంగా వాహనాలకు గాలి నింపే 'ఎయిర్ గెలిమిషన్' (కంప్రెషర్) ఇక్కడ ఎప్పుడూ పనిచేయదు. కేవలం బోర్డు మాత్రమే దర్శనమిస్తుంది తప్ప, అడిగితే 'మిషన్ రిపేర్ ఉంది' అంటూ సిబ్బంది నిర్లక్ష్యపు సమాధానాలు చెబుతున్నారని వాహనదారులు చెప్తున్నారు. అత్యవసరంగా గాలి కొట్టించుకోవాలన్నా వేరే చోటుకు పరుగులు తీయాల్సి వస్తోందని మండిపడుతున్నారు.

**అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు!**

"పెట్రోల్, డీజిల్ రేట్లు ఆకాశాన్ని తాకుతున్నా, కస్టమర్లకు ఇచ్చే సర్వీస్ మాత్రం సున్నా. ఉచిత గాలి, నీరు, టాయిలెట్లు అనేవి మా హక్కు. కానీ ఇక్కడ అవేవీ లేవు. ఎల్పీజీ నైపుణ్యాలు, కస్టమర్ కేర్ రూల్స్ ఏవీ ఈ బంకులో అమలు కావడం లేదు. అధికారులు వెంటనే తనిఖీలు చేసి ఈ బంకుపై చర్యలు తీసుకోవాలి."

**రాజు స్థానిక వాహనదారుడు, చండూరు.**

**నిబంధనలు ఏం చెప్తున్నాయి?**

నిజానికి ఆయిల్ కంపెనీల నిబంధనల ప్రకారం.. పెట్రోల్ బంకు లైసెన్స్ పొందిన ప్రతి ఒక్కరూ ఉచితంగా గాలి, తాగునీరు, శుభ్రమైన మరుగుదొడ్ల వసతి కల్పించాలి. ఒకవేళ ఇవి లేకపోతే కస్టమర్లు ఫిర్యాదు చేస్తే బంకు లైసెన్స్ రద్దయ్యే అవకాశం కూడా ఉంది. కానీ ఇవేవీ ఇక్కడి హెచ్‌పీ బంకు నిర్వాహకులకు పట్టినట్లు లేదు. లాభాల మీదున్న ధ్యాస కస్టమర్ల సౌకర్యాలపై లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా పౌరసరఫరాల శాఖ అధికారులు, సదరు ఆయిల్ కంపెనీ ఉన్నతాధికారులు స్పందించి, చండూరులోని ఈ హెచ్‌పీ పెట్రోల్ బంకుపై తనిఖీలు నిర్వహించాలని, తక్షణమే అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# దశాబ్దం గడిచినా రైలు లేదు సూర్యాపేట ప్రజల ఆగ్రహం

- సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించేదాకా పోరాటం ఆగదు
- మొదట ప్రతిపాదించిన మార్గాన్నే అమలు చేయాలి – రైల్వే సాధన సమితి



సూర్యాపేట ,వుదయం :సూర్యాపేట జిల్లాకు రైల్వే లైన్ విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సరిదిద్దాలని సూర్యాపేట రైల్వే సాధన సమితి డిమాండ్ చేసింది. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి కన్వీనర్ దేగల జనార్ధన్, కో–కన్వీనర్ రాచురి ప్రతాప్, గౌరవ అధ్యక్షులు డాక్టర్ రంగా రెడ్డి, గౌరవ సలహాదారు లింగంపల్లి భద్రయ్య మాట్లాడారు.

**ప్రజల ఆశలను దెబ్బతీశారు**

ఒకప్పుడు ప్రతిపాదించిన హైదరాబాద్––సూర్యాపేట––ఖమ్మం రైల్వే మార్గం, సూర్యాపేట––కర్నూలు లైన్ అమలైతే సూర్యాపేట దక్షిణ తెలంగాణలో కీలక రైల్వే జంక్షన్‌గా ఎదుగుతుందని ప్రజలు ఆశించారని గుర్తు చేశారు. కానీ అనంతరం ఖమ్మం మార్గాన్ని మార్చి దాచేపల్లి వైపు మళ్లించడం ద్వారా సూర్యాపేట ప్రజల ఆశలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు.

**సూర్యాపేట ప్రాధాన్యం**

సూర్యాపేట చారిత్రక, భౌగోళిక, వాణిజ్య పరంగా అత్యంత ప్రాధాన్యం కలిగిన పట్టణమని వారు పేర్కొన్నారు. ప్రతిరోజూ దాదాపు పది మండలాల ప్రజలు విద్య, వైద్యం, వ్యాపారం కోసం ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే ప్రముఖ వాణిజ్య కేంద్రంగా ఎదిగిన ఈ జిల్లాలో అనేక జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలు వ్యాపార కేంద్రాలు ఏర్పాటు చేశాయని, ఇది సూర్యాపేట ఆర్థిక సామర్థ్యానికి నిదర్శనమన్నారు. సూర్యాపేట నుండి ఖమ్మం 55 కి.మీ, వరంగల్ 125 కి.మీ, హైదరాబాద్, విజయవాడ దాదాపు సమాన దూరంలో ఉన్నాయని, ఇంతటి వ్యూహాత్మక ప్రాంతానికి రైల్వే సౌకర్యం లేకపోవడం అభివృద్ధికి తీవ్ర ఆటంకమని విమర్శించారు.

**ప్రభుత్వాల నిర్లక్ష్యం**

ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపు అన్ని జిల్లాలకు రైల్వే అనుసంధానం ఉండగా, తెలంగాణలోని సూర్యాపేట జిల్లాకు ఇప్పటికీ ఒక్క రైల్వే లైన్ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దానికి పైగా గడిచినా రైల్వే సౌకర్యం కల్పించకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రైల్వే వల్ల లాభాలు**

రైల్వే లైన్ ఏర్పడితే విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, సామాన్య ప్రయాణికులు భారీగా లబ్ధి పొందుతారని తెలిపారు. వ్యాపారులకు సరుకుల రవాణా సులభమవుతుందని, హైదరాబాద్, విజయవాడకు తక్కువ ఖర్చుతో ప్రయాణించే అవకాశం లభిస్తుందని వివరించారు.

**డిమాండ్లు:**

ప్రస్తుత ప్రతిపాదనను పునఃసమీక్షించి, మొదట ప్రకటించిన హైదరాబాద్––సూర్యాపేట––ఖమ్మం రైల్వే లైన్‌ను యథాతథంగా అమలు చేయాలిసూర్యాపేట ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఇకపై సహించబోము

**ఉద్యమ ప్రకటన**

సూర్యాపేట రైల్వే లైన్ సాధన కోసం విశాల ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని పిలుపునిచ్చారు. ఈ ఉద్యమానికి రాజకీయ రంగులు పులమకుండా పౌర సమాజం ముందుండి నాయకత్వం వహించాలని కోరారు. రాబోయే రోజుల్లో సంతకాల సేకరణ, వినతిపత్రాల సమర్పణ, ప్రజా సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రజాప్రతినిధుల ముట్టడి వంటి ప్రజాస్వామ్య పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు.

ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా ప్రజలు, వ్యాపార వర్గాలు, పారిశ్రామికవేత్తలు, మేధావులు, యువత, ఉద్యోగులు, ప్రవాసులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ముద్ద చర్మ వ్యాధి నివారణకు టీకాలే ఏకైక మార్గం: డా. పి. పెంటయ్య



కోదాడ, జూలై 10(వుదయం): గోవుల్లో సోకే అత్యంత ప్రమాదకర అంటువ్యాధి అయిన ముద్ద చర్మ వ్యాధి (రాబఎజూఎ వానెఅఅ ణఅంమ్ఘంవ) నివారణకు టీకాలే సమర్థవంతమైన మార్గమని అసిస్టెంట్ డైరెక్టర్ డా. పి. పెంటయ్య తెలిపారు. కోదాడ పట్టణంలోని వెలిశాల బ్రహ్మయ్యగారి వీధిలో తెల్లజాతి పశువులకు నిర్వహిస్తున్న ముద్ద చర్మ వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోదాడలో ప్రతి సంవత్సరం టీకాల కార్యక్రమం చేపడుతున్నప్పటికీ, పట్టణంలో అతిపెద్ద పశువుల సంత ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి గిత్తలు, కోడెలు తరచూ కొనుగోలు చేసి తీసుకువస్తున్నారని తెలిపారు. వాటిలో వ్యాధి సోకిన పశువులు తెలియక కొనుగోలు చేసే అవకాశం ఉండటంతో, టీకా వేసిన తర్వాత పుట్టిన దూడలకు కూడా వ్యాధి సోకే ప్రమాదం ఉంటుందన్నారు. పట్టణంలోని సుమారు 400 తెల్లజాతి పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని, దీంతో పశువులను వ్యాధి బారిన పడకుండా రక్షించవచ్చని పేర్కొన్నారు. సంతలు లేదా ఇతర గ్రామాల నుంచి కొత్తగా పశువులు కొనుగోలు చేసే రైతులు వాటికి ఇప్పటికే టీకాలు వేశారో లేదో తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు. టీకా వేయించకపోతే, కొనుగోలు చేసిన వెంటనే మందలో కలపకుండా 14 రోజుల పాటు వేరుగా ఉంచి, ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించకపోతే టీకా వేయించి తర్వాతే మందలో కలపాలని సూచించారు. ఈ సూచనలు పాటిస్తే కోదాడను ముద్ద చర్మ వ్యాధి రహిత పట్టణంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా. సిరిపురపు సురేంద్ర, సిబ్బంది బడేటి శివ, కంపాటి చంద్రకళ, సాగర్ పాల్గొన్నారు.

# గట్టుప్పల్‌లో 'విద్య సంస్థలు' బంద్

- ♦ మండల కేంద్రంలో స్తంభించిన విద్యాసంస్థలు
- ♦ ప్రభుత్వ పాఠశాలల సమస్యలపై ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సమరభేరి
- ♦ ఎంఈవోకు వినతిపత్రం సమర్పణ





చండూరు – గట్టుప్పల్, జూలై 10 (వుదయం):మండల కేంద్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి, యువజన సంఘాలు సమరభేరి మోగించాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, పాఠశాలల విలీన ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గట్టుప్పల్‌లో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. బంద్‌కు స్థానికుల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. గట్టుప్పల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండటంపై నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శిథిలావస్థకు చేరిన భవనాల్లో విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని చదువుకోవాల్సి వస్తోందని మండిపడ్డారు. విద్యార్థులతో కలిసి పాఠశాల ప్రాంగణంలోనే ధర్నా నిర్వహించిన అనంతరం, ఎంఈవో అమృతదేవికి వినతిపత్రం అందజేశారు. యుద్ధప్రాతిపదికన నిధులు మంజూరు చేసి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు కర్నాటి సుధాకర్, మండల అధ్యక్షుడు పసుపుల ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు మాలిగా శివ, నాయకులు శ్రీశైలంతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.



# విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యాసంస్థల బంద్ విజయవంతం ఏఐఎస్ఎఫ్

మునగాల, జూలై 10 ( వుదయం):విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతంగా ముగిసిందని ఆ సంఘం నాయకులు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, విద్యాశాఖలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేసి, తల్లిదండ్రులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు.

విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంతో పాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసమే రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చామని, విద్యార్థులు, ప్రజాసంఘాలు, విద్యావేత్తలు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

# జస్ట్ బ్రేక్ ప్రారంభించిన డిప్యూటీ మేయర్ ఆశ్రఫ్ అలీ



నల్గొండ టౌన్ వుదయం :నల్గొండ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డు ఎస్ ఆర్ గార్డెన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన జస్ట్ బ్రేక్ సెంటర్ ను గురువారం నగరపాలక సంస్థ మేయర్ మమ్మద్ అష్రఫ్ అలీ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి గుమ్మలమోహన్ రెడ్డి, కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ నల్లగొండ నగరపాలక సంస్థ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో అభివృద్ధి చెందుతుందని అందులో భాగంగా నగరంలో వ్యాపార సంస్థలు నెలకొల్పుతున్నారని తెలిపారు. యువత వ్యాపార రంగాలలో రాణించాలని కోరారు. పట్టణ ప్రజలకు ఇలాంటి సెంటర్లు చాలా ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు ఇర్ఫాన్ మమ్మద్,సమ్మద్,ఇబ్రహీం, మహబూబ్ అలీ, హనుబాయ్, ప్రొప్రైటర్ ఎండి జాఫర్ ఖాన్, ఎండి షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

## అధిక వృద్ధిరేటు, సంస్కరణలే కీలకం

అధిక వృద్ధిరేటును స్థిరంగా సాధించడం, సంస్కరణలు నిరంతరం కొనసాగిస్తేనే 2047 కల్లా అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించే వీలుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) తెలిపింది. అధిక వృద్ధిరేటు కలిగిన పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని, ప్రపంచ వృద్ధికి చుక్కానిలా మారిందనీ వివరించింది. 2026లో 6.4%, 2027లో 6.7% వృద్ధిరేటును భారత్ సాధిస్తుందని అంచనా వేసినట్లు గుర్తు చేసింది. నూతన కార్మిక చట్టం, వివిధ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడం వంటివి భారత్‌కు ఉపకరిస్తాయని పేర్కొంది. నైపుణ్యాల వృద్ధి, వ్యాపారాల నిర్వహణకు వ్యయాలు తగ్గించడం వంటివి మరింతగా చేపట్టాలని సూచించింది.




# ఎలక్ట్రానిక్స్ తయారీలో వాడే కీలక విడిభాగాలపై కస్టమ్స్ సుంకం రద్దు

దేశీయంగా స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, వేరబుల్స్, స్మార్ట్‌టీవీలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ (అసెంబ్లింగ్)ని ప్రోత్సహించే లక్ష్యంతో.. డిస్‌ప్లే అసెంబ్లీస్, లిథియం అయాన్ సెల్, ఇండక్టర్ కాయిల్ మాడ్యుల్ తయారీలో ఉపయోగించే వస్తువులపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. వీటిపై సుంకం మినహాయింపును అమల్లోకి తెస్తూ ఆర్థిక శాఖ మూడు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసింది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కింద దేశీయంగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల దిగుమతులపై ఆధారపడటం తగ్గడమే కాక, దేశీయంగా ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం బలోపేతం అవుతుంది. నూతన ఉద్యోగాలు లభిస్తాయి. డిస్‌ప్లే అసెంబ్లీస్, ఇండక్టర్ కాయిల్ మాడ్యూల్‌లో వాడే విడిభాగాలపై సుంకం



మినహాయింపులు 2029 మార్చి 31 వరకు చెల్లుబాటులో ఉంటాయని ప్రభుత్వం వెల్లడించింది. మొబైల్ ఫోన్‌లు, విద్యుత్తు వాహనాల (ఈవీ)లో వాడే లిథియం–అయాన్ సెల్‌ల తయారీకి ఉపయోగించే యంత్రాలకు ఉన్న వేర్వేరు కస్టమ్స్ సుంకాలను ఏకీకృతం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల దేశీయంగా లిథియం– అయాన్ సెల్ తయారీలోకి కొత్త పెట్టుబడులు వస్తాయని ఏఎంఆర్‌జీ గ్లోబల్ మేనేజింగ్ పార్ట్‌నర్ రజత్ మోహన్ తెలిపారు. 'బ్యాటరీ గిగా ఫ్యాక్టరీలు, ఈవీ తయారీదార్లు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ తయారీదార్లు, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, టెలికాం మౌలిక సదుపాయాల సంస్థలు, డేటా కేంద్రాలు, వైద్య పరికరాల తయారీదార్లు, డ్రోన్ల తయారీదార్లు, పారిశ్రామిక ఆటోమేషన్ రంగాలు ప్రభుత్వ తాజా నిర్ణయం వల్ల అధికంగా లబ్ధి పొందుతాయి. వీరందరూ లిథియం–అయాన్ సెల్‌లపై ఎక్కువగా ఆధారపడుతున్నార'ని మోహన్ తెలిపారు.

# విపణిలోకి నిస్సాన్ టెక్టాన్

దేశీయ విపణిలోకి సరికొత్త ఎస్‌యూవీ టెక్టాన్‌ను నిస్సాన్ విడుదల చేసింది. మొత్తం ఆరు వేరియంట్లు– విసియా, విసియా ప్లస్, ఏసెంటా, ఎన్–కనెక్టా, టెక్నా, టెక్నా ప్లస్‌లలో ఈ కారు లభిస్తుంది. వీటి ధరల శ్రేణి రూ.10.49 లక్షలు– 18.59 లక్షలు (ఎక్స్‌షోరూం). ఈ ఎస్‌యూవీ 1.0 లీటరు– 3 సిలిండర్, 1.3 లీటర్– 4 సిలిండర్ టర్బో పెట్రోలు ఆప్షన్లలో లభ్యం కానుంది. తమిళనాడులోని రెనో ప్లాంటులో, డస్టర్ తయారైన ప్లాట్‌ఫామ్‌పైనే టెక్టాన్‌ను కూడా రూపొందిస్తున్నారు. బుకింగ్‌లు మొదలు: రూ.21,000 చెల్లించి టెక్టాన్‌ను బుక్ చేసుకోవచ్చని, ఈనెల 20 నుంచి డెలివరీలు ప్రారంభం అవుతాయని కంపెనీ తెలిపింది. ప్రత్యేకతలు: 10.1 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటెయిన్‌మెంట్ సిస్టమ్, 10.25 అంగుళాల డిజిటల్ డ్రైవర్స్ డిస్‌ప్లే, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో– యాపిల్ కార్‌ప్లే, పనోరమిక్ సన్‌రూఫ్, వైర్‌లెస్ ఫోన్ ఛార్జర్, పవర్డ్ టెయిల్ గేట్, ఆరు విధాల అడ్జస్టబుల్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, భద్రతా ఫీచర్లు: 6 ఎయిర్‌బ్యాగ్‌లు, లెవల్ 2 అడాస్, 360 డిగ్రీ కెమేరా,



ఫ్రంట్, రేర్ పార్కింగ్ సెన్సార్‌లు, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్. ఈ ఎస్‌యూవీకి 5 స్టార్ బీఎన్‌క్యాప్ భద్రతా రేటింగ్ ఉంది. వీటితో పోటీ: రెనో డస్టర్, హ్యుందాయ్ క్రెటా, కియా సెల్టోస్, మారుతీ సుజుకీ విక్టోరిస్, ఫోక్స్‌వ్యాగన్ టైగున్‌లతో ఈ కారు పోటీ పడనుంది.

# అమెరికా కోర్టులో ప్రమాణ పత్రం సమర్పించనున్న గౌతమ్ అదానీ!



తనపై ఉన్న క్రిమినల్ అభియోగాన్ని కొట్టివేయాలన్న అమెరికా ప్రభుత్వ నిర్ణయం వ్యవహారంలో ఒక అఫిడవిట్ (ప్రమాణ పత్రం)ను అమెరికా కోర్టులో అదానీ గ్రూపు ఛైర్మన్ గౌతమ్ అదానీ ఈవారం సమర్పించనున్నట్లు తెలుస్తోంది. అమెరికా ప్రభుత్వ నిర్ణయానికి సంబంధించి తనకు ఏదైనా వాగ్దానం, ఒప్పందం లేదా లబ్ధి పొందడం గురించి ఏమైనా తెలుసా అనే విషయాన్ని ఇందులో ఆయన పేర్కొంటారు. అభియోగపత్రాన్ని శాశ్వతంగా కొట్టివేయాలన్న న్యాయశాఖ అభ్యర్థనపై తీర్పు ఇచ్చే ముందే (ఈనెల 15లోగా) ప్రమాణ పత్రాన్ని దాఖలు చేయాలని అమెరికా కోర్టు న్యాయమూర్తి ఆదేశించారు. అభియోగాలను కొట్టివేయాలంటే.. బదులుగా ఏదేని ఇచ్చేందుకు వాగ్దానం, ప్రతిపాదన, ఒప్పందం లేదా ప్రయోజనం చేకూర్చడం లాంటివి ఏమైనా జరిగాయా అనే విషయం తనకు తెలుసా అని అందులో పేర్కొనాలని అదానీకి న్యాయమూర్తి తెలిపారు. ఈవారంలో అదానీ అఫిడవిట్ సమర్పించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

## ఆల్కహాల్ కలిసిన మందులకూ చీటీ తప్పనిసరి

ఆల్కహాల్ కలిగిన ఔషధాల విక్రయానికి సంబంధించిన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం కఠినతరం చేసింది. 12 శాతం కంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగిన ఔషధాలను లైసెన్స్ లేకుండా విక్రయించడానికి వీల్లేదని స్పష్టంచేసింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఈ మందులను విక్రయించాలని పేర్కొంది. 12 శాతం కంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగి 30 మిల్లీలీటర్ల కంటే పెద్ద సీసాల్లో విక్రయించే సిరప్‌లు/టానిక్‌లను



షెడ్యూల్ H1 పరిధిలోకి తీసుకొస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కొన్ని రకాల దగ్గు సిరప్‌లు, టానిక్‌లలో ఆల్కహాల్ శాతం ఎక్కువగా ఉంటోంది. దీంతో వాటిని చికిత్స కోసం కాకుండా మత్తు కోసం దుర్వినియోగం చేస్తున్నారంటూ పలు రాష్ట్రాల నుంచి ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (DTAB), డ్రగ్స్ కన్సల్టేటివ్ కమిటీ (DCC) సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. దీనివల్ల అవసరమైన రోగులకు ఈ ఔషధాలు ఎప్పటిలాగే అందుబాటులో ఉంటాయి.

# ఈక్విటీ, గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి పెరిగిన పెట్టుబడులు



ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ స్కీముల్లోకి జూన్ నెలలో నిధుల ప్రవాహం పెరిగింది. మార్కెట్ ఒడుదొడుకులు ఉన్నా రూ.28,973 కోట్ల నికర పెట్టుబడులు నమోదయ్యాయి. అంతకుముందు నెలతో పోలిస్తే 26 శాతం మేర పెట్టుబడులు పెరిగాయి. ఈ మేరకు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) సంబంధిత గణాంకాలను శుక్రవారం విడుదల చేసింది. మొత్తం మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నుంచి జూన్ నెలలో నికరంగా రూ.52,949 కోట్ల నిధులు తరలిపోయాయి. మే నెలలో ఈ మొత్తం రూ.64,131 కోట్లతో పోల్చినప్పుడు ఇది ఊరట కల్పించే అంశం. ముఖ్యంగా డెట్ స్కీమ్‌ల నుంచి రూ.1.09 లక్షల కోట్ల మేర ఉపసంహరణలు నమోదు కావడం ఇందుకు కారణం. మ్యూచువల్ ఫండ్ సంస్థల నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (AUM) రూ.81.6 లక్షల కోట్ల నుంచి జూన్ చివరి నాటికి రూ.82.22 లక్షల కోట్లకు పెరిగింది. ఈ ఏడాది ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ట్రెండ్‌ను గమనించినట్లయితే.. మే నెలలో రూ.22,908 కోట్ల మేర పెట్టుబడులు రాగా.. జూన్‌లో రూ.28,973 కోట్లకు పెరిగాయి. ఏప్రిల్‌లో రూ.38,440 కోట్లు, మార్చిలో రూ.40,450 కోట్లు, ఫిబ్రవరిలో రూ.25,978 కోట్లు, జనవరిలో రూ.24,028 కోట్ల పెట్టుబడులు నమోదయ్యాయి.

మిడ్‌క్యాప్‌లోకి అత్యధికంగా: ఈక్విటీ కేటగిరీలో మిడ్‌క్యాప్ ఫండ్స్ రూ.6,090 కోట్లతో అత్యధిక పెట్టుబడులను సాధించినట్లు యాంఫీ తెలిపింది. స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.5,602 కోట్లు, ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.5,231 కోట్లు, లార్జ్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.2,067 కోట్లు చొప్పున పెట్టుబడులు వచ్చాయి.

డివిడెండ్ ఈల్డ్ ఫండ్స్, ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్‌ల్లో (ELSS) జూన్‌లో పెట్టుబడుల ఉపసంహరణ కనిపించింది. అలాగే గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ETFs)లో మేలో రూ.725 కోట్లు తరలిపోగా.. జూన్ నెలలో రూ.3,443 కోట్ల మేర నికరంగా పెట్టుబడులు వచ్చాయి.






## ఎంబాపె మరో గోల్.. సెమీఫైనల్స్ దూసుకెళ్లిన ఫ్రాన్స్

ఫిఫా ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్స్‌లో మొరాకోను ఫ్రాన్స్ 2–0 తేడాతో ఓడించింది. ఫ్రాన్స్ స్టార్ ప్లేయర్ కిలియన్ ఎంబాపె ఈ మ్యాచ్‌లోనూ ఓ గోల్ చేశాడు. డెంబెలె మరో గోల్ కొట్టాడు. ఖతార్‌లో జరిగిన 2022 టోర్నమెంట్ సెమీఫైనల్స్‌లోనూ ఫ్రాన్స్ ఇదే స్కోరుతో మొరాకోను ఓడించింది. మంగళవారం డాలస్‌లో జరిగే సెమీఫైనల్స్‌లో స్పెయిన్ లేదా బెల్జియంతో ఫ్రాన్స్ తలపడనుంది. మొరాకోపై సాధించిన గోల్‌తో ఈ ప్రపంచకప్‌లో ఇప్పటివరకు అత్యధిక గోల్స్ చేసిన అర్జెంటీనా దిగ్గజం మెస్సి (8) సరసన ఎంబాపె నిలిచాడు. 60వ నిమిషంలో ఎంబాపె చేసిన ఈ గోల్.. అతడి ప్రపంచ కప్ కెరీర్‌లో 20వది. మెస్సి ఖాతాలో 21 గోల్స్ ఉన్నాయి.

# చరిత్రలో నిలిచిపోనున్న డిసెంబర్ 12..




ఆస్ట్రేలియాలో అతిపెద్ద టీ20 టోర్నీ బిగ్‌బాష్ లీగ్. దేశ, విదేశీ క్రికెటర్లు ఆడే ఈ లీగ్.. 2011లో మొదలైంది. బీబీఎల్ చరిత్రలో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఆస్ట్రేలియా బయట మ్యాచ్‌లు జరగలేదు. తొలిసారి బీబీఎల్ 2026–27 సీజన్ మొదటి మ్యాచ్‌కు చెన్నై ఆతిథ్యం ఇవ్వనుండటం విశేషం. డిసెంబర్ 12న పెర్త్ స్కార్చర్స్ – మెల్‌బోర్న్ రెనెగేడ్స్ జట్ల మధ్య ఆరంభ మ్యాచ్ జరగనుంది. ఈ మేరకు ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ అధికారికంగా ప్రకటించారు. ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్‌తో కలిసి మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌ను మోదీ సందర్శించారు. ఇండియా–ఆస్ట్రేలియా మధ్య క్రీడల్లో సహకారం కోసం ఎంసీజీ మైదానంలో రోడ్‌మ్యాప్‌ను విడుదల చేశారు. టీ20 ప్రపంచ కప్‌ను నెగ్గిన ఆసీస్ మహిళా జట్టుకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. "బిగ్‌బాష్ లీగ్ మ్యాచ్‌ను చెన్నైలో నిర్వహించేందుకు సాదరంగా ఆహ్వానిస్తున్నా. భారత్ వేదికగా ఎలాంటి లీగ్ అయినా సరే అభిమానులకు బాగా చేరువవుతుంది. వ్యూయర్‌షిప్ కూడా అద్భుతంగా ఉంటుందని కచ్చితంగా చెప్పగలను" అని మోదీ వెల్లడించారు. క్రీడల్లోనే కాకుండా భారత్ – ఆస్ట్రేలియా భాగస్వామ్యం ఇతర విభాగాల్లోనూ ఛాంపియన్‌గా నిలుస్తుందన్న నమ్మకం తనకుందన్నారు. 2030 కామన్వెల్త్ గేమ్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుందని.. అలాగే 2036లో ఒలింపిక్స్‌ను నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. బ్రిస్బేన్ వేదికగా 2032 ఒలింపిక్స్ జరగనున్నాయి. ఇలాంటి భారీ ఈవెంట్లను నిర్వహించడం వల్ల క్రీడల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు అవకాశం ఉందని తెలిపారు. "మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో (MCG) అడుగు పెట్టే ఏ భారతీయుడికైనా మదిలో రెండు రకాల భావోద్వేగాలు కలుగుతాయి. భారత్ – ఆస్ట్రేలియా జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్‌లో ఉండే ఉత్కంఠ. ఇక రెండోది.. ఇరు దేశాల్లో క్రికెట్ అంటే కేవలం క్రీడ మాత్రమే కాదు.. ప్యాషన్ అని గ్రహించాలి. ఇవాళ మాత్రం ఎలాంటి చివరి ఓవర్ ఫినిషింగ్ ఒత్తిడి లేదు. క్రీడను ఆస్వాదించడం, స్నేహాన్ని గుర్తు చేసుకోవడం, భవిష్యత్తు ఛాంపియన్లలో ఎనర్జీ అందించడం చేద్దాం. దిగ్గజ క్రికెటర్లు స్టీవ్ వా, లిసా స్థాలేకర్ వంటి వారితో కలిసి పనిచేయబోతున్నాం. భారత్ – ఆస్ట్రేలియా బంధానికి క్రీడలు బలమైన పునాది. ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్‌తో కలిసి ఇరు దేశాల స్పోర్ట్స్ రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించడం సంతోషంగా ఉంది" అని మోదీ తెలిపారు.

## ఇంగ్లాండ్‌తో లార్డ్స్‌లో మహిళల తొలి టెస్టు..

మహిళల క్రికెట్‌లో ఎక్కువగా టెస్టు మ్యాచులు జరగడం లేదు. అప్పుడప్పుడు మాత్రమే పెద్ద టీమ్‌ల మధ్య నిర్వహించేందుకు ఐసీసీ ఆసక్తి చూపిస్తోంది. అయితే, క్రికెట్‌కు పుట్టినిల్లు లార్డ్స్ మైదానంలో 142 ఏళ్లుగా మహిళలకు ఒక్క టెస్టూ జరగలేదు. కానీ, ఆ చరిత్రను తిరగరాసేలా లార్డ్స్ వేదికగా మ్యాచ్ ప్రారంభమైంది. అదీనూ ఆతిథ్య ఇంగ్లాండ్‌తో టీమ్‌ఇండియాకు ఆదే అవకాశం వచ్చింది. ఈ క్రమంలో టాస్ నెగ్గిన ఇంగ్లాండ్ బౌలింగ్ ఎంచుకుంది. మహిళల టెస్టు నాలుగు రోజులు మాత్రమే జరుగుతుంది. ఇంగ్లాండ్ – భారత జట్ల మధ్య టెస్టులో ముగ్గురు ప్లేయర్లు అరంగేట్రం చేస్తున్నారు. టీమ్‌ఇండియా తరఫున తెలుగు అమ్మాయి శ్రీచరణి డెబ్యూ చేయగా.. ఇంగ్లాండ్ తరఫున ఎలిస్ క్యాప్సీ, మ్యాడీ అరంగేట్రం చేశారు. అదే విధంగా ఇంగ్లిష్ జట్టు సారథి నాట్ సీవర్ తొలిసారి నాయకత్వం చేపట్టింది. ఈ మ్యాచ్ తర్వాత ఇంగ్లాండ్ సీనియర్ ఓపెనర్ టామీ బీమౌంట్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ కానుంది.

భారత్: స్మృతి మంధాన, షెఫాలి వర్మ, యస్తికా భాటియా, హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), దీప్తి శర్మ, స్నేహ్ రాణా, సయాలి సత్ఘరె, శ్రీచరణి, క్రాంతి గౌడ్. ఇంగ్లాండ్: బీమౌంట్, మయా బౌచియర్, నాట్ సీవర్ (కెప్టెన్), హెదర్ నైట్, క్యాప్సీ, అమీ జోన్స్ (వికెట్ కీపర్), మ్యాడీ, ఇసీ వాంగ్, సోఫీ ఎకిల్‌స్టోన్, లారెన్ ఫిలర్, లారెన్ బెల్.



## ఇంగ్లాండ్ చేతిలో ఘోర ఓటమి..



తొలిసారి ఇంగ్లాండ్ చేతిలో టీ20 సిరీస్‌ను టీమ్‌ఇండియా చేజార్చుకుంది. అదే సమయంలో వరుసగా రెండు సిరీస్‌లు (ఐర్లాండ్, ఇంగ్లాండ్)లనూ కోల్పోయింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తోపాటు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. అయితే, ఈ సిరీస్ ఓటములకు కేవలం సారథిని మాత్రమే బాధ్యుడిని చేయడం తగదనే అభిప్రాయం పలువురిలో ఉంది. ఈ క్రమంలో బీసీసీఐ (BCCI BIG Decision) కీలక నిర్ణయం తీసుకుంటున్నట్లు వార్తలు వచ్చాయి. ప్రతి ప్లేయర్, ప్రతి కోచ్ పనితీరుపైనా సమీక్షించాలని భావిస్తోందని సమాచారం. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పదవీ కాలం వచ్చే ఏడాది ప్రపంచ కప్ వరకూ ఉంది. అయితే, ఇప్పుడీ సిరీస్‌ల్లో వైఫల్యం నేపథ్యంలో గంభీర్ పదవిపైనా ఎఫెక్ట్ పడే అవకాశం లేకపోలేదు. కొత్త కోచ్ వేటలోనూ బోర్డు ఉన్నట్లు వార్తలు వచ్చినా.. బీసీసీఐ మాత్రం ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. గత టీ20 ప్రపంచ కప్‌ను టీమ్‌ఇండియాకు అందించిన సూర్యకుమార్‌యాదవ్ స్థానంలో శ్రేయస్‌కు కెప్టెన్సీ బాధ్యతలను బీసీసీఐ అప్పగించింది. అతడు వ్యక్తిగతంగా నాణ్యమైన ఆటతీరు ప్రదర్శించాడు. కానీ, మిగతా ప్లేయర్ల నుంచి సరైన సహకారం లభించడం లేదు. మరీ ముఖ్యంగా బౌన్సీ పిచ్‌లను అర్థం చేసుకుని ఆడాల్సిన బ్యాటర్లు పదేపదే పొరపాట్లు చేస్తూ పెవిలియన్‌కు చేరారు. దీంతో ఆటగాళ్ల ప్రదర్శనపై ఇప్పటికే బీసీసీఐ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆఖరి టీ20 ముగిసిన తర్వాత సమీక్ష ప్రక్రియ మొదలవుతుందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్ అనంతరం.. వన్డే సిరీస్‌లో తలపడనుంది. ఆ తర్వాత జింబాబ్వే పర్యటనకు టీమ్‌ఇండియా వెళ్లనుంది. ఇంగ్లాండ్‌పై నాలుగో టీ20లోనూ ఓడిపోయిన భారత్‌పై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. మరీ ముఖ్యంగా మేనేజ్‌మెంట్ వ్యూహాలేంటో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. "నాలుగో టీ20లో వాషింగ్టన్ సుందర్‌ను ఆడించారు. కానీ, అతడు గత కొన్ని మ్యాచుల్లో గొప్పగా ఏమీ ఆడలేదు.

## జట్టు ఓడినప్పుడు.. ఎంత మంచి ఇన్నింగ్స్‌కైనా విలువ ఉండదు: శ్రేయస్

అనుకున్నదే అయింది.. ఇంగ్లాండ్ గడ్డపై మరోసారి భారత ఆటగాళ్లు తేలిపోయారు. నాలుగో టీ20లో ఇటు బ్యాటింగ్.. అటు బౌలింగ్‌లో విఫలమై సిరీస్‌ను కోల్పోయారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఒక్కడే కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అయితే, అది జట్టు విజయానికి సరిపోలేదు. బౌలింగ్ మరీ పేలవంగా ఉండటంతో ఓటమి తప్పలేదు. ఈ క్రమంలో శ్రేయస్ కీలక వ్యాఖ్యలు చేశాడు. పరివర్తన దశలో ఉన్నప్పుడు తప్పులు జరుగుతుంటాయని, వాటి నుంచి త్వరగా పాఠాలు నేర్చుకోవాలని తెలిపాడు. ఇక తన ఇన్నింగ్స్‌పైనా స్పందించాడు. 'ఈ ఓటమితో చాలా నిరుత్సాహానికి గురయ్యాం. 158 పరుగుల లక్ష్యమంటే ఏమాత్రం సరిపోదు. మా బౌలర్లకు ఒకటే చెప్పా.. లెంగ్త్ బౌలింగ్‌ను పదేపదే విసిరితేనే గెలిచేందుకు అవకాశాలు ఉంటాయి. మా ప్రణాళికలను అమలు చేయడంలో విఫలమయ్యాం. పేస్‌లో మార్పులు చేయడంతో ఇంగ్లాండ్ బ్యాటర్లు ఈజీగా బౌండరీలు బాదేశారు. నా వ్యక్తిగత ప్రదర్శనపై సంతృప్తిగానే ఉన్నా. కానీ, జట్టు ఓడినప్పుడు ఎంత మంచి ఇన్నింగ్స్ అయినా విలువ ఉండదు. మ్యాచ్‌ను కోల్పోవడం నిరాశకు గురి చేసింది. నా టీమ్ గెలవాలని కోరుకుంటా. కానీ, అది కుదరలేదు. వచ్చే మ్యాచ్‌లో కచ్చితంగా ఇంకాస్త మెరుగ్గా రాణించేందుకు ప్రయత్నిస్తా'' అని శ్రేయస్ తెలిపాడు. "ఇప్పుడు మా జట్టు పరివర్తన దశలో ఉంది. ఇలాంటి సమయంలో పొరపాట్లు జరగడం సహజమే. ఇంగ్లాండ్ కండీషన్లలో చాలా మంది క్రికెటర్లు తొలిసారి ఆడుతున్నారు. కచ్చితంగా తప్పులు చేస్తారు. వాటి నుంచి త్వరగా బయటపడి నేర్చుకోవడమే అత్యంత కీలకం. ఓవర్సీస్‌లో ఏదీ తేలికగా ఉండదు. మా కుర్రాళ్లపై నమ్మకం ఉంది. త్వరగానే అలవాటు పడతారనుకుంటున్నా'' అని శ్రేయస్ వెల్లడించాడు. భారత్‌పై ద్వైపాక్షిక టీ20 సిరీస్ గెలవడం ఇంగ్లాండ్‌కు ఇదే తొలిసారి. గత ఆరు సిరీసుల్లో టీమ్‌ఇండియా ఐదింట్లో విజయం సాధించింది. ఒక సిరీస్ డ్రా అయింది. ఒకే మ్యాచ్‌లో ఇరు జట్ల కెప్టెన్లు 50+ స్కోర్లు చేయడం 37వ సారి. ఇందులో 16 మ్యాచులు ఐసీసీ సభ్య దేశాల మధ్య జరిగాయి. ఇక ఇంగ్లాండ్–భారత్ మ్యాచుల్లో ఇదే తొలిసారి. టీమ్‌ఇండియా 2019లో వరుసగా రెండు టీ20 సిరీస్‌లను కోల్పోయింది. న్యూజిలాండ్ చేతిలో 2–1, ఆసీస్ చేతిలో 2–0 తేడాతో ఓటమిని చవిచూసింది. ఇప్పుడు ఐర్లాండ్, ఇంగ్లాండ్‌పై పరాజయం ఎదుర్కొంది. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అరుదైన ఘనత సాధించాడు. నాలుగు మ్యాచుల్లో 190 పరుగులు చేశాడు. భారత సారథిగా అతడే టాప్ స్కోరర్. సూర్యకుమార్ (171) ముందుండేవాడు.



